మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

శనివారం SATURDAY 4.5.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 330 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



గోదావరిఖనిలో శుక్రవారం జరిగిన రోడ్‌షోలో జనసందోహాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో పెద్దపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



అదానీ బొగ్గుతో సింగరేణి బుగ్గి

బడేభాయ్, చోటేభాయ్ కలిసి భారీ కుట్ర.. కార్మికులారా జర భద్రం: కేసీఆర్

- ప్రైవేటీకరణే మోదీ పాలన.. ప్రమాదంలో ప్రభుత్వరంగం
- నన్ను ఎలాగైనా నిలువరించాలనే నా గొంతు నొక్కిండ్రు!
- బస్సుయాత్రపై కాంగ్రెస్, బీజేపీ కుట్ర.. అందుకే నిషేధం
- హామీలకు ముఖ్యమంత్రి ఎగనామం.. ప్రజలకు మోసం
- పంట బోనస్ ఓ బోగస్.. తులం బంగారం తుస్సుమన్నది
- తొండి చేసేటోడే దేవుడి మీద రోజుకో ఒట్టు పెట్టుకుంటడు
- బీజేపీకి 200 కూడా రావు.. కేంద్రంలో వచ్చేది సంకీర్ణమే
- కాంగ్రెస్‌ది మూడోస్థానం.. దానికి ఓటేస్తే బీజేపీకే లాభం
- తెలంగాణ ప్రమాదంలో పడ్డప్పుడు మనం ఏకం కావాలె
- ఎన్నికల్లో గత్తరబిత్తర కావొద్దు.. ఆలోచించి ఓటెయ్యాలె
- ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపుతోనే తెలంగాణ గెలుపు
- గోదావరిఖని రోడ్‌షోలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

ఎక్కువ ధరకు అదానీ బొగ్గు కొనాలని ప్రధాని ఒత్తిడి .. అదే అదానీని దావోస్‌లో కలిసి స్వాగతం చెప్పిన రేవంత్

మంచిగ ఉన్న సంస్థను నిండా ముంచిందే కాంగ్రెస్.. ఇప్పుడు పూర్తిగా లేకుండా చేయాలని చూస్తున్నరు

బీజేపీ, కాంగ్రెస్ కలిసి సింగరేణిని అమ్మేయజూస్తున్నయ్.. అప్రమత్తంగా లేకపోతే కార్మికుల నోట్లో మట్టే

రెండు తులాలు ఇస్తున్నరట గదా?

రేవంత్ హామీల ఎగవేతపై రామగుండం రోడ్‌షోలో కేసీఆర్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. 'మనం కల్యాణలక్ష్మి ఇస్తుంటిమి. వీళ్లు తులం బంగారం కలిపి ఇస్తమన్నరు. ఇచ్చిండ్రా? మీకు రెండు తులాలు వచ్చిందటగదా. నిజమేనా?' అనగా.. లేదు లేదంటూ ప్రజలనుంచి సమాధానం వచ్చింది. 'కనీసం తులం బంగారమన్న ఇచ్చిండ్రా? లేదా?' అని అడగగా.. 'ఎక్కడా రాలేదు' అని ప్రజలు ప్రతిస్పందించారు. 'అంటే తులం బంగారమూ తుస్సుమన్నట్టేనా' అని కేసీఆర్ అనడంతో నవ్వులు విరిశాయి. మరో సందర్భంలో 'మీ అందరికీ 6వేల పెన్షన్ ఇచ్చిండ్రంట కదా' అని కేసీఆర్ ప్రశ్నించగా.. ప్రజలు రాలేదని సమాధానమిచ్చారు. 'నాలుగు వేల పెన్షన్ కూడా ఇయ్యట్లేదా? మేం ఇచ్చిన రెండువేల పెన్షన్ కూడా జనవరి నెలలో ఎగబెట్టిండ్రు గుర్తున్నదా?' అని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

ఎన్నికల్లో మతాల గురించి మాట్లాడటం నిబంధనలకు విరుద్ధం. హోంమంత్రి అమిత్‌షా రోజూ దేవుడిబొమ్మ నెత్తిమీద, చేతుల్లో పెట్టుకొని సభల్లో మాట్లాడితే ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు కనిపించదు. డైరెక్ట్‌గానే హిందువులు, ముస్లింలని అడ్డగోలుగా స్వయంగా దేశ ప్రధాని మాట్లాడితే ఈసీకి కనిపించదు. 'నీ గుడ్లు పీకి గోలీలు ఆడతా.. నీ పేగులు తీసి మెడలో వేసుకుంటం, నిన్ను పండబెట్టి తొక్కుతం' అని సీఎం మాట్లాడితే ఎన్నికల కమిషన్‌కు అది సభ్యంగా కనిపిస్తున్నది. - కేసీఆర్

వాళ్ల గుండెలు వణుకుతున్నయ్.. అందుకే ఆగవట్టిండ్రు

48 గంటల తర్వాత.. నిషేధించిన నా గొంతు మళ్లీ మాట్లాడుతున్నది. నేను ఏం చేశానని నా గొంతును ఆపారు? ఎందుకు నా గొంతు నొక్కిండ్రు? కేసీఆర్ బస్సుయాత్ర ప్రారంభమైన తర్వాత కాంగ్రెస్, బీజేపీలకు గుండెలు వణుకుతున్నయ్. ఇద్దరికిద్దరు కుమ్మక్కయ్యి ఎట్లయిన నన్ను ఆగవట్టాలెనని, నిలువరించాలెనని కుట్ర చేసి, నాపై బ్యాన్ పెట్టించిండ్రు. - కేసీఆర్

› 2

కదం తొక్కిన ఖని.. జనం ప్రతిధ్వని

కార్మిక క్షేత్రంలో కేసీఆర్‌కు అపూర్వస్వాగతం › 5

రోడ్‌షోతో జనసంద్రమైన గోదావరిఖని చౌరస్తా

నవ్వుతూ.. నవ్విస్తూ ప్రశ్నలు సంధించిన కేసీఆర్

వామపక్షాలకు కేసీఆర్ సూటి సవాల్

మీరు కాంగ్రెస్ వైపా.. కార్మికుల వైపా? › 5

అదానీతో మిలాఖత్‌పై సీఎంతో జవాబు చెప్పించండి

నేటిలోగా నా ప్రశ్నకు బదులివ్వండి: కేసీఆర్

జూన్ 2న 'టెట్'

రాష్ట్ర ఆవిర్భావం రోజున నిర్వహణపై విమర్శలు

సబ్జెక్టుల వారీగా పరీక్షల షెడ్యూల్ విడుదల

› 6



రోహిత్ ఆత్మహత్యపై రాష్ట్ర పోలీసుల నివేదికను నిరసిస్తూ శుక్రవారం హెచ్‌సీయూలో ఆందోళనకు దిగిన విద్యార్థులు

రోహిత్ వేముల దళిత్ కాదట!

ఆయన ఆత్మహత్యకు వివక్ష కారణం కాదట

కులం బయటపడుతుందనే బలవన్మరణం

హైకోర్టుకు రాష్ట్ర పోలీసుల దర్యాప్తు నివేదిక

నిందితులైన బీజేపీ నేతలందరికీ క్లీన్‌చిట్

మరి నాటి రాహుల్ పరామర్శ సంగతేంది?

మ్యానిఫెస్టోలో చెప్పిన 'న్యాయం' ఇదేనా?

దర్యాప్తు తీరుపై తల్లి, సోదరుడి అనుమానం

మళ్లీ హెచ్‌సీయూలో విద్యార్థుల ఆందోళన

కుల వివక్షతో అవమానానికి గురై ఆత్మహత్య చేసుకున్న హెచ్‌సీయూ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఎనిమిదేండ్ల కిందట అప్పటి ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ నిరాహార దీక్షలో పాల్గొన్నారు. కుల ఆధిపత్యానికి దళిత విద్యార్థి బలయ్యాడని గొంతెత్తారు. ఈ ఘటనతో కదిలిపోయిన రాహుల్ ఏకంగా పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తాజా మ్యానిఫెస్టోలో 'రోహిత్ వేముల యాక్ట్'ను చేర్చారు. విద్యాసంస్థల్లో కుల వివక్షపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అదే కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం రోహిత్ వేముల అసలు దళితుడే కాదని కోర్టుకు ప్రభుత్వం నివేదిక సమర్పించింది. ఫలితంగా హైకోర్టు ఆ కేసును మూసివేస్తూ నిందితులుగా పేర్కొన్నవారందరికి క్లీన్‌చిట్ ఇచ్చింది. కాంగ్రెస్ అగ్రనేత దళితుల పక్షాన నిలబడితే, రేవంత్‌రెడ్డి సర్కారు మాత్రం దళితులుగా కూడా గుర్తించడం లేదంటూ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం హెచ్‌సీయూలో భారీ ప్రదర్శనకు దిగారు. › 8

భాగ్ రాహుల్ భాగ్



- కాంగ్రెస్ నేత పరుగులపై బీజేపీ ఎద్దేవా
- మొన్న అమేథీ.. నిన్న వయనాడ్.. ఇప్పుడు రాయ్‌బరేలీ నుంచి రాహుల్ పోటీ
- పరాజయ భయంతోనే సెగ్మెంట్ల మార్పు
- 24 ఏండ్లకు అమేథీని వీడిన గాంధీ పరివార్
- వయనాడ్‌లో గెలుపూ అనుమానమే
- అందుకే రాయ్‌బరేలీ నుంచి నామినేషన్

న్యూఢిల్లీ, మే 3: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఓటమి భయం వెంటాడుతున్నదా? ఒక్క ఓటమికే అమేథీలో పోటీకి భయపడ్డారా? గత ఎన్నికల్లో అమేథీలో ఎదురైన పరాభవం ఈసారి వయనాడ్‌లోనూ చూడబోతున్నారా? అందుకే ముందు జాగ్రత్తగా రాయ్‌బరేలీ నుంచి పోటీకి దిగుతున్నారా? రాహుల్ గాంధీ వ్యవహారశైలి చూస్తే ఈ అనుమానాలే కలుగుతున్నాయని బీజేపీ నేతలు అంటున్నారు. ప్రధాని మోదీ మొదలు కొని స్మృతి ఇరానీ దాకా భాగ్ రాహుల్ భాగ్ అంటూ ఎద్దేవా చేశారు. వయనాడ్‌లో ఎన్నికలు పూర్తయ్యే వరకు రాయ్‌బరేలీలో పోటీ చేస్తున్న విషయాన్ని బయట పెట్టకుండా వయనాడ్ ప్రజలను సైతం రాహుల్ గాంధీ మోసం చేశారని వారు ఆరోపించారు. అమేథీ, వయనాడ్‌లో రాహుల్ గాంధీ ఓటమిని అంగీకరించారని, ఓటమి భయంతో ఆయన పరుగులు తీస్తున్నారని బీజేపీ నేతలు ఎద్దేవా చేస్తున్నారు. కాగా, శుక్రవారం నామినేషన్లకు చివరి రోజున రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ, అమేథీ నుంచి గాంధీ కుటుంబానికి సన్నిహితుడు కిశోరీలాల్ శర్మ అభ్యర్థిత్వాలను కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసింది. సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ వెంట రాగా రాహుల్ నామినేషన్ దాఖలు చేశారు. 2004లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నుంచి పోటీ చేసి గెలిచారు. 2009, 2014లోనూ ఆయన అమేథీలో విజయం సాధించారు. 2019లో స్మృతి ఇరానీ చేతిలో 55 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఓటమిని ముందే గ్రహించిన రాహుల్.. ఆ ఎన్నికల్లో అమేథీతో పాటు కేరళలోని వయనాడ్‌లోనూ పోటీ చేసి, విజయం సాధించి పరువు కాపాడుకున్నారు. ఈసారి కూడా ఆయన వయనాడ్ నుంచి పోటీ చేశారు. రెండో స్థానంగా ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తున్నారు. అయితే, మూడుసార్లు గెలిచిన తన సొంత నియోజకవర్గం లాంటి అమేథీని వదిలేసి రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ పోటీ చేయడాన్ని బీజేపీ విమర్శిస్తున్నది. వయనాడ్‌లో ఓటమి భయంతో రెండో స్థానం నుంచి పోటీ చేయాలనుకుంటున్నారని,

› IIవ పేజీలో

ఒక్కొక్కరూ పది ఓట్లు వేయండి



సిద్దిపేట సభలో మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలు › 9

- కులం పేరును ప్రస్తావిస్తూ ఓట్ల అభ్యర్థన
- ఎన్నికల సంఘానికి బీఆర్‌ఎస్ ఫిర్యాదు
- ఈసీ హెచ్చరించినా మారని మంత్రి తీరు

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి



ప్రకటించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ › 9

ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక రద్దు

కాంగ్రెస్ నేత పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టు తీర్పు

తీర్పు అమలు నాలుగు వారాలు వాయిదా

సుప్రీంలో సవాలు చేస్తానన్న విఠల్ › 9



జన ప్రభంజనం.. | పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో శుక్రవారం జరిగిన రోడ్‌షోలో పాల్గొన్న అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

అదానీ బొగ్గుతో సింగరేణి బుగ్గి

- నేను సీఎంగా ఉన్నప్పుడు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదు
- సీఎం రేవంత్‌రెడ్డి సంతకాలు పెట్టి మరీ ఆహ్వానించాడు
- పార్లమెంట్ ఎన్నికలు కాగానే సింగరేణిని ఊడగొడుతరు
- బీఆర్‌ఎస్ గెలిస్తే.. మా సింగరేణిని ఎట్లా మూస్తవ్ అని కొట్లాడుతం
- పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ రోడ్‌షోలో కేసీఆర్



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చౌరస్తాలో జరిగిన రోడ్‌షోలో ప్రసంగిస్తున్న కేసీఆర్. చిత్రంలో బీఆర్‌ఎస్ పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ పుట్ట మధు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, మిర్యాల రాజిరెడ్డి, రఘువీర్‌సింగ్ తదితరులు

రాబోయే రోజుల్లో సింగరేణిని ఊడగొట్టి.. అదానీకి అప్పగిస్తే కార్మికుల నోట్లో మట్టి.. ప్రజల నోట్లో మట్టి.. మొత్తం సింగరేణి ప్రాంతాల్లో ఉన్న మన బతుకులు బొగ్గయ్యే పరిస్థితి ఉంటుంది. సింగరేణి కార్మికులు చైతన్యంతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. నేను ఎందుకు అదానీని అడుగు పెట్టనీయలేదో, ఇప్పుడు ముఖ్యమంత్రి ఎందుకు ఆహ్వానిస్తున్నాడో ఇంట్లో చర్చించుకోవాలి. -కేసీఆర్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలు పూర్తికాగానే ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి, మోదీ చోటే భాయ్ అదానీ కలిసి సింగరేణి సంస్థను ముంచుతారని బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ విధించిన 48 గంటల నిషేధం పూర్తవడంతో శుక్రవారం రాత్రి కేసీఆర్ తన బస్సుయాత్రను తిరిగి ప్రారంభించారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ తరపున ప్రచారం చేశారు. గోదావరిఖనిలో జరిగిన రోడ్‌షోలో ప్రసంగించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. తాను సీఎంగా ఉన్నప్పుడు అ దానీని తెలంగాణలో అడుగు పెట్టనీయలేదని, కానీ రేవంత్‌రెడ్డి దావోస్‌కు వెళ్లి సంతకాలు పెట్టి మరీ ఆహ్వానించారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికలు కాగానే సింగరేణిని ఊడగొడతారని, ఈ ప్రాంత ప్రజల బతుకులు బొగ్గయ్యే పరిస్థితి ఉన్నదని హెచ్చరించారు.

సింగరేణికి పూర్వవైభవం తెచ్చాం

నాడు మంచిగా ఉన్న సింగరేణిని నిండా ముంచిందే కాంగ్రెస్ పార్టీ అని కేసీఆర్ దుయ్యబట్టారు. 'సింగరేణి మన ఆస్తి. వందశాతం మనకే ఉండే. కేంద్రం నుంచి తెచ్చిన అప్పులు చెల్లించలేక.. 49% వాటాను కేంద్రానికి అప్పగించింది దిక్కుమాలిన కాంగ్రెస్ పార్టీ' అని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో సింగరేణికి ఎన్నో లాభాలు, పునర్వైభవం తెచ్చామని వివరించారు. నాడు హైటెక్, ఇంటెక్ పేరుపై ఉన్న కార్మిక సంస్థలు డిపెండెంట్ ఉద్యోగాలను మునగ్గొట్టాయని విమర్శించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక వాటిని పునరుద్ధరించి 19వేలకుపైగా యువతకు ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. ఆనాడు నష్టాల్లో ఉన్న సింగరేణిని లాభాల్లోకి తెచ్చామని వివరించారు. 'సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్' అనే పేరు మీద మెడికల్ కాలేజీ ఏర్పాటుచేశామని తెలిపారు. ఆ మెడికల్ కాలేజీలో 5% సీట్లు కార్మికుల పిల్లలకే వచ్చేలా కృషి చేశామని చెప్పారు.

సింగరేణిని ఊడగొడుతరు

'పార్లమెంట్ ఎన్నికలు కావడమే ఆలస్యం.. మోదీ, రేవంత్‌రెడ్డి కలిసి సింగరేణిని ఊడగొడతరు' అని కేసీఆర్ హెచ్చరించారు. 'తెలంగాణకు సింగరేణి కొంగుబంగారం. ఒక ఉద్యోగ వనరు. దీనిని ఇంకా విస్తరించాలి. బయ్యారం ఉక్కు గనులుగానీ, గోదావరి ఇసుక గనులు గానీ సింగరేణికే ఇవ్వాలని నేను ఆలోచించిన' అని పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదానీ బొగ్గును తీసుకొనిరావడానికి సీఎం ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. 'కొప్పుల ఈశ్వర్ ఎంపీగా గెలిస్తే.. మొత్తం బీఆర్‌ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో కొట్లాడి, పీక పట్టుకొని.. బిడ్డా మా సింగరేణిని ఎట్లా మూస్తవ్ అని కొట్లాడుతరు' అని పేర్కొన్నారు. లేదంటే సింగరేణి మాత్రం మునిగిపోతుందని, మీ బిడ్డగా గోదావరిఖని సెంటర్‌లో చెప్తున్నా.. 'తస్మాత్ జాగ్రత్త' అని హెచ్చరించారు. 'నాడు ఉద్యమంలో ఒక దీపంతో మరో దీపం వెలిగించినట్టు.. ఎప్పుడైతే తెలంగాణకు ప్రమాదం వస్తతో, ఎప్పుడైతే తెలంగాణ ప్రమాదంలో పడుతుందో మనం దరం ఏకం కావాలె. సరైన నిర్ణయాలు తీసుకోవాలె' అని కోరారు. ఎవరైతే మన హక్కులు కాపాడుతారో, మన నదులను కాపాడుతారో, మన సింగరేణినిని కాపాడుతారో ఆలోచించాలని విజ్ఞప్తిచేశారు. అలా జరుగకపోతే పెద్ద ప్రమాదంలో పడతామని హెచ్చరించారు.

ఎన్నికల కమిషన్‌కు కనిపించడం లేదా?

'రాజకీయాల్లో మతాల గురించి మాట్లాడటం చాలా పెద్ద తప్పు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధం. అమిత్‌షా రోజూ దేవుడిబొమ్మ నెత్తిమీత, చేతుల్లో పెట్టుకొని సభల్లో మాట్లాడితే ఈసీకి కనిపించదు. డైరెక్ట్‌గానే హిందువులు, ముస్లింలని అడ్డగోలుగా మతాన్ని అడ్డుపెట్టుకొని ప్రధాని మాట్లాడినా ఎన్నికల కమిషన్‌కు అది కనిపించదు' అని కేసీఆర్ ఎద్దేవా చేశారు. 'మన రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఏం చేశావని ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే.. అతను 'నీ గుడ్లు పీకి గోలీలు ఆడతా.. నీ పేగులు తీసి మెడలో వేసుకుంటం, నిన్ను పంటబెట్టి తొక్కుతం' అని మాట్లాడితే ఎన్నికల కమిషన్‌కు అది సభ్యంగా ఉన్నది' అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. అయితే, చేనేత కార్మికులకు అన్యాయం జరుగుతున్నదని మాట్లాడితే.. తనపై అన్యాయంగా కక్షకట్టారని చెప్పారు.

అదానీని నేను రానియ్యలే.. రేవంత్‌రెడ్డి ఆహ్వానించిండు

తాను అధికారంలో ఉన్నప్పుడు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, కానీ ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి సంతకాలు పెట్టి మరీ ఆహ్వానించారని కేసీఆర్ పేర్కొన్నారు. అదానీని ప్రధాని మోదీ చిన్నతమ్ముడిగా అభివర్ణించారు. 'భారతదేశాన్ని మింగుతున్న అదానీ.. రూ.14 లక్షల కోట్లకు పడగెత్తిన అదానీ.. మోదీ అండదండలతో దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కబళిస్తున్నడు. ఉన్న ఓడరేవులన్నీ ఆయనకు అన్యాక్రాంతం అయినయి. ఉన్న ఎయిర్‌పోర్టులన్నింటినీ అదానికే మోదీ అంకితం చేసిండు' అని విమర్శించారు. తాను సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో కరెంటు ఉత్పత్తి కోసం ఆస్ట్రేలియా నుంచి బొగ్గు దిగుమతి చేసుకోవాలని మోదీ సూచించారని తెలిపారు. ఆస్ట్రేలియా నుంచి బొగ్గు దిగుమతి చేస్తున్నది అదానీ అని పేర్కొన్నారు. 'అంటే అదానీకి లాభం కలిగించేందుకు.. మనకు రూ.4వేలకే టన్ను దొరికే బొగ్గును టన్నుకు రూ.28 వేలు పెట్టి ఆస్ట్రేలియా నుంచి కొనుమన్నడు. నేను ఒప్పుకోలే. నాకు సొంతంగా సింగరేణి బొగ్గు ఉన్నది. కాబట్టి నా ప్రాణం పోయినా సరే నేను ఒప్పుకోను అని చెప్పిన. బిడ్డా ఇక్కడ అడుగుపెడితే ఖబర్దార్ అని హెచ్చరించిన' అని పేర్కొన్నారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి దావోస్‌కు పోయి అదానీకి పాటక్ (గేట్లు) తెరిచాడని విమర్శించారు. తెలంగాణకు వచ్చి, నాలుగు చేతులా దోచుకోండి అని సంతకాలు పెట్టి వచ్చాడని మండిపడ్డారు.

పెద్దపల్లిలోనే 50వేల ఎకరాల్లో పంటనష్టం

'ఐదు నెలల కింద రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఇప్పుడెలా ఉన్నాయి? ఎవరి చేతగానితనం దానికి కారణం? ఇవాళ పెద్దపల్లి జిల్లాల్లోనే 50వేల ఎకరాలకుపైగా పంట పొలాలు ఎండిపోయాయి. దీనికి కారణం ఎవరు? గత పదేండ్లలో పొలాలు ఎప్పుడైనా ఎండాయా? పోయిన పదేండ్లలో పొలాలు ఎండాయా?' అని కేసీఆర్ ప్రశ్నించారు. ఇందుకు అశేష జనవాహిని.. 'లేదూ.. లేదూ' అంటూ సమాధానం ఇచ్చారు. ఈ పరిస్థితికి కారణం ఎవరో ఆలోచన చేయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. 'గత 9 ఏండ్లలో కరెంటు కోతలు లేవు. ఈరోజు కరెంటు కోతలు ఎవరు పెట్టారు' అని కేసీఆర్ ప్రశ్నించగా 'కాంగ్రెస్.. కాంగ్రెస్.. కాంగ్రెస్' అంటూ పెద్ద ఎత్తున ప్రజల నుంచి సమాధానం వచ్చింది. గోదావరిఖనిలో గత ఆరేడు సంవత్సరాలుగా పుష్కలంగా అందరికీ నల్లాపెట్టి, ప్రతి ఇంట్లో ప్రతి రోజూ నీళ్లు ఇచ్చామని తెలిపారు. 'ఈరోజు రెండ్రోజులకు ఒకసారి, దినం తప్పి, దినం నీళ్లు ఎందుకు వస్తున్నాయి? ఎందుకు మురికినీళ్లు వస్తున్నాయి? దీనికి కారణం ఎవరు? దీనిని ఆలోచన చేయాలి' అని పిలుపునిచ్చారు.

తొండి చేసేటోడే ఒట్లు పెడతడు..

ముఖ్యమంత్రి ఏ ఊరికిపోయినా.. ఆ దేవుళ్లమీద ఒట్లు వేస్తున్నడని కేసీఆర్ ఎద్దేవా చేశారు. 'యాదగిరిగుట్టకు పోతే నర్సన్నమీద ఒట్టు, భద్రాచలం పోతే రాములవారి మీద ఒట్టు.. ఎవడైనా పనిచేసేటోడు దేవుళ్ల మీద ఒట్లు పెట్టుకుంటడ? ఎప్పుడైనా తొండి చేసేటోడే ఒట్లు పెట్టుకుంటడు' అని ఎద్దేవా చేశారు. నాడు 'కేసీఆర్ ఒకటే లక్ష మాఫీ చేసిండు.. నేను రెండు లక్షలు మాఫీ చేస్తా.. మీరు ఉరుకుండ్రి, డబ్బులు తీసుకోండ్రి, డిసెంబర్ 9న పదిన్నరకే మొత్తం మాఫీ చేస్తానని నేటి ముఖ్యమంత్రి చెప్పిండు.. 'అయిందా రుణమాఫీ?' అని కేసీఆర్ ప్రశ్నించగా.. 'లేదూ.. కాలేదు..' అని ప్రజల నుంచి సమాధానం వచ్చింది. 'అప్పుడే డిసెంబర్ 9 పోవడంతో.. మళ్లీ ఇప్పుడు ఆగస్టు 15 అంటుండు. ఇంకొక మంత్రేమో మేము ఇస్తమని చెప్పలేదంటడు. మొత్తానికి నిరుద్యోగ భృతి కూడా ఎగబెట్టిండు. ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'వచ్చే ఎన్నికల్లో గత్తరబిత్తరగా, ఆగమాగం కాకుండా.. ఆలోచించి.. ఎవరు ఏ టైంకు ఉంటే కరెక్టో ఆలోచించి ఓటు వేయాలి' అని ప్రజలను కోరారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పే సమయం వచ్చింది

నాడు తెలంగాణ వస్తేనే ప్రజల బాధలు తీరుతాయని భావించి 2001లో గులాబీ జెండా ఎగురవేశానని కేసీఆర్ గుర్తు చేశారు. తన ప్రాణాలు అడ్డంపెట్టి తెలంగాణ కోసం పోరాడానని, చావునోట్లో తల పెట్టి రాష్ట్రాన్ని సాధించానని గుర్తుచేశారు. రాష్ట్రం వచ్చాక సింగరేణిని బాగు చేసుకున్నామని, ప్రాజెక్టులు కట్టుకున్నామని, నీళ్లు, కరెంటు తెచ్చుకున్నామని, పేదసాదలను ఆదుకున్నామని వివరించారు. ఇప్పుడు అరచేతిలో వైకుంఠం చూపించి, ఆరు గ్యారెంటీలు అని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టే సమయం, బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. తాము ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలయ్యాయని సీఎం అంటున్నాడని, నిజమేనా? అని కేసీఆర్ ప్రశ్నించగా.. 'కాలేదు.. కాలేదు' అంటూ ప్రజలు పెద్ద ఎత్తున సమాధానం ఇచ్చారు. 'ముసలివాళ్లకు రూ.4వేల పెన్షన్ వచ్చిందా?' అని ప్రశ్నించగా 'రాలేదు.. రాలేదు' అని ప్రజల నుంచి సమాధానం వచ్చింది. గతంలో రూ.200 పెన్షన్ ఉంటే తాను రూ.2 వేలకు పెంచి వారిని కడుపులో పెట్టుకొని కాపాడుకున్నామని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ రూ.4 వేలు ఇస్తమని చెప్పి మోసం చేసిందని దుయ్యబట్టారు. పైగా జనవరిలో రూ.2 వేలు కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టిందని మండిపడ్డారు. దళితులకు దళితబంధు బంద్ చేశారని విమర్శించారు. 'ఎందుకు బంద్ చేయాలె? వాళ్లు ఏం పాపం చేసినరు? వాళ్లు పైకి రావొద్దా? అట్లనే అట్టడుగున ఉండాల్నా? సంవత్సరానికి లక్ష కుటుంబాలన్నా పైకి రావాలని మేం పోయిన సంవత్సరం 1.30 లక్షల కుటుంబాలకు యూనిట్లు మంజూరు చేసినం. డబ్బులు కూడా విడుదల చేసినం. వాటిటన్నింటినీ రేవంత్‌రెడ్డి వాపస్ తీసుకున్నడు' అని పేర్కొన్నారు. దీనికి దళితులు ప్రతీకారం చెయ్యాలని, ముఖ్యమంత్రి మెడలు వంచాలంటే బీఆర్‌ఎస్‌కు ఓటేసి ఒక సురుకు అంటియ్యాలని కోరారు. అప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వానికి క్యాలి (తెలివి) వస్తుందని చెప్పారు. బీఆర్‌ఎస్ బలంగా ఉంటేనే ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం ఉద్యమాలు చేస్తుందని పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మూడో స్థానంలో ఉన్నదని, బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్యే పోటీ ఉన్నదని స్పష్టం చేశారు. ముస్లింలు పొరబాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే ఫలితం ఉండదని హెచ్చరించారు.

ముఖ్యమంత్రి మౌనం వెనుక మతలబేంది?

ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి నదులు అప్పజెప్తే చప్పుడు చెయ్యడని, కృష్ణా నదిని కేఆర్‌ఎంబీకి అప్పగించిండని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'గోదావరి నీళ్లు ఎత్తుకపోతా.. ఇచ్చంపల్లి దగ్గర ప్రాజెక్టు కడతా.. తమిళనాడుకు ఇస్తా, కర్ణాటకకు ఇస్తానని ప్రధాని మాట్లాతుంటే, సీఎంకి లెటర్లు పంపుతుంతే.. దానికి కుయ్యు లేదు. కుట్కులేదు' అని మండిపడ్డారు. 'నేను సీఎంగా ఉన్ననాడు ఇదే ప్రతిపాదన మోదీ తెచ్చిండు. నా ప్రాణం పోయినా మంచిదే కానీ గోదావరి నీళ్లు ఎత్తుకపోతనంటే ఒప్పుకోను అని చెప్పా. అలాంటిది ఈ ముఖ్యమంత్రి మౌనం వెనుక ఉన్న మతలబు ఏంది? అని ప్రజలు ఆలోచన చేయాలి' అని కోరారు. 'ఉన్న ఒకే ఒక్క నది గోదావరి. మన బతుకు. దాన్నే తీసుకొని పోతానంటే.. కాంగ్రెస్ పార్టీ, మంత్రులు, ఎవ్వరూ నోరు తెరిచి మాట్లాడే పరిస్థితి లేదు' అని అన్నారు.

ఎందుకు నా గొంతు నొక్కారు?

'48 గంటల తర్వాత.. నిషేధించిన నా గొంతు మళ్లీ మాట్లాడుతున్నది. నేను ఏం చేశానని నా గొంతును ఆపారు? ఎందుకు నా గొంతు నొక్కారు?' అని కేసీఆర్ నిలదీశారు. ' చేనేత కార్మికులకు ఆర్డర్లు ఇవ్వడం లేదు. గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ల బిల్లులు చెల్లించడం లేదు. అనేకమంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నిస్తే.. ఓ కాంగ్రెస్ నాయకుడు 'మొన్నటిదాక దొబ్బితిన్నది చాలదా? నిరోధ్‌లు, పాపడాలు అమ్ముకోండి' అన్నారు. చేనేత కార్మికులు మీకంత చులనగా కనిస్తున్నారా? అని కోపంలో నేనొక మాట అన్నా.. ప్రభుత్వంలో ఉన్న పెద్దలు అలా మాట్లాడొచ్చా? అని ప్రశ్నించినా.. బతుకు కావాలని, అన్నం కావాలని, చేసిన పనికి పెండింగ్‌లో ఉన్న రూ.370 కోట్లు పెండింగ్ ఉన్నాయని, కోపమొచ్చి నేనొక మాట అన్నా' అని వివరించారు. 'కేసీఆర్ బస్సుయాత్ర ప్రారంభమైన తర్వాత కాంగ్రెస్, బీజేపీలకు గుండెలు వణుకుతున్నయ్' అని కేసీఆర్ చెప్పగానే ప్రజల నుంచి హర్షధ్వానాలు వచ్చాయి. 'ఇద్దరికిద్దరు కుమ్మక్కయి, నన్ను నిలువరించాలని, కుట్ర చేసి, నాపై బ్యాన్ పెట్టారు' అని చెప్పారు. తాను గోదావరిఖనికి రెండు గంటల ముందే వచ్చానని, బ్యాన్ ఉండటం వల్ల 8.15 తర్వాత బయటికి వచ్చినట్టు తెలిపారు.

ఆటో కార్మికులారా పోరాడండి

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కటైనా అమలవుతున్నదా? అని కేసీఆర్ ప్రశ్నించగా.. 'లేదు.. లేదు' అని ప్రజల నుంచి సమాధానం వచ్చింది. 'మహిళాలకు రూ.2,500 వచ్చాయా?' అంటే.. 'లేదూ.. లేదూ' అని నినదించారు. 'రైతులకు రెండు లక్షల రుణమాఫీ అయిందా?' అంటే 'కాలేదు.. కాలేదు' అని చెప్పారు. 'ఆటో రిక్షా కార్మికుల చావులు ఆగుతున్నాయా'? అని అడుగ్గా.. 'లేదూ.. పెరిగినయ్' అంటూ ప్రజలు నినదించారు. 'మహిళలకు ఉచిత బస్సు పెట్టడం మంచిదే కానీ.. ఆటో రిక్షా కార్మికులను పట్టించుకోకపోవడం బాధ కలిగించింది' అని కేసీఆర్ చెప్పారు. 'ఉచిత బస్సు ప్రయాణం ద్వారా వచ్చే నష్టాలతో ఆటో రిక్షా కార్మికులు చనిపోతుంటే.. ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. వాళ్ల గురించి ఏ మంచీ, చెడూ ప్రభుత్వం ఆలోచన చేయడం లేదు' అని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఆటో రిక్షా కార్మికులకు న్యాయం జరగాలి. కార్మికులారా! మీరు ఉద్యమించండి. మీ తరపున బీఆర్‌ఎస్ ఉంటుంది. రేపు అసెంబ్లీలో మీ తరపున మేము పోరాడతాం' అని కేసీఆర్ హామీ ఇచ్చారు. 'రైతు కూలీలకు రూ.12,000 ఇస్తమని చెప్పారు. ఎక్కడైనా ఇచ్చిండ్రా? గతంలో మనం కల్యాణలక్ష్మి ఇచ్చేది.. వీళ్లు తులం బంగారం ఇస్తామన్నారు. మీకు రెండు తులాలు వచ్చిందట గద నిజమేనా?' అని కేసీఆర్ ప్రశ్నించారు. 'లేదూ.. ' అంటూ ప్రజల నుంచి సమాధానం వచ్చింది. 'లేదా.. రాలేదా?.. అయితే తులం బంగారం తుస్సుమన్నదా?' అని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

సింగరేణిని కాపాడాలంటే 'కొప్పుల' గెలవాలె

కొప్పుల ఈశ్వర్ సౌమ్యుడు, వినయం, విధేయత ఉన్నవాడని కేసీఆర్ అన్నారు. నిస్వార్థంగా బతికినవాడని, మంచి పేరుప్రతిష్ఠలు ఉన్నాయని పేర్కొన్నారు. గోదావరిఖని బిడ్డ అని, గని కార్మికుడని చెప్పారు. ఆయనను గెలిపిస్తే సింగరేణి కార్మికుల పక్షాన కొట్లాడుతారని భరోసా ఇచ్చారు. సింగరేణిని కాపాడుకోవాలంటే కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గుజరాత్.. పెట్టుబడిదారుల రాజ్యం

గుజరాత్ మాడల్‌ను ఆదర్శంగా తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, అది పెట్టుబడుల రాజ్యమని కేసీఆర్ విమర్శించారు. 'మోదీ సాబ్ మీరు మాకు పెద్దన్న. నేను మీ చిన్నన్న. నేను గుజరాత్ మాడల్‌లో చేసుకుంట అని రేవంత్ అంటున్నడు. ఆ గుజరాతీల మన్నుగూడ లేదు. అంతా దరిద్రం పాడైంది. పేదల సంక్షేమం సూడరు. పెట్టుబడిదారుల రాజ్యమే తప్ప కార్మికులకూగానీ, ప్రజలకూగానీ మాట్లాడే పరిస్థితి లేదు' అని వివరించారు.

మోదీ పాలనలో దేశానికి మేలు జరగలేదు

మోదీ పదేండ్ల నుంచి అధికారంలోకి వచ్చారని, ఆయన పాలనలో మత విద్వేషం, హింస, దేశాన్ని నాశనం చేయడం తప్ప.. దేశానికి ఎప్పుడూ మేలు జరగలేదని కేసీఆర్ ధ్వజమెత్తారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అయ్యిందా?' అని ప్రశ్నించగా.. 'కాలేదు' అని ప్రజల నుంచి పెద్ద ఎత్తున సమాధానం వచ్చింది. 'భేటీ బచావో, భేటీ పడావో.. ఏమన్నా ఉన్నదా?' అని అడడగా 'లేదు.. లేదు' అని సమాధానం ఇచ్చారు. 'మీ ఖాతాల్లో రూ.15 లక్షలు పడ్డయా?' అని ప్రశ్నించగా 'పడలేదు' అని సమాధానం వచ్చింది. 'ఇంకెప్పుడొస్తయి.. 15 ఏండ్లకు వస్తయా?' అని ఎద్దేవా చేశారు. 'మోదీ పాలనలో దేశం 'సత్యనాశ్' అయ్యింది. ఇప్పుడు ప్రపంచ మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.84. మోదీ కన్నా ముందు 14 మంది ప్రధానమంత్రులు పనిచేశారు. ఎవరి హయాంలోనూ రూపాయి విలువ ఇంత తక్కువకు దిగజారలేదు. దేశం అప్పులపాలయ్యింది. కంపెనీలు మాయమైతున్నయి. పబ్లిక్‌సెక్టార్ మూతపడుతున్నది. కార్మికులు రోడ్డున పడుతున్నరు. చివరికి రైల్వేలాంటి లక్షలాది కార్మికులు బతికే సంస్థను కూడా క్రమంగా ప్రైవేట్‌పరం చేస్తున్నారు' అని మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. మోదీ రాజ్యంలో ప్రైవేటీకరణ తప్ప మరేమీ లేదని మండిపడ్డారు. పరిస్థితి 'ఒకప్పుడు నేషనలైజేషన్.. ఇప్పుడు ప్రైవేటైజేషన్'గా మారిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ లేపే మత విద్వేషంలో పడితే మనకేం రాదని చెప్పారు.

బీజేపీకి ఈ ఎన్నికల్లో 200 సీట్లకు మించి రావని నివేదికలు వస్తున్నాయి. కేంద్రంలో రాబోయేది సంకీర్ణ ప్రభుత్వమే. 14 మంది బీఆర్‌ఎస్ ఎంపీలను గెలిపిస్తే తెలంగాణ నదులు, నీళ్లు, సింగరేణి, మన ఉద్యోగాలను కాపాడుకునే అవకాశం ఉంటుంది. బీఆర్‌ఎస్ ఎంపీలు గెలుపులోనే తెలంగాణ గెలుపు ఉన్నది.
- కేసీఆర్



పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో రోడ్‌షోలో చేతులెత్తి నినదిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులకు అభివాదం చేస్తున్న కేసీఆర్

4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 4 మే 2024
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

తిట్ల సీఎంగానే మిగిలిపోతాడా?



బుద్దా మురళి

దేశ ప్రధాని మొదలుకొని గ్రామ సర్పంచ్ వరకు తన ముద్ర ఉండాలని కోరుకుంటారు. ఇప్పటివరకు ఈ దేశాన్ని పాలించినవారు, రాష్ట్రాన్ని పాలించినవారు ఎక్కువ మంది దేశంపై, రాష్ట్రంపై తమదైన ముద్ర ఒకటి బలంగా వేశారు. ఆధునిక భారత దేశంపై జవహర్‌లాల్ నెహ్రూ వేసిన బలమైన ముద్ర చెరిగిపోనిది. ఆయన మరణించిన 60 ఏండ్ల తర్వాత, ఇప్పుడు కూడా నెహ్రూ ముద్రను చెరిపివేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంటే ఈ దేశంపై నెహ్రూ వేసిన ముద్ర ఎంత బలమైనదో అర్థం చేసుకోవచ్చు.

బ్రిటిష్ పాలకుల దరిద్రం వదిలిందనుకున్న దేశాన్ని ఆధునిక భారతదేశంగా మార్చడానికి జవహర్‌లాల్ నెహ్రూ వేసిన బలమైన పునాదులు ఇప్పటి పాలకులను ఇంకా భయపెడుతున్నాయి. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ఒక సభలో మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో ఒకచోట నెహ్రూ పటం ఉండేది. తాను ప్రధానమంత్రి అయ్యాక ఒకరోజు చూస్తే ఆ పటం లేదు. ఇక్కడ నెహ్రూ పటం ఉండేది, ఏమయ్యిందని అధికారులను అడిగితే, తీసేశామని చెప్పారు. వెంటనే ఆ పటాన్ని అక్కడ మళ్లీ పెట్టండని వాజపేయి ఆదేశించారు. మేరు పర్వతం లాంటి నాయకుల మనస్తత్వం అలా ఉంటుంది. మరుగుజ్జు మనస్తత్వం ఉన్నవారు పేరు చెరిపేయడం ద్వారా తమ ముద్ర వేయాలనుకుంటారు. దేశంలో కాంగ్రెస్ ఓటమిలో, ఢిల్లీలో కాంగ్రెస్‌కు అడ్రస్ లేకుండా చేయడంలో ఆప్ పార్టీ పాత్ర పెద్దదే. జవహర్‌లాల్ నెహ్రూ ముందుచూపుతో ఐఐటీలను ఏర్పాటుచేయకపోయి ఉంటే తాను ఎక్కడో పకోడీలు అమ్ముకొంటూ ఉండేవాడినని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు.

కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే తెలంగాణ ఎలా ఉండాలని పంచాయతీరాజ్ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి అక్కడ తొలిసారిగా మాట్లాడింది నెహ్రూ గురించే. అమెరికాలో పనిచేస్తున్న అధికారిని ఇండియాకు రప్పించి నెహ్రూ పంచాయతీరాజ్ వ్యవస్థను ఎలా బలోపేతం చేశారో వివరించారు. ఈ దేశంలో ప్రజలు, వివిధ పార్టీల నాయకులు నెహ్రూను ఒక పార్టీ నాయకుడిగా చూడరు. ఆధునిక భారత నిర్మాతగా చూస్తారు. హ్రస్వ దృష్టి గలవారు మాత్రమే మేరు పర్వతం లాంటి నాయకత్వాన్ని చూసి సహించలేరు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నెహ్రూ ముద్రను చెరిపివేయడానికి దేశ ప్రధాని ప్రయత్నిస్తుంటే రాష్ట్రంలో కేసీఆర్ ముద్రను చెరిపివేస్తానని అసెంబ్లీ సమావేశాల్లోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 2014లోనే ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని కంగనా రనౌత్ లాంటి వారు గట్టిగా నమ్మినట్టే గత పాలకుల ముద్రలను చెరిపివేయగలమనుకునే నాయకులు, వారి మాటలు నమ్మేవారుంటారు. కానీ, అది సాధ్యం కాదు. భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఐఐటీలు, ప్రభుత్వరంగ సంస్థలు వీటిలో నెహ్రూ ముద్ర ఎప్పుడూ ఉంటుంది. మన రాష్ట్రానికి వస్తే కేసీఆర్ నాయకత్వంలో జరిగిన ఉద్యమం వల్ల తెలంగాణ సాకారమైంది. తెలంగాణ ఉన్నంత వరకు ఈ ముద్ర ఉంటుంది. మహా టీవీలో ఐ.వెంకట్రావు జరిపిన ఇంటర్వ్యూలో గతంలో స్వయంగా రేవంత్‌రెడ్డే ఈ విషయం చెప్పారు. వేరే పార్టీ కాబట్టి మేం ఒప్పుకోవద్దు కానీ, కేసీఆర్ మొండి పట్టుదలతోనే తెలంగాణ సాధ్యమైందని చెప్పారు. ఇప్పుడు కేసీఆర్ ఉద్యమం వల్ల కాదు చంద్రబాబు, తాను జరిపిన ఉద్యమం వల్ల తెలంగాణ వచ్చిందని చెప్తున్నారు. చెప్పేవారికి మొహమాటం లేకపోవచ్చు కానీ, నమ్మేవారు ఎవరు?



ఒక రాజకీయ పార్టీ గెలుపోటములకు అనేక కారణాలుంటాయి. కానీ, అధికారంలోకి వచ్చినవారు పాలనలో తమదైన ముద్ర వేయడానికి ప్రయత్నించాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలే అవుతున్నది. ఇంకా నాలుగున్నరేండ్ల సమయం ఉన్నది. ఆరు నెలలకే అంతా అయిపోయిందని చెప్పడం సరికాదు. అదే సమయంలో కాళ్లు కడిగినప్పుడే కాపురం చేసే తీరు తెలుస్తుందన్నట్టు రేవంత్ రెడ్డి మొదటినుంచీ తిట్లనే తనదైన ముద్రగా చూపుతున్నారు. టీడీపీ అధ్యక్షునిగా ఉన్నప్పటి నుంచే తాను ఏదో ఒకరోజు ముఖ్యమంత్రిని అవుతానని రేవంత్‌రెడ్డి చెప్పేవారు. చదువుకునే రోజులనుంచే రేవంత్‌రెడ్డి ఈ మాట చెప్పేవారని కొందరు చెప్పన్నారు. కానీ, టీడీపీ అధ్యక్షునిగా ఉన్నప్పటి నుంచి నేను విన్నాను. సీఎంను అవుతానని చెప్పేవారు కానీ, మీడియాతో మాట్లాడినప్పుడు కానీ, ఇష్టాగోష్టి చర్చల్లో కానీ ఎప్పుడూ తెలంగాణ ఇలా ఉండాలని, నేను సీఎం అయితే ఇలా చేస్తానని కానీ ఎప్పుడూ చెప్పలేదు. తన లక్ష్యం సీఎం కావడం, అది ఎప్పుడూ దాచుకోలేదు పైకే చెప్పారు. కాలం కలిసి వచ్చి సీఎం అయ్యారు. ప్రతి సభలో, ప్రతిరోజు తిట్లనే తన ముద్రగా చూపుతున్నారు.

ఇందిరా గాంధీ అంటే 'గరీబీ హటావో' అని గుర్తుకువస్తుంది. ఎన్టీఆర్ అంటే రూ.2కే కిలో బియ్యం గుర్తుకువస్తుంది. ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్ అంటే వైఎస్సార్ పేరు గుర్తుకువస్తుంది. తెలంగాణ అంటేనే కేసీఆర్ గుర్తుకువస్తారు. ఇంటింటికి తాగునీరు, మిషన్ కాకతీయ, రైతు బంధు, రైతుబీమా వంటి ఎన్నో వినూత్న పథకాలపై కేసీఆర్ తన ముద్ర వేశారు. ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇప్పటివరకు రేవంత్ రెడ్డి ముద్ర అంటూ బలంగా ఏమీ లేదు. అలాంటి ప్రయత్నాలు కూడా కనిపించడం లేదు.

టీఎస్‌ను టీజీగా మార్చడం, సీఎం నివాసాన్ని డిప్యూటీ సీఎం నివాసంగా మార్చడం అవేమీ ముద్రలనిపించుకోవు. డ్రాయర్లు లాగుతా, చెడ్డీలు లాగుతా, పేగులు మెడలో వేసుకుంటా అనే తిట్ల రూపంలోనే తన ముద్ర గుర్తుండిపోవాలని రేవంత్‌రెడ్డి కోరుకుంటున్నారా? టీడీపీ నాయకునిగా, పీసీసీ అధ్యక్షునిగా రేవంత్‌రెడ్డి తిట్ల ద్వారా రాజకీయంగా మంచి ప్రచారం పొంది ఉండవచ్చు, ప్రయోజనం కూడా పొంది ఉండవచ్చు. కానీ, సీఎంగా ఈ తిట్ల వ్యూహం ఎంతవరకు ఆయనకు ఉపయోగపడుతుందనేది కాలమే సమాధానం చెప్తుంది.

రాష్ట్రంపై తనదైన ముద్ర వేయడానికి రేవంత్‌రెడ్డికి ఒక అవకాశం దొరికింది, తనకు తిట్ల ముద్ర సరిపోతుందనుకుంటున్నారా? పాలనలో ప్రజలకు చిరకాలం గుర్తుండే ముద్ర వేయాలనుకుంటున్నారా అనేది ఆయనే తేల్చుకోవాలి.

నల్ల చట్టాల నిరసన

నా దేశంలో నేను
నన్ను నేను కాపాడుకునే
స్థితికి వచ్చాను
నాగలి పట్టే చేతులతో
నల్ల జెండాలు పట్టించారు

ఇదేనా నా దేశ దుస్థితి
నల్ల చట్టాల రద్దు కొరకు
నా దేశం నడిరోడ్లపై నిరసనలు
ఇదేనా దేశ ప్రగతి

నా స్వాతంత్ర్య దేశంలో
నల్లజాతిపై నన్ను నేను
కాపాడుకునే రక్షణ నిరసన

అన్నం పెట్టే రైతునే
ఆగం పట్టిస్తే
ఆఖరికి మిగిలేది
బతుకు శూన్యమే

ఆకలి తీర్చే
అన్నపూర్ణమ్మను
అణచ చూస్తే
ప్రపంచంలో మిగిలేది శూన్యం

రైతు రాశులు పోసిన
ధాన్యాన్ని రాల్చకుంటే
ప్రపంచానికి పట్టెడన్నం
పెట్టే శక్తి ఎవడికుంది
ఎవడు పెట్టగలడు

నేను దున్నే సత్తువ
మట్టిలో పొర్లే గుణం
ఇత్తును నాటే బలం
ఏ రాజుకు ఉంది

అంతరిక్షంలో
చంద్ర మండలం చేరినా
రైతు బురద నుంచి
బువ్వ తియ్యకుంటే
చంద్ర మండలం చేరే శక్తి ఎవరిది

సృష్టి తర్వాత జీవం నిలవడానికి
ప్రత్యామ్నాయంగా

ప్రపంచాన్ని గడగడలాడించిన
అలెగ్జాండర్ అయినా
ఆస్తి లేకుండా ఒట్టి చేతులతో
ఒరిగిపోయాడు నేలకు

రైతు లేని రాజ్యముల
దేవుడున్న దేశముల
ఏమి చూడగలము
అంధకార మగుబడును

దేవుడు లేని దేశముల
రైతున్న రాజ్యముల
ఏమి చూడగలము
వెలుగు చూడగలము

కిసాన్‌ను కించపరిచి
గుళ్లకు పెట్టే వ్యయం
రైతులకు రాసి పోస్తే
రాదు దేశాన కరువు

నల్ల చట్టాల పోరు
రాదనుకున్న దేశాన
రానే వచ్చింది రైతుల నిరసన



దేవరపాగ కృష్ణయ్య
99634 49579

మోదీ.. గుజరాత్‌కే ప్రధాని!



వై.సతీష్ రెడ్డి
96414 66666

తెలంగాణ భారతదేశంలోనే ఉన్నది. రాష్ట్రం ఏర్పడి పదేండ్లు మాత్రమే అవుతోంది. కొత్త రాష్ట్రం, చిన్న రాష్ట్రమే అయినా దేశ ఆర్థికవ్యవస్థలో కీలకంగా ఉన్నది తెలంగాణ. దేశంలో సంపదను సృష్టిస్తున్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ముందువరుసలో ఉన్నది. అయితే ఏదైనా సరే ఇచ్చిపుచ్చుకోవడంలోనే సంతృప్తి, సంతోషం ఉంటాయి. కానీ, ఆ విషయంలో తెలంగాణకు తీవ్రమైన అన్యాయం జరుగుతున్నది. జరుగుతున్నదని అనడం కంటే ప్రధాని మోదీ పనిగట్టుకొని మరీ అన్యాయం చేస్తున్నారంటే బాగుంటుంది. నిలువెల్లా స్వార్థం, పక్షపాత ధోరణిని నింపుకొన్నారాయన.

ఎన్నికల ప్రచారం కోసం వచ్చి పచ్చి అబద్ధాలు చెప్పే మోదీ.. ఎందుకు తెలంగాణపై వివక్ష చూపుతున్నారు? ఒక తెలంగాణ బిడ్డగా అడుగుతున్నా.. తెలంగాణ చేసిన తప్పేంటి? ఎందుకు మాకు రావాల్సిన ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లిపోతున్నాయి? ఎందుకు మాకు రావాల్సిన నిధులు అహ్మదాబాద్‌కు తరలిపోతున్నాయి? ఒక్క తెలంగాణకే కాదు.. దక్షిణాది రాష్ట్రాలకు రావాల్సిన నిధులను ఎందుకు దారి మళ్లిస్తున్నారు? నిస్వార్థంగా పనిచేస్తానని ప్రమాణం చేసి పదవిలో కూర్చున్న మోదీ.. ఎంత స్వార్థపూరితంగా పనిచేస్తున్నారో కొన్ని ప్రత్యక్ష ఉదాహరణలు ఇప్పుడు చూద్దాం.

నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక 2022లో రెండోసారి గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా ఆ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.60 వేల కోట్ల నిధుల వరద పారించింది. పాత లెక్కలను ఒకసారి పరిశీలిస్తే.. 2017-21 వరకు కేవలం నాలుగేండ్లలో గుజరాత్‌కు రూ.6 లక్షల కోట్ల కేంద్ర పెట్టుబడులు వెళ్లాయి. ఇది జాతీయ పెట్టుబడుల సగటులో 25.8 శాతం. వందలో రూ.25 గుజరాత్‌కే తీసుకుపోతే మిగతా 28 రాష్ట్రాల పరిస్థితి ఏమిటి? అభివృద్ధి అంటే సమగ్రంగా, సమ్మిళితంగా ఉండాలి. అప్పుడే అన్ని రాష్ట్రాలు సమానంగా అభివృద్ధి చెందుతాయి. పేదరికం దూరమవుతుంది. కానీ, నిధులన్నీ గుజరాత్‌కే ఇవ్వాలి, కాంట్రాక్టులన్నీ తన ఇద్దరు గుజరాతీ మిత్రులకే ఇవ్వాలనేది నరేంద్ర మోదీ విధానం అని ఎప్పటినుంచో ఆరోపణలున్నాయి.

నోటికాడి బుక్కను లాక్కుంటున్న మోదీ: గుజరాత్ కోసం ఇతర రాష్ట్రాల నోటికాడి బుక్కను లాగేసుకుంటున్నారు మోదీ. ఇతర రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు వచ్చి, అక్కడే పెట్టాలని నిర్ణయించిన ప్రాజెక్టులను సైతం గుజరాత్‌కు మళ్లించుకుంటున్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి సంప్రదాయ వైద్య కేంద్రం (గ్లోబల్ సెంటర్ ఫర్ ట్రెడిషనల్ మెడిసిన్)ను హైదరాబాద్‌లో ఏర్పాటుచేయాలని మొదట నిర్ణయించారు. కానీ, ఆ తర్వాత దీన్ని గుజరాత్‌లోని జామ్‌నగర్‌కు తరలించారు. 2022 ఏప్రిల్ 19న ప్రధాని మోదీ దీనికి శంకుస్థాపన చేశారు. మనదగ్గరే ఏర్పాటై ఉంటే రూ.2 వేల కోట్ల పెట్టుబడులు వచ్చి ఉండేవి. దేశంలోనే మొదటి రైల్వే లోకోమోటివ్ తయారీ యూనిట్ లెక్క ప్రకారమైతే మన రాష్ట్రంలోని కాజీపేటలో ఏర్పాటవ్వాలి. ఏపీ విభజన చట్టంలోనూ ఈ హామీ ఉన్నది. కానీ, మోదీ తన గుజరాత్ కోసం మన కోచ్ ఫ్యాక్టరీని లాక్కెళ్లిపోయారు. గుజరాత్‌లోని దాహోద్‌లో ఏర్పాటు చేసుకున్నారు. దేశంలోనే మొదటి అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం (ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్) కేసీఆర్ చొరవతో హైదరాబాద్‌లో ఏర్పాటైంది. ఇది చూసి మోదీకి కన్నుకుట్టింది. ఆ వెంటనే దీనికి పోటీగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉన్న గిఫ్ట్ సిటీలో మారిటైమ్ ఆర్బిట్రేషన్ సెంటర్ పేరుతో మరో దాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. 2022-23 బడ్జెట్‌లో దానికి నిధులు కూడా కేటాయించారు.

దేశంలోనే మొట్టమొదటి సెమీ కండక్టర్ ప్లాంట్‌ను పుణెలోని తళేగావ్‌లో పెట్టాలని మొదట నిర్ణయించారు. కానీ, దీన్ని గుజరాత్‌లోని డొలేరాకు పట్టుకుపోయారు. ప్లాంట్ ఏర్పాటు కోసం అనుకూల ప్రాంతాలపై సర్వే చేసిన నిపుణులు డొలేరా కంటే తళేగావ్ అయితేనే బాగుంటుందని చెప్పినా.. దాన్ని మోదీ సర్కారు బుట్టదాఖలు చేసింది. తళేగావ్‌లోనే ఏర్పాటుచేసి ఉంటే మహారాష్ట్రకు రూ.1,54,000 కోట్ల పెట్టుబడులు వచ్చేవి.

మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వమే ఉన్నా.. గుజరాత్‌పై మోదీకి ఉన్న ప్రేమ కోసం దాన్ని త్యాగం చేయక తప్పలేదు. రూ.22 వేల కోట్ల వ్యయంతో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో పెట్టాల్సిన విమాన తయారీ కేంద్రాన్ని గుజరాత్‌లోని వడోదరకు షిఫ్ట్ చేశారు. భారతదేశపు మొదటి అంతర్జాతీయ ఆర్థిక సేవా కేంద్రాన్ని తన సొంత రాష్ట్రంలోనే ఏర్పాటు చేసుకున్నారు.

అన్నీ గుజరాత్‌కే...: దేశంలోనే మొట్టమొదటి బుల్లెట్ రైలు ప్రాజెక్టును నరేంద్రమోదీ సర్కారు 2017లో ప్రకటించింది. దీని ప్రారంభ స్థానం అహ్మదాబాద్. ఈ బుల్లెట్ రైలు ఎక్కువ దూరం ప్రయాణించేది కూడా గుజరాత్‌లోనే. ఈ ప్రాజెక్టు దూరం మొత్తం 508 కిలోమీటర్లు కాగా.. ఇందులో 348 కిలోమీటర్ల విస్తీర్ణం గుజరాత్‌లోనే ఉంది. ఇదీ మోదీ దేశభక్తికి, దేశం మీద, దేశంలోని ఇతర రాష్ట్రాల మీద ఉన్న ప్రేమకు మరో మచ్చుతునక. ఆయన పక్షపాత ధోరణి ఇక్కడితో ముగిసిపోలేదు. దేశంలోనే మొట్టమొదటి బల్క్ డ్రగ్ పార్క్‌ను తన రాష్ట్రానికే పట్టుకుపోయారు. దేశంలోని మొదటి మెడికల్ డివైజ్ పార్క్‌ను గాంధీనగర్‌లోనే పెట్టుకున్నారు. భారతదేశంలోనే అతిపెద్ద ఒలింపిక్ స్థాయి స్పోర్ట్స్ కాంప్లెక్స్ కూడా గుజరాత్‌లోనే ఏర్పాటు చేశారు. దేశంలో మొట్టమొదటగా ఎయిర్‌పోర్టు స్థాయిలో ఓ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయగా.. అది కూడా గుజరాత్‌కు చెందినదే. అంతరిక్షంపై ఆసక్తిని పెంచే లక్ష్యంతో భారీ టెలిస్కోపు ఏర్పాటుచేయాలని నిర్ణయిస్తే.. దాన్ని కూడా మోదీ సొంత ఊరైన వాద్‌నగర్ దగ్గరలో నిర్మించుకున్నారు. దేశంలో మొట్టమొదటి రైల్వే నేషనల్ యూనివర్సిటీ దాదాపు రూ.865 కోట్లతో గుజరాత్‌లోని వడోదరలో ఏర్పాటు చేశారు. హై స్పీడ్ రైల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (హెచ్‌ఎస్‌ఆర్‌టీఐ) కూడా ఇదే క్యాంపస్‌లో పెట్టారు. చివరికి గుజరాత్‌లోని మొతేరాలో అతిపెద్ద స్టేడియాన్ని నిర్మించి దానికి ఏకంగా తన పేరునే పెట్టుకున్నారు. 2023 ఐసీసీ వరల్డ్ కప్ కీలక మ్యాచ్‌లు ఇక్కడే జరిగాయి. వరల్డ్‌కప్ ప్రారంభ మ్యాచ్, అత్యంత కీలకమైన ఇండియా-పాకిస్థాన్ మ్యాచ్, అలాగే ఫైనల్ మ్యాచ్ కూడా ఇదే స్టేడియంలో నిర్వహించి.. మరోసారి తన స్వార్థబుద్ధిని బయటపెట్టుకున్నారు. 2022, 2023 ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లు కూడా గుజరాత్‌లోనే నిర్వహించారు. చివరికి.. అమెరికా అధ్యక్ష హోదాలో డొనాల్డ్ ట్రంప్ దేశానికి వస్తే.. మురికివాడలకు అడ్డుగా గోడలు, పరదాలు కట్టి మరీ గుజరాత్ ఇమేజ్ పెంచుకోవడానికి ఆయన్ను అక్కడికి తీసుకుపోయారు.



ఇతర రాష్ట్రాలపై మోదీ వివక్ష ఎలా ఉంటుందనే దానికి మరో ఉదాహరణ ఇప్పుడు చూద్దాం. తెలంగాణతో సహా దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ నాయకులు.. ఎక్కడికి వెళ్లినా ఊర్ల పేర్లు మారుస్తామని చెప్తుంటారు. ఇస్లాం మతస్థుల పేర్లతో ఉన్నాయని ఢిల్లీలో కొన్ని వీధుల పేర్లు మార్చారు. యూపీలోని కీలక పట్టణమైన అలహాబాద్ పేరును ప్రయాగ్‌రాజ్‌గా మార్చారు. అటు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ పేరును మార్చారు. కానీ, గుజరాత్ రాజధాని పేరు అహ్మదాబాద్. ఇప్పటికీ దాని పేరు అలాగే ఉన్నది. అలాగే అదే అహ్మదాబాద్ దగ్గరలో గిఫ్ట్ సిటీ పేరుతో ఓ పట్టణాన్ని నిర్మించారు. ఇతర రాష్ట్రాల్లో మాత్రం పేర్లు మార్చేస్తారు. గుజరాత్‌లో మాత్రం అన్నీ యథావిధిగా ఉంటాయి.

ఇలా చెప్పుకుంటూ పోతే.. మోదీ స్వార్థ రాజకీయాలకు బలైన రాష్ట్రాలు, రూటు మార్చుకుని గుజరాత్ గూటికి చేరిన నిధుల కహానీలు కోకొల్లలు. స్వరాష్ట్రంపై ప్రేమ తప్పు కాదు. కానీ, ఇతర రాష్ట్రాల కడుపుకొట్టి ఒక్క రాష్ట్రానికి దోచిపెట్టడమే క్షమించరాని నేరం. నరేంద్ర మోదీ, ఆయన సహచరుడు అమిత్ షా అదే నేరం పదే పదే చేస్తున్నారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' అన్న నినాదాన్ని.. 'గుజరాత్ కా సాత్.. గుజరాత్ కా వికాస్' అన్నట్టుగా మార్చేశారు. నిధులు, పెట్టుబడులు.. ఏవైనా సరే తమ సొంత రాష్ట్రానికి తరలించుకుపోవాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నారు. అందుకే ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో దేశ ప్రజలు వీరిని ఇంటికి పంపడం పక్కా. అప్పుడు సొంత రాష్ట్రంలో తప్ప మరోచోట తల దాచుకోలేరు. అందుకే ఇప్పుడే అన్నీ అక్కడికి తరలిస్తే రేపటి రోజున అక్కడైనా తమకు నాలుగు నూకలు దొరుకుతాయనే స్వార్థం వాళ్లది. దానికోసం ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపైనా కక్ష సాధిస్తున్నారు. బీజేపీ అధికారంలో ఉన్న తమ రాష్ట్రాల హక్కులను సైతం కాలరాస్తున్నారు. కాబట్టి యువత, ప్రజలు ఇప్పటికైనా ఆలోచించాలి.

(వ్యాసకర్త: మాజీ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ)



రాముడు చూపిన మార్గం సంగతేంటి?

మేం మా కెరీర్లను పణంగా పెట్టి రోడ్లెక్కి ఎండనక, వాననక పోరాటం చేశాం. కానీ, ఇప్పటికీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయలేదు. అరెస్టు సంగతేమో కానీ, ఇప్పుడు ఆయన కొడుకుకు టికెట్ ఇచ్చి దేశంలోని కోట్లాది మంది ఆడబిడ్డల మనోధైర్యాన్ని దెబ్బ తీశారు. రాముడి పేరు మీద ఓట్లు కావాలి, మరి ఆయన చూపిన మార్గం సంగతేంటి?

- సాక్షిమాలిక్, రెజ్లర్

ఎటమటం



సోషల్ మీడియా ఉంది జాగ్రత్త!

రేవంత్‌రెడ్డిని కూడా అరెస్టు చేస్తే ఓ పనైపోతదని సీపీఐ నేత నారాయణ కేంద్రానికి సలహా ఇచ్చారు. కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ ఇద్దరు సీఎంలను జైల్లో పెట్టిన కేంద్రం, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కూడా అరెస్టు చేస్తే ముగ్గురు సీఎంలను జైల్లో పెట్టినట్టు అవుతుందని ఆయన సూచించారు. ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీగా ఉన్న సీపీఐ నేత నారాయణ ఈ విధంగా మాట్లాడటం ఏమిటని ఆశ్చర్యపోతున్నారా? అవును నిజమే, అంతా సోషల్ మీడియా మాయ. కేంద్ర ప్రభుత్వాన్ని ఎండగట్టే క్రమంలో కాస్త వ్యంగ్యాన్ని జోడించి చేసిన వ్యాఖ్యలను ముందు వెనుకా కట్‌చేసి రేవంత్‌రెడ్డి అరెస్టుకు సీపీఐ నారాయణ డిమాండ్ చేసినట్టుగా సోషల్‌మీడియాలో వైరల్ అయింది. శృతిమించుతున్న సోషల్ మీడియా వైఖరి వల్ల భవిష్యత్‌లో సోషల్ మీడియా ఉంది జాగ్రత్త అని చట్టబద్ధమైన హెచ్చరిక చేసే రోజులు వచ్చినా ఆశ్చర్యం లేదు.



డివోషనల్ టూరిజమ్

సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కోసం రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న పర్యటన వల్ల కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు వస్తాయన్నది దేవుడికే తెలియాలి, కానీ ఏ దేవుడు ఎక్కడ ఉన్నది జనాలకు తెలియజేసేవిధంగా పరోక్షంగా డివోషనల్ టూరిజమ్ డెవలప్‌మెంట్‌కు ఆయన కృషిచేస్తున్నారని గాంధీభవన్‌లో ఓ సీనియర్ నాయకుడు కొత్త విషయం చెప్పారు. ఎన్నికల ప్రచార సభలకు సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడికెళ్తే, ఆ చుట్టుపక్కల ప్రాంతంలో ఉన్న దేవుళ్లపై ఒట్టేసి ఆగస్టు 15 కల్లా రుణమాఫీ చేస్తామని హామీ ఇస్తున్నారు. దీనివల్ల కాంగ్రెస్ సీట్ల మాటేమో కానీ, డివోషనల్ టూరిజమ్ మాత్రం బాగా డెవలపయ్యే అవకాశం లేకపోలేదని సదరు నాయకుడు చెప్పుకొచ్చారు.



హమ్ కిసీ సే కమ్ నహీ!

ఏ మాటకామాట చెప్పుకోవాలంటే... కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి స్టయిలే వేరు. ఆయన గెలిచినా, ఓడినా షాన్ మే ఫరక్ రాకుండా జాగ్రత్త పడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార షెడ్యూల్‌ను పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కరికే పీసీసీ ఖరారు చేసింది. మంత్రులు కూడా తమను ఇంచార్జీలుగా నియమించిన నియోజకవర్గాల్లో అభ్యర్థులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. కానీ, జగ్గారెడ్డి అలా కాకుండా, తనకు తానే తెలంగాణ కాంగ్రెస్ కమిటీ పేరిట లెటర్‌హెడ్ ముద్రించుకొని ఎన్నికల ప్రచార షెడ్యూల్ ప్రకటించుకున్నారు. సొంతంగా ప్రచార రథం, సొంత ఖర్చుతో అభ్యర్థి లేకుండానే పార్టీ తరఫున రోడ్ షో, కార్నర్ మీటింగ్, పబ్లిక్ మీటింగ్ కార్యక్రమాలను ఈ నెల 11 వరకు ఆయనే ప్రకటించుకున్నారు. ఇది చూసి నవాళ్లు జగ్గన్నా... మజాకా అంటున్నారు.



అందరూ మంత్రులే

రాష్ట్రంలో బీజేపీ తరపున పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులంతా తనను గెలిపిస్తే కేంద్ర మంత్రి అవుతానని ఎవరికివారు ప్రచారం చేసుకుంటున్నారు. గతంలో ఏపీ, తెలంగాణకు కలిపి కిషన్‌రెడ్డి ఒక్కరికే కేంద్ర మంత్రివర్గంలో స్థానం లభించింది. అలాంటిది ఈసారి ఎంతమందికి ఇస్తారని మీడియా వాళ్లు అడిగితే మాత్రం సమాధానం లేదు. ఏమో అవన్నీ తమకు తెలియదనీ.. గెలిస్తే కేంద్ర మంత్రి పదవి ఇస్తామని పార్టీ పెద్దలు చెప్పారని అంటున్నారు. ఇప్పటివరకు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, డీకే అరుణ, బండి సంజయ్, విశ్వేశ్వర్‌రెడ్డి, ధర్మపురి అరవింద్, మాధవీలత, రఘునందన్‌రావు మంత్రి పదవుల రేసులో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ లెక్కన రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులు తప్ప వట్టి ఎంపీలు ఎవరుండరన్న మాట!

- వెల్జాల



శుక్రవారం పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని గోదావరిఖనిలో కేసీఆర్ రోడ్‌షోకు తరలివచ్చిన అశేష జనవాహిని

కదంతొక్కిన ఖని.. జనం ప్రతిధ్వని

- కేసీఆర్ బస్సు యాత్రకు అపూర్వ స్వాగతం
- జనసంద్రమైన గోదావరిఖని చౌరస్తా
- నవ్వుతూ.. నవ్విస్తూ ప్రశ్నలు సంధించిన జననేత
- కాంగ్రెస్ గ్యారెంటీలను ప్రశ్నిస్తే.. రాలేదన్న జనాలు
- సింగరేణికి ప్రమాదమున్నదని జాగృతపర్చిన మాజీ సీఎం
- దిక్కులు పిక్కటిల్లేలా నినదించిన శ్రేణులు, అభిమానులు

కరీంనగర్, మే 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి, కేప్రకాశ్‌రావు): కార్మిక క్షేత్రం కదం తొక్కింది.. తరలివచ్చిన ప్రజలు, కార్మిక లోకంతో గోదావరిఖని చౌరస్తా జనసంద్రమైంది.. ఉద్యమ సారథి, గులాబీ దళపతి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్రకు అపూర్వస్వాగతం లభించింది. పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని గోదావరిఖనిలో శుక్రవారం కేసీఆర్ రోడ్‌షోకు అశేష జనవాహిని తరలివచ్చింది. ఎన్నికల కమిషన్ 48 గంటలపాటు ప్రచారంపై నిషేధం విధించిన అనంతరం తొలిసారిగా జరిగిన రోడ్‌షో గ్రాండ్ సక్సెస్ అయింది. కేసీఆర్ గోదావరిఖని పట్టణంలోకి రాగానే.. ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన రోడ్డుషో.. గోదావరిఖని చౌరస్తా వరకు కొనసాగింది. ఇసుకపోస్తే రాలనంత జనంతోపాటు అడుగడుగునా సంప్రదాయ నృత్యాల మధ్య కేసీఆర్ రోడ్‌షో కొనసాగింది. దారి పొడవునా బస్సులో నుంచి కేసీఆర్ అభివాదం తెలుపగా, ప్రజలు ఆయనను చూసేందుకు అమితాసక్తి చూపారు. ప్రధానంగా మహిళలు దారి పొడవునా కేసీఆర్‌కు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కేసీఆర్ జిందాబాద్, సీఎం జిందాబాద్.. అంటూ పలుసార్లు నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. పలుమార్లు కేసీఆర్ వారించినా.. ప్రజలు మాత్రం 'సీఎం జిందాబాద్' అన్న నినాదాలను మాత్రం ఆపలేదు. చౌరస్తాకు చేరుకున్న అనంతరం బస్సు పైకి కేసీఆర్ రాగానే.. గోదావరిఖని మొత్తం ధ్వనించేలా ప్రజలు పెద్దపెట్టున నినాదాలు చేశారు.. 'మా సీఎం మీరే' అంటూ.. చేసిన నినాదాలతో నలుదిక్కులు పిక్కటిల్లాయి. కేసీఆర్ రోడ్డు షో సందర్భంగా గోదావరిఖని మొత్తం గులాబీమయం అయింది. అనంతరం 28 నిముషాలపాటు ఉద్వేగభరితంగా కేసీఆర్ ప్రసంగించగా.. ప్రజలు ఎంతో ఆసక్తిగా విన్నారు. ప్రధానంగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై పలు ప్రశ్నలు సంధించారు. నవ్వుతూ, నవ్విస్తూ ప్రశ్నలు అడిగిన తీరు ప్రజలను ఆకట్టుకున్నది.

ప్రజల నుంచి విశేష స్పందన

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ఎండగట్టినప్పుడు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఒక్కొక్కదాని పేరు చెప్తూ వచ్చిందా? అని అడిగినప్పుడు జనం నుంచి 'రాలేదు.. రాలేదు' అంటూ సమాధానం వచ్చింది. ప్రధానంగా తులం బంగారం వచ్చిందా? అని అడిగిన ప్రశ్నకు జనం నుంచి 'రాలేదు.. రాలేదు' అంటూ సమాధానం వచ్చింది.. ఏ రెండు తులాలు వచ్చిదంట కదా.. అని నవ్వుతూ జోక్ వేయగా.. 'మళ్లీ రాలేదు.. రాలేదు' అంటూ చేతులూపుతూ చెప్పారు. ఇక్కడ మోసం జరిగిందా? అంటే అవును అంటూ అందరూ తలలూపుతూ సమాధానం చెప్పారు. అలాగే నాలుగు వేల పింఛన్ వచ్చిందా? అని కేసీఆర్ అడిగితే.. రాలేదంటూ మార్మోగేలా ప్రజల నుంచి సమాధానం వచ్చింది. ఇదే సమయంలో 'మీకు ఆరువేలు వచ్చిదంట కదా' అని కేసీఆర్ నవ్వుతూ ప్రశ్నించగా, అంతే స్పీడ్‌తో 'ఏమీ రాలేదు' అంటూ ప్రజల నుంచి సమాధానం వచ్చింది. మహిళలకు రూ.2500 వచ్చాయా? అంటూ కేసీఆర్ ప్రశ్నించగా.. ఏదీ రాలేదంటూ గట్టిగా చెప్పారు. రైతు కూలీలకు రూ.15 వేలు వచ్చినయా? అందరికీ రైతు బీమా వచ్చిందా? అంటూ ప్రశ్నించగా.. ఏదీ లేదంటూ చేతులూపుతూ ప్రజలు సమాధానం ఇచ్చారు. దళితబంధు వస్తుందా? అన్న ప్రశ్నకు.. రావడం లేదంటూ ప్రజలు సమాధానం చెప్పారు.

నినదించిన సింగరేణి కార్మికులు

'సింగరేణిని నిండా ముంచిందే కాంగ్రెస్ పార్టీ.. కేంద్రం వద్ద అప్పులు చేసి.. 49 శాతం వాటా కట్టబెట్టింది ఎవరు?' అని అడిగితే... కాంగ్రెస్, కాంగ్రెస్ అంటూ కార్మికులు నినదించారు. సింగరేణిలో 19 వేల డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చింది ఎవరు? అని అడిగితే.. అది మీరే మీరే అంటూ కేసీఆర్ వైపు వేలు చూపిస్తూ ప్రజలు సమాధానం చెప్పారు. మన సింగరేణి కొంగుబంగారం.. దానికి అన్యాయం జరిగితే మనమంతా ఒక్కటై పోరాడాలి అంటూ కేసీఆర్ చెప్పగా.. పిడికిళ్లెత్తి కేసీఆర్‌కు సంఘీభావం ప్రకటించారు. మీ బిడ్డ సింగరేణి కార్మికుడు... మృదు స్వభావి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కేసీఆర్ విజ్ఞప్తి చేయగా.. 'కొప్పుల జిందాబాద్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సింగరేణిపై సీపీఐ, సీపీఎం వైఖరులు చెప్పాలని కేసీఆర్ సభలో నిలదీసినప్పుడు జనం నుంచి విశేష స్పందన కానవచ్చింది.

వామపక్షాలకు కేసీఆర్ సవాల్

- మీరు కార్మికుల వైపా? కాంగ్రెస్ వైపా?
- అదానీతో మిలాఖత్‌పై సీఎంతో జవాబు చెప్పించండి
- నేటిలోగా నా ప్రశ్నకు జవాబివ్వండి: కేసీఆర్

గోదావరిఖని, మే 3: సింగరేణి గనుల సాక్షిగా, నల్లబంగారాలైన కార్మికుల సాక్షిగా వామపక్ష పార్టీలకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సూటి సవాల్ విసిరారు. 'మీరు కాంగ్రెస్ వైపా? కార్మికుల వైపా?' అని నిలదీశారు. 'ఇప్పుడు సింగరేణిని ముంచటానికి బీజేపీ, కాంగ్రెస్ ఏకం అవుతున్నాయి. అధిక ధరల ఆస్ట్రేలియా బొగ్గు తెచ్చి.. తెలంగాణకు అంటగట్టి, సింగరేణిని సర్వనాశనం చేయాలనుకుంటున్న మోదీ దోస్త్ అదానీకి రేవంత్‌రెడ్డి రెడ్ కార్పెట్ పరుస్తున్నరు. సింగరేణిని నిండా ముంచాలని చూస్తున్నరు. దీనిపై వామపక్ష నేతలు తమ వైఖరి చెప్పాలి. ఒకప్పుడు సింగరేణిలో కార్మికుల కుటుంబాలకు ఆదరువుగా ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలను పోగొట్టిందే కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం. ఆ ఉద్యోగాలను మేం పునరుద్ధరించాం. 19 వేల మంది పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చినం. సిమ్స్ అనే పేరు మీద సింగరేణి మెడికల్ కాలేజీ పెట్టుకున్నం. ఆ కాలేజీలో 5 శాతం కార్మికుల పిల్లలకే సీట్లు వచ్చేట్టు చేసినం. సింగరేణి అప్పుల్లో కూరుకుపోతే కేంద్రానికి వాటాను అమ్మేసిందే కాంగ్రెస్. దాన్ని నష్టాల్లో ముంచిందే కాంగ్రెస్. అటువంటిది సింగరేణిని లాభాల్లోకి తెచ్చి కార్మికులకు పంచినం. కాంగ్రెస్ దాన్ని ముంచితే, బీఆర్‌ఎస్ కాపాడింది. మరి వామపక్ష నాయకులు ఇప్పుడేం చెప్తరు? సింగరేణికి శాపం లాంటి అదానీతో ఎందుకు రాసుకుపూసుకు తిరుగుతున్నవ్? అని కాంగ్రెస్‌ను వాళ్లు నిలదీయాలి' అని కేసీఆర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో వెంటనే సమాధానం చెప్పించాలని డిమాండ్ చేశారు.

నేడు మంచిర్యాలలో కేసీఆర్ రోడ్‌షో

కేసీఆర్ బస్సుయాత్ర శనివారం మంచిర్యాల జిల్లాకు చేరుకోనున్నది. ముందు ప్రకటించిన విధంగానే మంచిర్యాలలో శనివారం సాయంత్రం భారీ రోడ్‌షో ఉంటుందని బీఆర్‌ఎస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

బీఆర్‌ఎస్ ఫిర్యాదును పరిష్కరించండి

ఫోన్ల ట్యాపింగ్‌పై కేంద్రానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్‌ఎస్ నాయకులపై తప్పుడు ప్రచారం జరగకుండా చూడాలన్న ఫిర్యాదును పరిష్కరించాలని హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తమ నేతల ప్రతిష్ఠను దెబ్బతీసేలా గూగుల్, యూట్యూబ్, ఇతర షోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న ప్రచారాన్ని నిరోధించడంలో కేంద్రం విఫలమైందంటూ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాసరెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి శుక్రవారం విచారణ జరిపారు. ఫోన్ల ట్యాపింగ్ అంశంపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాజనిత కథనాలు 2021లో కేంద్రం జారీచేసిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నాయని, బీఆర్‌ఎస్ నేతలపై నిరాధార ఆరోపణలు రాకుండా నిరోధించాల్సిన అవసరం ఉన్నదని పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది బీ మయూర్‌రెడ్డి వివరించారు. ఈ విషయమై గత నెల 25న కేంద్రానికి వినతిపత్రం ఇచ్చినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. బీఆర్‌ఎస్ నేతల ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్న సమాచారాన్ని గూగుల్, యూట్యూబ్ నుంచి తొలగించాలని, లేదంటే ఆ సమాచారం ఇతరులకు అందుబాటులో లేకుండా నియంత్రించేలా ఆయా సంస్థలకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీంతో బీఆర్‌ఎస్ వినతిపత్రంపై చట్టప్రకారం చర్యలు చేపట్టాలని హైకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది.

బీఆర్‌ఎస్ ప్రచారంలో అపశ్రుతి

- డీజే వాహనం దూసుకొచ్చి ఒకరి మృతి
- మరో ఇద్దరికి గాయాలు

పీర్జాదిగూడ, మే 3: బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో ఉన్న డీజే వాహనం బ్రేకులు ఫెయిలై ర్యాలీలో ఉన్న జనాలపైకి రావడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మేడిపల్లి పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో బోడుప్పల్ కార్పొరేషన్ దేవేందర్‌నగర్‌లో మాజీ మంత్రి మల్లారెడ్డితో కలిసి బీఆర్‌ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రచారంలో పాటల కోసం ఏర్పాటు చేసిన డీజే వాహనం బ్రేకులు ఫెయిలై అదుపుతప్పి ర్యాలీపైకి దూసుకొచ్చింది. ఈ ఘటనలో ఉప్పల్ కళ్యాణ్‌పురికి చెందిన శ్రవణ్ (24) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులను హుటాహుటిన దవాఖానకు తరలించారు.



ఇసుక పోసినా రాలనంత..

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్నర్ మీటింగ్‌కు ప్రజలు ఇసుక పోసినా రాలనంతగా పోటెత్తారు. కేవలం ఒక్క మండల పరిధిలో జరిగిన ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరు కాగా సుమారు 10వేల మందికి పైగా తరలివచ్చి గులాబీ పార్టీపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. - ఇల్లంతకుంట

సీఎం వచ్చినా.. కానరాని స్పందన

ఇదే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని సిరిసిల్ల పట్టణంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభకు సాక్షాత్తూ సీఎం రేవంత్ రెడ్డి వచ్చినా ప్రజల్లో స్పందన కరువైంది. 'పది నిమిషాల్లో సీఎం వస్తున్నారు.. అంతా కూర్చోవాలి' అని వేదికపై నుంచి నేతలు చేసిన విజ్ఞప్తులను కూడా పట్టించుకోకుండా వచ్చిన కార్యకర్తలు సైతం లేచి వెళ్లిపోవడం కనిపించింది. సుమారు 2వేల మంది కూడా లేకపోవడంతో రేవంత్ వచ్చే సమయానికి ఇక్కడి ఆరుగ్యాలరీల్లో నాలుగు పూర్తిగా ఖాళీ అయ్యాయి. రాత్రి 8.48 గంటలకు రేవంత్‌రెడ్డి చేరుకొని ప్రసంగిస్తుండగా 95శాతం ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి.
- రాజన్న సిరిసిల్ల నమస్తే తెలంగాణ



తుస్సుమన్న జనజాతర సభలు

- జనం లేక కాంగ్రెస్ మీటింగ్‌లు వెలవెల
- సీఎం మాట్లాడుతుండగా ఖాళీ కుర్చీలు
- జగిత్యాల జిల్లా రాజారాంపల్లి, సిరిసిల్లలో సభలు ఫ్లాఫ్
- బీజేపీకి ఓటేస్తే రిజర్వేషన్లు రద్దే: సీఎం రేవంత్‌రెడ్డి

రాజన్న సిరిసిల్ల, మే 3 (నమస్తే తెలంగాణ)/ వెల్గటూర్: జనజాతర సభలు తుస్సుమన్నాయి. జనం లేక కాంగ్రెస్ సభలు వెలవెలబోయాయి. సీఎం సమయానికి రాకపోవటంతో జనం అసహనాన్ని వ్యక్తం చేశారు. మిట్టమధ్యాహ్నం మండుటెండల్లో సభలు ఏర్పాటు చేయగా, అనుకున్న సమయం కన్నా సీఎం ఆలస్యంగా వచ్చారు. దీంతో సభలకు వచ్చిన వాళ్లంతా ఇంటిదారి పట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి, సిరిసిల్లలోని మొదటి బైపాస్‌రోడ్డులో ఉన్న మైదానంలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ మీటింగ్‌లు అట్టర్‌ఫ్లాఫ్ అయ్యాయి. రాజారాంపల్లి సభకు సీఎం మధ్యాహ్నం 2.30 రావాల్సి ఉండగా, సాయంత్రం 6.30 గంటలకు వచ్చారు. అయితే, మధ్యాహ్నం 12 గంటలకే వచ్చిన జనాలు మీటింగ్ ఆలస్యం కావటంతో విసిగి వేసారి వెనుతిరిగి వెళ్లిపోయారు. సిరిసిల్లలో అయితే పది నిమిషాల్లో సీఎం వస్తున్నారని, కూర్చోవాలని నేతలు చెప్పినా.. జనం, కార్యకర్తలు వారి విజ్ఞప్తులను పట్టించుకోకపోవటం గమనార్హం. సభకు వచ్చిన జనంలో 95 శాతం వెళ్లిపోయారు. రాత్రి 8.48 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సభాస్థలికి చేరుకున్నారు. ఆయన ప్రసంగిస్తుండగా సభలో అన్నీ ఖాళీ కుర్చీలే కనిపించాయి. బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉన్న సిరిసిల్లలో పెద్దఎత్తున జన సమీకరించి సక్సెస్ చేద్దామనుకున్న నేతలు తీవ్రనిరాశ, నిస్పృహకు లోనయ్యారు.

బీజేపీకి వేసే ప్రతి ఓటు రిజర్వేషన్ రద్దుకే: సీఎం

బీజేపీకి వేసే ప్రతి ఓటు దళితులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేయడానికేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రెండు సభల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 400 ఎంపీ సీట్ల కోసం మోదీ చూస్తున్నారని, అలా గెలిపిస్తే మోదీ అధికారంలోకి రాగానే రిజర్వేషన్లు రద్దు చేస్తారని ఆరోపించారు. రాష్ర్టానికి మోదీ ఏమీ ఇవ్వలేదని గాడిద గుడ్డును సీఎం ప్రదర్శించారు. విభజన చట్టంలోని హామీలను బీజేపీ ప్రభుత్వం నెరవేర్చలేదని, పార్లమెంటు సాక్షిగా తెలంగాణ ఏర్పాటుపై మోదీ అవమానకరంగా మాట్లాడారని మండిపడ్డారు. ప్రాజెక్టులకు జాతీయ హోదా ప్రకటించని బీజేపీకి ఓటెందుకు వేయాలని ప్రశ్నించారు.

ఎండపల్లి స్టేజీ వద్ద ప్రమాదం.. ఇద్దరికి గాయాలు

రాజారాంపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి సభకు వచ్చి తిరిగివెళ్తున్న వారిలో ఇద్దరు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ధర్మపురి మండలంలోని జైనకు చెందిన నలుగురు తమ ఆటోలో వెళ్తుండగా, ఎండపల్లి స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో జైనకు చెందిన సుధీర్, సత్యానికి తీవ్ర గాయాలు కావటంతో జగిత్యాల దవాఖానకు తరలించారు.

రేవంత్ రాజీనామాకు సిద్ధమా?

ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తవా? చేయవా? • ఆరు గ్యారెంటీలు అమలు చేస్తవా? చేయవా? • సూటిగా చెప్పు.. డొంక తిరుగుడు మాటలొద్దు

- అమలు చేస్తే రాజీనామాకు సిద్ధం
- నువ్వు సిద్దిపేటకు వస్తే నేనే స్వాగతం చెప్తా
- శాలువా కప్పి రాజీనామా ఆమోదించుకుంటా
- లేకపోతే కొడంగల్ చౌరస్తాలో ముక్కు నేలకు రాస్తవా?
- సీఎం రేవంత్‌కు మాజీమంత్రి హరీశ్‌రావు ప్రతి సవాల్



సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తదితరులు

సిద్దిపేట/నల్లగొండ ప్రతినిధి, హుస్నాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 తర్వాత సిద్దిపేటకు వస్తా అన్నడు. ఆయన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నా. ఇవ్వాళ కూడా నా మాట మీద నిలబడుతున్న. వంద రోజుల్లో అమలుచేస్తామని బాండ్‌పేపర్ మీద రాసిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయండి. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయండి.నేనే స్వయంగా శాలువా కప్పుతా. సిద్దిపేటకు సీఎంను స్వయంగా నేనే స్వాగతిస్తా. నా రాజీనామాను ఆమోదించుకుంటా'..అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'పంద్రాగస్టుకైనా ఆరు గ్యారెంటీలు,రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని స్పష్టంగా చెప్పాలి. దానికి నువ్వు (సీఎం రేవంత్‌రెడ్డి) సిద్ధమా? ఆరు గ్యారెంటీలు అమలు చేసి, రుణమాఫీని పంద్రాగస్టు లోపు చేస్తే నేనే స్వచ్ఛందంగా స్పీకర్ దగ్గరికి వెళ్లి స్పీకర్ ఫార్మాట్‌లో నా రాజీనామాను ఆమోదించుకోవటానికి సిద్ధం. మళ్లీ ఎన్నికల్లో పోటీచేయను. నువ్వు రాజీనామాకు సిద్ధమా? ఒకవేళ చేయకపోతే కొడంగల్ చౌరస్తాలో ముక్కునేలకు రాస్తవా?' అని ప్రశ్నించారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి తన రాజీనామాను పంపిస్తానని, రేవంత్ కూడా పంపాలని డిమాండ్ చేశారు. 'డొంక తిరుగుడు.. డొల్ల మాటలు వద్దు.. నేను చేసిన చాలెంజ్‌ను స్వీకరించాలని మళ్లీ అడుగుతున్నా. ఇప్పటిదాకా నా చాలెంజ్‌ను స్వీకరించలేదు.సొల్లు మాటలు మాట్లాడుతున్నారు. సంగారెడ్డిలో చాలెంజ్ చేసినప్పటి నుంచి నేను ఒకే స్టాండ్ మీద ఉన్నా. మీరు ఏ వీడియో క్లిప్పింగ్ చూసినా, పబ్లిక్ మీటింగ్ చూసినా ఇదే కనిపిస్తుంది. నీ లెక్క పదవుల కోసం పార్టీలు మార్చుడు, అబద్ధాలు ఆడటం, చిల్లర రాజకీయాలు చేయటం నాకు రాదు. విలువలతో కూడిన రాజకీయాలు చేయటమే నాకు అలవాటు' అని స్పష్టం చేశారు. తనకు ఎమ్మెల్యే పదవి కంటే ప్రజలకు మేలు జరగటమే సంతోషమని చెప్పారు.

కాంగ్రెస్, బీజేపీ కొత్త నాటకం

కేసీఆర్ బస్సుయాత్ర సూపర్ హిట్ కావటంతో బీజేపీ, కాంగ్రెస్ కొత్త నాటకానికి తెర తీశాయని హరీశ్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ లేకుండా చేయాలన్నదే ఈ రెండు పార్టీల కుట్ర అని విమర్శించారు.కాంగ్రెస్‌కు ఓటేస్తే హిందువుల ఆస్తులు ముస్లింలకు పంచుతారని ప్రధాని మోదీ, బీజేపీకి ఓటేస్తే రిజర్వేషన్లు రద్దవుతాయని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని, ఇవి రెండు జరగవని స్పష్టం చేశారు. తెలంగాణ ఆత్మగౌరవానికి, గుజరాత్‌కు పోటీ అంటూ రేవంత్‌రెడ్డి కొత్త నాటకానికి తెర తీశారని హరీశ్ అన్నారు. 'ఏనాడు జై తెలంగాణ అనలేదు, ఒక్కరోజూ అమరవీరుల స్థూపం వద్ద రెండు పూలు పెట్టలేదు. నువ్వు కూడా తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడుతావా?'అని రేవంత్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు. రేవంత్ రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్నారని, కేసీఆర్ ఉండగా రిజర్వేషన్లు పోతాయా? ఇంత పెద్ద నాయకుడు ఉండగా, ఇంత పెద్ద భారత రాజ్యాంగం ఉండగా, రిజర్వేషన్లు మారితే ఆ ప్రభుత్వం ఉంటదా? అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు రాజనర్సు, రవీందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, సాయిరాం, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సోంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ హుందాగా మాట్లాడితే మంచిది

'రేవంత్‌రెడ్డి.. మీరు సీఎం హోదాలో ఉన్నారు. గౌరవంగా మాట్లాడితే, హుందాగా ఉంటే రాష్ర్టానికి మంచిది' అని హరీశ్‌రావు చురక అంటించారు. బీఆర్‌ఎస్‌పై బురద చల్లాలన్న పిచ్చి ప్రయత్నంతో రేవంత్ చేసిన అసందర్భ వ్యాఖ్యల వల్ల రాష్ర్టానికి పెట్టుబడులు రాకుండా పోయాయని విమర్శించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలైందని ఆరోపించారు. బిడ్డ పెండ్లి పెట్టుకున్నామని, భూమి అమ్ముదామంటే ఎవరూ కొనడానికి ముందుకు రావటం లేదని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం తిమ్మాయిపల్లికి చెందిన ఒక మహిళ తనతో గోడు వెళ్లబోసుకొన్నదని వెల్లడించారు.

రేవంత్ లక్ష తులాల బంగారం బాకీ

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లక్ష పెండ్లిళ్లు జరిగాయని, అంటే.. ఆడబిడ్డలకు రేవంత్ సర్కార్ లక్ష తులాల బంగారం బాకీ పడ్డదని మాజీమంత్రి హరీశ్‌రావు తెలిపారు. శుక్రవారం భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలోని చండూరులో, నల్లగొండ పార్లమెంట్ స్థానం పరిధిలోని నల్లగొండలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థులు క్యామ మల్లేశ్, కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి రోడ్‌షోల్లో హరీశ్‌రావు ప్రసంగించారు. అధికారం అహంకారంతోనే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రైతుబంధు అడిగితే రైతులను చెప్పుతో కొట్టాలని అంటున్నారని మండిపడ్డారు. వాళ్ల అహంకారం దింపాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలిపించాలని పిలుపునిచ్చారు. బాండ్‌పేపర్లకు, దేవుళ్లపై ఒట్లకు మోసపోదామా? అని ప్రశ్నించారు. రాజగోపాల్‌రెడ్డి తన మంత్రి పదవి కోసం భువనగిరి ప్రజలను తాకట్టు పెట్టేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. రోడ్‌షోల్లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, నల్లగొండ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, ప్రభాకర్‌రెడ్డి,భూపాల్‌రెడ్డి, లింగయ్య, తిప్పన విజయసింహారెడ్డి, రాష్ట్ర నేతలు పాల్వాయి స్రవంతి, చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్, మల్లికార్జున్‌రెడ్డి, సైదిరెడ్డి పాల్గొన్నారు.


హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధాని చేసేందుకు బాబు, కాంగ్రెస్ కుట్ర

హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధాని చేసేందుకు చంద్రబాబు, కాంగ్రెస్ కుట్ర చేస్తున్నాయని మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఇలా జరిగితే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది జరగకుండా ఉండాలంటే బీఆర్‌ఎస్ ఎంపీలు ఎక్కువ మంది పార్లమెంట్‌లో ఉండాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో శుక్రవారం జరిగిన రోడ్‌షోలో కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని, ఆయన పాలనలోనే ప్రజలు సుభిక్షంగా ఉన్నారని వెల్లడించారు. పల్లెలు, పట్టణాల్లో ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని, ఈసారి బీఆర్‌ఎస్ ఎక్కువ సంఖ్యలో ఎంపీ సీట్లు గెలవటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి కాముకుడైన వినోద్ కుమార్‌ను గెలిపించాలని, కారు గుర్తుకు ఓటు వేసి తెలంగాణకు పూర్వవైభవం తేవాలని ప్రజలను కోరారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే గులాబీ జెండా అని, విధ్వంసం అంటే కాంగ్రెస్, బీజేపీ అని ఎద్దేవా చేశారు. కరీంనగర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం పాటుపడే తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రోడ్‌షోలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్లు

మూడు విడతల్లో సీట్ల భర్తీ

- జూన్ 3న మొదటి విడత సీట్ల కేటాయింపు
- జూలై 8 నుంచి డిగ్రీ ఫస్టియర్ క్లాసులు ప్రారంభం
- నోటిఫికేషన్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి



దోస్త్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి , వైస్ చైర్మన్ వెంకటరమణ తదితరులు

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)-2024 నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం మూడు విడతల్లో సీట్లను భర్తీచేస్తారు. ఈ నెల 6 నుంచి మొదటి విడత రిజిస్ట్రేషన్లు ప్రారంభంకానున్నాయి. శుక్రవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి దోస్త్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు పొందేందుకు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. జూన్ 3న మొదటి విడత సీట్లను కేటాయిస్తారు. మూడు విడతల కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత అడ్మిషన్లు పొందిన విద్యార్థులు జూన్ 29 నుంచి జూలై 7 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. జూలై 1 నుంచి 6 వరకు ఓరియంటేషన్ నిర్వహిస్తారు. జూలై 8 నుంచి ఫస్టియర్ క్లాసులు ప్రారంభమవుతాయి. ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్లు మహమూద్, వెంకటరమణ, కార్యదర్శి శ్రీరాంవెంకటేశ్, ఓయూ, కాకతీయ, మహాత్మా గాంధీ, పాలమూరు, శాతవాహన, అంబేద్కర్ వర్సిటీల వీసీలు రవీందర్, రమేశ్, లక్ష్మీకాంత్ రాథోడ్, మల్లేశ్, సీతారామారావు పాల్గొన్నారు.

నాలుగు కొత్త కోర్సులు

ఈ ఏడాది డిగ్రీలో నాలుగు కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నారు. 14 కాలేజీల్లో బీకాం ఫైనాన్స్, మరికొన్ని కాలేజీల్లో బీఏ (స్పెషల్) హెచ్‌ఈపీ, బీఎస్సీ బయోమెడికల్ సైన్స్, బీఏ పబ్లిక్‌పాలసీ అండ్ గవర్నెన్స్ కోర్సులను నిర్వహిస్తారు. 20 అటానమస్ కాలేజీల్లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ అండ్ ఇన్సూరెన్స్ సర్వీసెస్ (బీఎఫ్‌ఎస్‌ఏ)ను ఎలక్టివ్‌గా ప్రవేశపెడుతున్నారు. బీఎఫ్‌ఎస్‌ఏ కోర్సులో 5వేల మంది ఇంజినీరింగ్, మరో 5వేల మంది నాన్ ఇంజినీరింగ్ కోర్సుల వారికి అడ్మిషన్లు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,066 డిగ్రీ కాలేజీలుండగా, వీటిల్లో 4,49,449 సీట్లున్నాయి.

కోర్సుల వారీగా సీట్లు

కోర్సు	సీట్లు
బీకాం	85,516
బీఏ	29,846
బీబీఏ	15,311
బీసీఏ	4,722
బీబీఎం	1,010
బీఎస్సీ లైఫ్‌సైన్సెస్	43,300
బీఎస్సీ ఫిజికల్ సైన్స్	26,011

అన్ని కోర్సులకు ఇంటర్న్‌షిప్ : బుర్రా వెంకటేశం

రాష్ట్రంలోని అన్ని కోర్సులకు ఇంటర్న్‌షిప్‌లు అమలుచేసే యోచన చేస్తున్నట్టు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం తెలిపారు. ఇండస్ట్రీ వర్గాలతో సంప్రదించి కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామని వెల్లడించారు. ప్లేస్‌మెంట్స్, ఇంటర్న్‌షిప్ ఇచ్చేందుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయనిన్నారు. కొత్త కోర్సుల్లో బోధనకు ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ విధానాన్ని అమలుచేస్తామని చెప్పారు. ఈ కోర్సుల్లోని వారు ఆరు మాసాల పాటు పరిశ్రమల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. నాన్ దోస్త్ కాలేజీలను దోస్త్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.

కోర్సుల మూత, సీట్ల కోతలేదు : లింబాద్రి

డిగ్రీలో కోర్సులను మూసివేయడం, సీట్ల కోత విధించడంలేదని ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి తెలిపారు. ఆదరణ లేని కోర్సులకు బదులు మరో కోర్సు ఆఫర్‌చేసే అవకాశం ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఇంటర్‌లో 3 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారని, కానీ డిగ్రీలో 4లక్షలకు పైగా సీట్లున్న విషయాన్ని గుర్తుచేశారు.

	విషయం	మొదటి విడత	రెండోవిడత	మూడోవిడత
మూడు విడతల దోస్త్ షెడ్యూల్	ఆన్‌లైన్ రిజిష్ట్రేషన్	6-5-24 నుంచి 25-5-24	4-6-24 నుంచి 13-6-24	19-6-24 నుంచి 25-6-24
	వెబ్ ఆప్షన్లు	15-5-24 నుంచి 27-5-24	4-6-24 నుంచి 14-6-24	19-6-24 నుంచి 26-6-24
స్పెషల్ క్యాటగిరీ ధ్రువపత్రాలు	పరిశీలన (పీహెచ్ , క్యాప్)	24-5-24	13-6-24	25-6-24
	ఎన్‌సీసీ, స్పోర్ట్స్ పత్రాల పరిశీలన	25-5-24	13-6-24	25-6-24
	సీట్ల కేటాయింపు	3-6-24	18-6-24	29-6-24
	సెల్ఫ్ రిపోర్టింగ్	4-6-24 నుంచి 10-6-24	19-6-24 నుంచి 24-6-24	29-6-24 నుంచి 3-7-24

6న టీఎస్ ఈసెట్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : బీటెక్ కోర్సుల్లో ల్యాట్రల్ ఎంట్రీ కోసం (రెండోసంవత్సరంలో) నిర్వహించే టీఎస్ ఈసెట్‌ను ఈనెల 6న నిర్వహించనునున్నట్టు సెట్ కన్వీనర్ పీ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఇందుకు హైదరాబాద్‌లో 4, తెలంగాణ జిల్లాల్లో 48, ఏపీలో 7 చొప్పున మొత్తం 99 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 24,272 మంది విద్యార్థులు ఈసెట్‌కు హాజరుకానున్నట్టు వెల్లడించారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ) : సరోజిని దామోదర ఫౌండేషన్ విద్యాదాన్ స్కాలర్‌షిప్‌లకు జూన్ 15లోపు www. vidyadhan.orgలో దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ ఏడాది పదోతరగతిలో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వివరాలకు 9663517131 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గ్రూప్-3 ఉద్యోగాల భర్తీకి సమాంతర రిజర్వేషన్లు

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1,388 గ్రూప్-3 ఉద్యోగాల భర్తీకి సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయం తీసుకొన్నట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కొత్త బ్రేకప్ వివరాలను టీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్టు పేర్కొన్నారు.

27 ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు లక్ష చొప్పున జరిమానా

- వేసవి సెలవుల్లో క్లాస్‌లు, అడ్మిషన్ల నిర్వహణ
- చర్యలు తీసుకొన్న ఇంటర్‌బోర్డు అధికారులు

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు ఇంటర్‌బోర్డు షాక్ ఇచ్చింది. వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహణతోపాటు ప్రవేశాల షెడ్యూల్ విడుదల కాకముందే అడ్మిషన్లు తీసుకొన్న 27 ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు రూ.లక్ష చొప్పున జరిమానా విధించింది. వీటిలో రెజోనెన్స్ విద్యాసంస్థకు చెందినవి 7, వశిష్ట 4, తపస్య 4, అర్బన్ జూనియర్ కాలేజీ 1, నారాయణ కాలేజీ -1 ఉన్నాయి. వేసవి సెలవుల్లో కొన్ని కాలేజీలు అడ్మిషన్లు, క్లాస్‌లు నిర్వహిస్తున్నాయని ఇంటర్‌బోర్డుకు ఫిర్యాదులందాయి. ఈ మేరకు అధికారులతో తనిఖీలు నిర్వహించి ఆయా కాలేజీలపై జరిమానాలు విధించింది. అయితే కార్పొరేట్ కాలేజీలను వదిలేసి చిన్నాచితకా కాలేజీలపై ఇంటర్‌బోర్డు అధికారులు ప్రతాపం చూపిస్తున్నారన్న విమర్శలున్నాయి. శ్రీచైతన్య, నారాయణ కాలేజీలు తరగతులు నిర్వహిస్తున్నా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

2.88 సెకన్లలో జడ్ టు ఏ టైప్

గిన్నిస్ రికార్డు సాధించిన హైదరాబాదీ అశ్రఫ్

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు చెందిన యువకుడు ఎస్‌కే అశ్రఫ్ 2.88 సెకన్లలో ఇంగ్లిష్ అక్షరాలు జడ్ నుంచి ఏ వరకు టైప్ చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించాడు. అశ్రఫ్ ప్రతిభను గుర్తించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ బృందం ఈ ప్రక్రియను అంతా వీడియో తీసింది. ప్రస్తు తం ఈ వీడియోను వీక్షించిన నెటిజన్లు అశ్రఫ్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.

రాష్ట్ర ఆవిర్భావం రోజే 'టెట్'

- సెలవు రోజు నిర్వహణపై నిరుద్యోగుల మండిపాటు
- సబ్జెక్టుల వారీగా పరీక్షల షెడ్యూల్ విడుదల


హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం. రాష్ట్రమంతా వైభవంగా జరుపుకొనే పండుగ. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం స్వరాష్ట్రం సిద్ధించిన రోజు టెట్ నిర్వహించాలని వివాదాస్పద నిర్ణయం తీసుకొన్నది. తెలంగాణ దాస్యశృంఖలాలు తెగింది.. ప్రజలు స్వేచ్ఛావాయువులను పీల్చుకున్నది జూన్ రెండో తేదీనే. వందలాది మంది అమరులను, వారి త్యాగాలను స్మరించుకొనేది ఇదే రోజు. ఈ దృష్ట్యా జూన్ 2న సెలవుగా పాటిస్తారు. కానీ రాష్ట్ర విద్యాశాఖ మాత్రం జూన్ -2 టెట్ పేపర్ -1 రెండు సెషన్లలో నిర్వహిస్తామని తాజాగా ప్రకటించింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో టెట్ నిర్వహించేలా షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు సబ్జెక్టుల వారీగా పరీక్షల షెడ్యూల్‌ను టెట్ కన్వీనర్ రాధారెడ్డి శుక్రవారం ప్రకటించారు. ఈ నెల 20 నుంచి జూన్ 3 వరకు టెట్ పరీక్షలను నిర్వహిస్తామని విద్యాశాఖ గతంలో ప్రకటించింది. తాజా షెడ్యూల్ ప్రకారం జూన్ 2తోనే పరీక్షలు ముగియనున్నాయి. జూన్ 3న పరీక్షలు నిర్వహించే అవకాశమున్నా జూన్ 2న పరీక్షలు నిర్వహించడంలో అత్యంత దారుణమని నిరుద్యోగులు మండిపడుతున్నారు.

ఎమ్మెల్సీ ఎఫెక్ట్‌తో మూడు రోజులు విరామం

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో టెట్ పరీక్షల షెడ్యూల్‌లో అధికారులు స్వల్పమార్పులు చేశారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో మూడు రోజుల పాటు టెట్ పరీక్షలకు విరామం ప్రకటించారు. దీంతో టెట్ జూన్ 3న కాకుండా జూన్ 2నే ముగియనుంది.

పరీక్షల షెడ్యూల్

పేపర్లు	తేదీలు
పేపర్ -2 గణితం, అండ్ సైన్స్	మే 20 నుంచి 22వరకు (మొత్తం ఆరుసెషన్లు)
పేపర్ -2 సోషల్ స్టడీస్ (మైనర్ మీడియం)	మే 24 (ఒక సెషన్)
పేపర్ -2 సోషల్ స్టడీస్	మే 24, మే 28, 29 (మొత్తం ఐదు సెషన్లు)
పేపర్ -1	మే 30, 31 (మొత్తం నాలుగు సెషన్లు)
పేపర్ -2 గణితం, అండ్ సైన్స్) మైనర్ మీడియం	1జూన్ (మొదటి సెషన్)
పేపర్ -1 (మైనర్ మీడియం)	1 జూన్ (రెండో సెషన్)
పేపర్ -1	2జూన్ (రెండు సెషన్లు)



ఢిల్లీలో ఎన్సీటీఈ చైర్మన్ యోగేశ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు

ప్రభుత్వం కోరితే టీచర్లకు టెట్ మినహాయింపు

- పీఆర్టీయూ టీఎస్ నేతలతో ఎన్సీటీఈ చైర్మన్ యోగేశ్‌సింగ్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం కోరితే టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు కల్పిస్తామని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ) చైర్మన్ యోగేశ్ సింగ్ తమకు చెప్పినట్టు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు తెలిపారు. శుక్రవారం వారు ఢిల్లీలో ఎన్సీటీఈ చైర్మన్ యోగేశ్‌సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2010 కన్నా ముందు నియామకమైన 1-5 తరగతులు బోధించే టీచర్లు పదోన్నతి పొందేందుకు టెట్ నుంచి మినహాయింపునిస్తామని హామీనిచ్చినట్టు తెలిపారు. ఇన్ సర్వీస్ టీచర్లకు పదోన్నతులకు సంబంధించి విద్యాహక్కు చట్టంలోని మార్గదర్శకాలను సవరిస్తామని చెప్పినట్టు వారు పేర్కొన్నారు. ఇదిలావుండగా, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల పదోన్నతికి టెట్ అవసరంలేదని ఎన్సీటీఈ సభ్యదర్శి కేషాంగ్ వై షెర్పా స్పష్టం చేసినట్టు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీఎస్సీ), జాక్టో నేతలు తెలిపారు. ఈ మేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నేతృత్వంలోని ఉపాధ్యాయల సంఘాల ప్రతినిధి బృందం శుక్రవారం ఢిల్లీలో ఎన్సీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ యోగేశ్‌సింగ్, సభ్యకార్యదర్శి కేషాంగ్ వై షెర్పాలను వేర్వేరుగా కలిశారు. 2010 ఆగస్టు 23కు ముందు నియమితులైన టీచర్లు అదే స్థాయిలో పదోన్నతి పొందేందుకు టెట్ అవసరం లేదని కేషాంగ్ వై షెర్పా వివరణ ఇచ్చినట్టు నేతలు తెలిపారు.

ముగిసిన అటవీ క్షేత్రాధికారుల శిక్షణ

ప్రతిభ చూపిన అభ్యర్థులకు పతకాలు

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో 9వ అటవీ క్షేత్రాధికారుల(ఎఫ్‌ఆర్‌వో) శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. శుక్రవారం అకాడమీలో శిక్షణ పూర్తిచేసుకున్న ఎఫ్‌ఆర్‌వోల స్నాతకోత్సవం జరిగింది. 18 నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న ఎఫ్‌ఆర్‌వోలు క్షేత్రస్థాయిలో ఫారెస్ట్ అధికారులుగా బాధ్యతలు నిర్వహించనున్నారు. మొత్తం 47మంది అభ్యర్థుల్లో..42 మంది గుజరాత్, నలుగురు జమ్ము-కశ్మీర్, ఒకరు లడక్‌కు చెందినవారు కాగా వీరిలో 11మంది మహిళా అధికారులున్నారు. ముఖ్యఅతిథిగా గుజరాత్ రాష్ట్ర అటవీ దళాల అధిపతి (పీసీసీఎఫ్)యూడీ సింగ్, ప్రత్యేక ఆహ్వానితులుగా తెలంగాణ అటవీ దళాల అధిపతి (పీసీసీఎఫ్) ఆర్‌ఎం డోబ్రియాల్ పాల్గొన్నారు. పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించిన అనంతరం శిక్షణలో ప్రతిభ చూపిన వారికి పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. గుజరాత్‌కు చెందిన సురేశ్‌కుమార్ దేశాయ్ అత్యుత్తమ ప్రతిభ చూపి 7 బంగారు పతకాలు సాధించి టాపర్‌గా నిలిచారు. రోనక్ కేవడియా 6 బంగారు పతకాలు, 3 వెండి పతకాలను సాధించారు. ఇక్కడ పీసీసీఎఫ్ ఎల్యూసింగ్ మేరు, అకాడమీ సంచాలకులు ఎస్‌జే ఆశా పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

సిద్దిపేట జిల్లాలో ఘటన



శివరాములు (ఫైల్)

గజ్వేల్, మే 3: పంట దిగుబడి రాక, చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. బంగ్లా వెంకటాపూర్‌కు చెందిన అన్నమైన శివరాములు (40) తనకున్న 18 గుంటల వ్యవసాయ పొలంలో పచ్చిమిర్చి, కూరగాయలు చేయడంతోపాటు అతడి సోదరికి చెందిన 11 గుంటల విస్తీర్ణంలో బీరతోట వేశాడు. కూరగాయల సాగులో అనుకున్న విధంగా దిగుబడి రాకపోవడంతో పంటల కోసం చేసిన అప్పులతోపాటు కుటుంబ అవసరాలు, చిట్టీల కోసం చేసిన అప్పులను తీర్చే మార్గంలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గతంలోనే రెండు గుంటలు అమ్మి అప్పులు తీర్చగా, ప్రస్తుతం రూ.5 లక్షల వరకు అప్పులు ఉన్నాయి. ఈ క్రమంలో పొలానికి వెళ్తున్నానని భార్య భాగ్యకు చెప్పి గురువారం ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రయినా భర్త ఇంటికి రాకపోవడంతో ఇంటి పక్కనే ఉండే మరిది గణేశ్‌కు విషయం చెప్పింది. అతడు రాత్రి 10.30 గంటలకు పొలం వద్దకు వెళ్లి చూడగా ట్రాక్టర్ సైలెన్సర్‌కు శివరాములు ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. శివరాములు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై భువనేశ్వర్ రావు తెలిపారు. రైతు శివరాములు కుటుంబ సభ్యులను గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ నర్సింలు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

బోయపల్లిలో తీరిన మంచినీటి సమస్య

'నమస్తే'కు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు

మహబూబ్‌నగర్ అర్బన్, మే 3 : మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ విలీన గ్రామమైన బోయపల్లిలో మంచినీటి సమస్య పరిష్కారమైంది. 'సీఎం సొంత జిల్లాలో దాహం దాహం' అన్న శీర్షికతో గురువారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి వెంటనే లీకేజీలను గుర్తించి వాటిని సరి చేయించారు. దీంతో మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా కావడంతో ఆ గ్రామంలో మంచినీటి సమస్య తీరిపోయిందని కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన నమస్తే తెలంగాణకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే ఎఫెక్ట్

చిక్కిన 'ఎయిర్‌పోర్ట్' చిరుత



హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిసరాల్లో తీవ్ర కలకలం రేపిన చిరుత ఎట్టకేలకు చిక్కింది. నాలుగు రోజుల క్రితం ఎయిర్‌పోర్టు రన్‌వేపై చిరుత కనిపించిందనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. చిరుత కదలికలు సీసీ కెమెరాలకు చిక్కడంతో ఒక్కసారిగా కలకలం మొదలైంది. విమానాశ్రయంలోని ఎయిర్‌క్రాఫ్ట్ రిపేర్ సెక్షన్‌లోని కంచెపై నుంచి దూకేందుకు చిరుత ప్రయత్నించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాలో రికార్డుకాగా ఎయిర్‌పోర్టు సిబ్బంది వెంటనే భద్రతా సిబ్బందికి సమాచారమందించారు. దీంతో అలర్ట్ అయిన ఫారెస్ట్ సిబ్బంది చిరుతను బంధించేందుకు 5 బోన్లలో మేకలను ఎరగా ఉంచి, 25 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. గొల్లపల్లి, బహదూర్‌గూడ తదితర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. గురువారం రాత్రి ఆహారం తినేందుకు వచ్చిన చిరుత బోనులో చిక్కడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చిరుతను జూపార్క్‌కు తరలించి వైద్య పరీక్షలు చేసిన అనంతరం నల్లమల అడవిలోకి తరలిస్తామని అధికారులు పేర్కొన్నారు.

దూరప్రాంత ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): దూరప్రాంత ప్రయాణికులకు టీఎస్‌ఆర్టీసీ శుభవార్త చెప్పింది. 8 రోజుల ముందుగానే బుకింగ్ చేసుకుంటే రిజర్వేషన్ ఫీజును మినహాయిస్తున్నట్టు టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఎక్స్ వేదికగా శుక్రవారం వెల్లడించారు. ముందస్తు రిజర్వేషన్ కోసం http//tsrtconline.in వెబ్‌సైట్‌ని సంప్రదించాలని తెలిపారు. ఎంజీబీఎస్, జేబీఎస్, బీహెచ్‌ఈఎల్, నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి ప్రతి అరగంటకో బస్సు అందుబాటులో ఉంచుతున్నట్టు టీఎస్‌ఆర్టీసీ వెల్లడించింది. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలంకు బస్సు సర్వీసులు పెంచనున్నట్లు తెలుస్తోంది.

వామన్‌రావు దంపతుల హత్యపైసుప్రీంలో విచారణ

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): సంచలనం సృష్టించిన న్యాయవాది గట్టు వామన్‌రావు దంపతుల హత్యపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని ఆయన కుమారుడు కిషన్‌రావు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సుందరేశ్, ఎస్‌వీఎన్ భట్టి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ప్రస్తుతం నిందితులంతా బెయిల్‌పై ఉన్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ కేసును సీబీఐ లేదా సీఐడీతో విచారణ జరిపించేందుకు అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు చెప్పారు. దీంతో నిందితులను కూడా ప్రతివాదులుగా చేర్చి వారికీ నోటీసులు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

4.31 కోట్ల విలువైన బంగారం పట్టివేత

చౌటుప్పల్ రూరల్, మే 3 : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద రూ.4.31 కోట్ల విలువైన 5.694 కిలోల బంగారాన్ని హైదరాబాద్ జోనల్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు గురువారం రాత్రి పట్టుకున్నారు. డీఆర్‌ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి 65పై కారులో నలుగురు వ్యక్తులు కోల్‌కతా నుంచి ప్రయాణం చేస్తున్నారు. పంతంగి టోల్‌గేటు వద్ద అధికారులు ఆపే ప్రయత్నం చేయగా.. తప్పించుకుపోయారు. అధికారులు వెంబడించి చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం గ్రామం వద్ద అడ్డగించారు. కారును సోదా చేయగా 5.694 కిలోల తూకం చేసే 35 బంగారు బిస్కెట్లు లభ్యమయ్యాయి. వాటికి సంబంధించి వారు ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో బంగారాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

ఎయిర్‌పోర్ట్‌లో భారీగా ఆభరణాలు పట్టివేత

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 3: శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు పట్టుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి దాదాపు 35 కిలోల బంగారు, 40 కిలోల వెండి ఆభరణాలను ఓమిని కారులో హైదరాబాద్ నగరానికి తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌వోటీ పోలీసులు తెలిపారు. ఆభరణాలకు సంబంధించిన పత్రాలు, బిల్లులు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకొని, ఏడుగురిని అదుపులోకి తీసుకొని శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించామని చెప్పారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఎన్నికల స్క్వాడ్ అధికారులకు కేసును అప్పగించినట్టు ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రభాకర్‌రావు అరెస్ట్‌కు వారెంట్ ఇవ్వండి

నాంపల్లి కోర్టులు, మే 3 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును అరెస్టు చేసేందుకు వారెంట్ జారీ చేయాలని కోరుతూ నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. పంజాగుట్ట పోలీసులు దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై విచారణను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది.

రూ.60 కోట్ల మోసం.. దంపతుల అరెస్టు

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : బ్యాంకు, ఫైనాన్స్, ప్రైవేట్ ఇన్వెస్టర్లను మోసం చేసిన కేసులో దంపతులను 11 ఏండ్ల తర్వాత సీఐడీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సీఐడీ డీజీ శిఖాగోయెల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదర్శ్ కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ మణికొండ ఆంజనేయులు, అతడి భార్య రీటా 2013లో బాలానగర్ ఎస్బీఐ నుంచి రూ.27 కోట్ల రుణాన్ని తీసుకుని పరారయ్యారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో బాలానగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టి, కేసును సీఐడీకి బదిలీ చేశారు. వారి విచారణలో ఆంజనేయులు దంపతులపై హైదరాబాద్ సిటీలో 4 కేసులు, సైబరాబాద్ కమిషనరేట్‌లో ఓ కేసులో ఫైనాన్స్ కంపెనీలు, ప్రైవేట్ ఇన్వెస్టర్లను రూ.60 కోట్లకు మోసం చేసినట్టు తేలింది. 2013 నుంచి వీరు పరారీలో ఉండగా.. సీఐడీ డీజీ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలో ప్రత్యేక బృందం ఆంజనేయులు దంపతులను బెంగళూరులో అరెస్టు చేసి, కూకట్‌పల్లిలోని 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు.

వ్యతిరేకుల తరహా వెదిరె రాతలు

విద్యుత్తు ఖర్చుపై ఆయన వ్యాఖ్యలే నిదర్శనం

- బహుళప్రయోజనాలకే నదీమార్గం ద్వారా ఎత్తిపోతలు
- 'ప్రాణహిత- చేవెళ్ల'లోనూ అంతే కరెంటు వినియోగం
- తెలంగాణ రాష్ట్ర నీటివనరుల అభివృద్ధిశాఖ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్



హైదరాబాద్, మే3 (నమస్తే తెలంగాణ): మే 2న అచ్చయిన వ్యాసంతో వెదిరె శ్రీరాం కాళేశ్వరం విచారణ పూర్తవుతుందని భావించా. కానీ, మే 3న ఐదో భాగం కూడా రాసి ముగించారు. సంతోషం. అందులో కూడా వెదిరె వారికి కొన్ని అంశాలపై వివరణ ఇవ్వాల్సిన అవసరముందని భావించి ఈ వ్యాసం రాస్తున్నా. కాళేశ్వరంలో వినియోగమయ్యే విద్యుత్‌పై చాలా మందికి ఉన్నట్టే వెదిరెకు కూడా అనుమానాలున్నాయని ఆయన రాతలే చెబుతున్నయ్. ఈ అంశంలో ప్రాజెక్టు వ్యతిరేకులు చేసిన ప్రచార వొరవడిలో వెదిరె కొట్టుకుపోయారని స్పష్టమవుతున్నది. గతంలోనే కాళేశ్వరం ప్రాజెక్టులో విద్యుత్ వినియోగంపై విద్యుత్ రంగ నిపుణుడు, ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి వివరణలు ఇచ్చారు. 'నిజం ఇంటి గడప దాటే లోగా అబద్ధం ఊరిని చుట్టి వస్తుంది' అన్న చందంగా కాళేశ్వరం విద్యుత్ వినియోగంపై అబద్ధపు ప్రచారాలు కొనసాగుతూనే ఉన్నయ్.

విద్యుత్తు వినియోగంపై ఇవీ వాస్తవాలు..

కాళేశ్వరం ప్రాజెక్టులో అవరమయ్యే మొత్తం విద్యుత్తు వినియోగంపై గతంలో కొంత మంది తమ ఊహాగానాల లెక్కలతో ఎకరానికయ్యే విద్యుత్ వ్యయాన్ని లక్ష నుంచి లక్షా యాభై వేలుగా తప్పుడు లెక్కగట్టారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ కింద ఆయకట్టు రైతులు చేసేది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వ్యవసాయమని అన్యాయమైన వ్యాఖ్య చేసేశారు. వాస్తవమేమంటే ప్రాజెక్టు మొత్తం వినియోగం 13,558 మిలియన్ యూనిట్లుగా అంచనా వేశారు. అందులో 75శాతం అంటే 10,168.50 మిలియన్ యూనిట్లు మాత్రమే వాస్తవ వినియోగం. ఇప్పుడు ప్రపంచంలో తయారవుతున్న పంపులు 89-91శాతం ఎఫిషియన్సీ కలిగినవి. వాటి పవర్ ఫ్యాక్టర్ 0.95గా ఉంటుంది. కాబట్టి 10శాతం వరకు ప్రత్యక్షంగా విద్యుత్ వినియోగంలో సేవింగ్స్ ఉంటాయని విద్యుత్ రంగ నిపుణులు చెప్పేమాట. లింక్-1లో టీఎంసీ నీటిని ఎత్తిపోయడానికయ్యే కరెంటు ఖర్చు (ఫిక్స్డ్ చార్జీలు కలుపుకొని రూ.570.56 లక్షలు, ఎల్లంపల్లి - మిడ్ మానేరు లింక్-2లో రూ. 1207.43 లక్షలు, మిడ్ మానేరు - మల్లన్నసాగర్ లింక్- 4లో రూ. 1558.23 లక్షలు, మల్లన్నసాగర్ - కొండపోచమ్మసాగర్ లింక్‌లో రూ. 451.91లక్షలు, మొత్తంగా పై లింకులన్నీ కలిపితే మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు ఎత్తిపోతల ద్వారా ఎకరానికయ్యే ఖర్చు రూ. 37,881.55 మాత్రమే. ఈ ఖర్చు కూడా నాలుగు లింకుల్లో అన్ని పంపులు నిరంతరాయంగా 5 నెలల పాటు నడిచినప్పుడు మాత్రమే. కానీ, ఈ పరిస్థితి కాళేశ్వరం ప్రాజెక్టులో ఎప్పుడూ ఉండబోదు. విద్యుత్ నిపుణులు చెబుతున్న దాని ప్రకారం వాస్తవ వినియోగం 50శాతం మాత్రమే. కాళేశ్వరం ప్రాజెక్టులో ఉన్న 22 పంప్‌హౌసుల్లో వివిధ రేటింగ్ (139, 135, 125, 106, 44, 40 మెగావాట్లు) కలిగిన మొత్తం 85 పంపులుంటాయి. అవన్నీ ఒకేసారి నడిచినప్పుడు 4600 మెగావాట్ల కరెంటు అవసరమవుతుందని అంచనా. వాస్తవ వినియోగం 80శాతం అనుకుంటే 3680 మెగావాట్లు. అయితే అన్ని పంపులు ఒకేసారి నడిచే సందర్భం అసలు ఏర్పడకపోవచ్చు. శ్రీరాంసాగర్‌కు వరద వస్తే గ్రావిటీ ద్వారానే మిడ్‌మానేరు, లోయర్ మానేరు, ఎల్లంపల్లి నిండుతాయి. అప్పుడు లింక్ 1,2 లో పంపులు నడిపే అవసరం రాదు. మిడ్‌మానేరు నుంచే పంపులు నడుస్తాయి. శ్రీరాంసాగర్ వద్ద నీరు లేకున్నా ఎల్లంపల్లికి శ్రీరాంసాగర్-ఎల్లంపల్లి మధ్యన ఉన్న పరీవాహక ప్రాంతం నుంచి, కడెం ప్రాజెక్టు నుంచి వరద రావచ్చు. అప్పుడు లింక్-1లో పంపులు నడపరు. లింక్-2లో పంపుల ద్వారా మిడ్‌మానేరుకు, అక్కడి నుంచి కొండపోచమ్మసాగర్ వరకు, శ్రీరాంసాగర్‌కు నీటికి ఎత్తిపోస్తారు. ఆ రెండు చోట్లలో నీరు లేనప్పుడే మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోస్తారు. కాబట్టి కాళేశ్వరం ఎత్తిపోతల కరెంటు ఖర్చులు ఎకరానికి 1- 1.50 లక్షలు ఉంటుందని ప్రాజెక్టు వ్యతిరేకులు చేసే విమర్శలు నిరాధారం.

'ప్రాణహిత - చేవెళ్ల'కూ అదే వినియోగం

తెలంగాణలో ఎత్తిపోతలు లేకుండా రైతులకు సాగు నీరివ్వలేం. ఈ సంగతి వెదిరె సహా ఈ రాష్ట్రంలో అందరికీ తెలుసు. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టులో కూడా దాదాపు ఇంతే కరెంటు వినియోగముంటుంది. ఆ ప్రాజెక్టుపై లేని అభ్యంతరాలు కాళేశ్వరంపై ఎందుకు? ఎత్తిపోతల పథకాల్లో పంపులు నడిస్తే కరెంటు కాలుతుంది. రాష్ట్రంలో ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు, నాగార్జునసాగర్ దిగువ కాలువ, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, తుమ్మిళ్ల, భక్త రామదాసు, అలీసాగర్, గుత్ప, చౌటుపల్లి హనుమంతరెడ్డి, గూడెం, ఎల్లంపల్లి, దేవాదుల పథకాలు విజయవంతంగా రైతులకు సేవలందిస్తున్నాయి. 2019 నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగు నీరందుతున్నది. ప్రస్తుత ప్రభుత్వం నిధులు కేటాయించగలిగితే మరో రెండు మూడేండ్లలో పాలమూరు రంగారెడ్డి, సీతారామ, డిండి, చిన్న కాళేశ్వరం, వార్ధా, చనాక కొరట, సంగమేశ్వర, బసవేశ్వర, చెన్నూరు ఎత్తిపోతల పథకాలు సాగు నీరందించేందుకు సిద్ధమవుతాయి. వాటన్నింటికీ సుమారు 9-10 వేల మెగావాట్ల కరెంటు అవసరమని ఇంజినీర్ల అంచనా. వాటికి ఏటా 10-15 వేల కోట్ల కరెంటు బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఏ ప్రభుత్వానికైనా తప్పదు. తెలంగాణలో ఎత్తిపోతలు అనివార్యమైనప్పుడు కరెంటు ఖర్చులు తప్పవు కదా?. ఖర్చులు - ప్రయోజనాలు అన్న దృష్టి కోణంలో విశ్లేషిస్తూ కూర్చుంటే తెలంగాణ కూడా విదర్భలా రైతు ఆత్మహత్యలకు నిలయంగా మిగిలిపోయి ఉండేది. ఉమ్మడి రాష్ట్ర పాలకులు మీరు ఎత్తు గడ్డ మీద ఉన్నారు, మీకు నీళ్లు రావు' అని దశాబ్దాల పాటు మన నీటిని తరలించుకుపోయారు. ఇప్పుడు కరెంటు ఖర్చుల బూచిని చూపిస్తూ వ్యవసాయ ఆర్థికవేత్తలు, ఇతర అంతర్జాతీయ నిపుణులు ఎత్తిపోతలు తెల్ల ఏనుగులని వర్ణిస్తున్నారు. వారికి వీరికి తేడా లేదు. కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ సోయితో సాహసించి కాళేశ్వరం నిర్మించింది. పాలమూరు-రంగారెడ్డి, డిండి, సీతారామ ఎత్తిపోతలను చేపట్టింది. పెండింగ్ ఎత్తిపోతలను వినియోగంలోకి తెచ్చింది. కరువు, వలసలు, రైతు ఆత్మహత్యలకు చెక్ పెట్టగలిగింది. కాళేశ్వం ప్రాజెక్టు తెలంగాణ కరువుపై జలాస్త్రంలా నిలిచింది.

బహుళ ప్రయోజనాలున్నాయి..

మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు నదీ మార్గాన్ని ఎంచుకోవడాన్ని కూడా వెదిరె తప్పుపడుతున్నారు. కరెంటు ఖర్చు ఎక్కువ అంటున్నారు. నది నుంచి లంబకోణంలో లోతట్టు ప్రాంతాలకు ఎత్తిపోసుకుంటే కరెంటు తక్కువ అవసరం పడేదంటున్నారు. లోతట్టు ప్రాంతాలకు ఎత్తిపోసుకోవడం ఏమిటో అర్థం కాలేదు. మొదట మేడిగడ్డ నుంచి నేరుగా మిడ్ మానేరుకే నీటిని ఎత్తిపోసుకునే ఆలోచన చేశారు. ఆ మార్గమంతా సింగరేణి బొగ్గు గనులు, రామగుండం పారిశ్రామిక ప్రాంతాలు ఉండడంతో అది వాంఛనీయం కాదని విశ్రాంత ఇంజినీర్ల సంఘమే ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అప్పుడు నదీ మార్గాన్నే ఎంచుకోవడం బహుళ ప్రయోజనాల రీత్యా ఉత్తమమైన ప్రత్యామ్నాయమని భావించారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు సుమారు 170 కిలోమీటర్ల పొడవునా గోదావరి సజీవమై ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు అనూహ్యంగా పెరిగాయి. పర్యావరణం, జీవావరణం ఇంతకు ముందెన్నడూ లేనంతగా మెరుగుపడ్డాయి. దేశీయ జల రవాణాకు మార్గం ఏర్పడింది. ఎకో, టెంపుల్ టూరిజానికి అవకాశాలు మెరుగయ్యాయి. అతి తక్కువ ముంపుతో 34టీఎంసీల నీటిని నది లోనే నిల్వ ఉంచే వీలు కలిగింది.



వరదాయిని కాళేశ్వరం

ఆంధ్రజ్యోతిలో వెదిరె శ్రీరాం రాసిన కాళేశ్వరంపై వ్యాసాలకు వీ ప్రకాశ్ కౌంటర్

నీటిహక్కుల స్థిరీకరణ కోసమే..

ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో మూడో టీఎంసీ పనులు చేపట్టడంపై అందరికీ ఉన్నట్టే వెదిరెకు కూడా అపోహలున్నాయని తెలుస్తున్నది. కేసీఆర్ ఈ పనులు చేపట్టడంలో చాలా ముందు చూపు ఉన్నదన్న సంగతిని మేధావులు కూడా అర్థం చేసుకోలేకపోతున్నారు. అసలు విషయమేమంటే 87 బిలియన్ డాలర్ల వ్యయంతో దేశంలోని 60నదులను ఇతర నదులతో అనుసంధానం చేయాలని 2017లో ప్రధాని మోదీ ప్రణాళిక సిద్ధం చేశారు. ఉత్తరాది నదులైన కెన్-బెత్వా నదుల అనుసంధానం పనులను కూడా మోదీ ప్రభుత్వం ప్రారంభించింది. గోదావరి నీళ్లను కృష్ణా, పెన్నా బేసిన్‌ల ద్వారా కావేరి బేసిన్‌కు తరలించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ అంశాన్ని కేసీఆర్ సీరియస్‌గా తీసుకున్నారు. ఒకసారి గోదావరి-కావేరి అనుసంధాన పనులు మొదలైతే తెలంగాణ తన వాటాను సంపూర్ణంగా వినియోగించుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. హైడ్రాలజీ క్లియరెన్స్‌లు పొందడం కష్టమవుతుంది. మన వాటా జలాల వినియోగానికి అవసరమైన ప్రాజెక్టులు నిర్మించకముందే పెన్నా-కావేరి బేసిన్‌లో గోదావరి జలాల వినియోగం ప్రారంభమైతే వారికి ముందుగా రైపేరియన్ రైట్స్ (నదీతీర హక్కులు) ఈ నీటిపై లభిస్తాయి. ఈ పరిస్థితి రాకముందే మూడో టీఎంసీ నీటిని ఎత్తిపోయడం కాళేశ్వరంలో మొదలైతే మన వాటా జలాలపై ముందుగా రైపేరియన్ రైట్స్ తెలంగాణకు దక్కుతాయి. ఈ కారణంతోనే కేసీఆర్ మూడో టీఎంసీ కోసం పదేళ్లుగా తన ప్రణాళికను అమలు చేశారు. వ్యాప్కోస్ ఇచ్చిన మేడిగడ్డ ఇతర బరాజ్‌ల నివేదికల్లోనే మూడో టీఎంసీ కోసం సివిల్ వర్క్స్, ఇతర పనుల ప్రస్తావన ఉన్నది. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌లో కూడా మూడో టీఎంసీ గురించి ప్రస్తావించారు. ఇది ఆకస్మాత్తుగా 2020లో వచ్చిన ఆలోచన కాదు. 2016 ఆగస్టులో ఏజెన్సీలతో ప్రభుత్వం చేసుకున్న అగ్రిమెంట్‌లో కూడా మూడో టీఎంసీ సివిల్ వర్క్స్, పంపుల గురించి ఉన్నది. మూడో టీఎంసీ ఎందుకు అవసరమో మరో కారణం కూడా ఉన్నది. 2015 తర్వాత మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఫడ్నవీస్ వేన్‌గంగా, వార్ధా జలాలను తమ రాష్ట్రంలోని కరువు ప్రాంతాలకు (విదర్భ)కు మళ్లించే ఆలోచన చేశారు. అవి కార్యరూపం దాల్చితే ప్రాణహితలో వరద తగ్గుతుంది. వానకాలంలో భారీగా వరదనీరు వచ్చే సందర్భంలోనే రోజుకు మూడు టీఎంసీలు ఎత్తిపోసుకోవాల్సి ఉంటుంది. ఆ నీటిని మల్లన్నసాగర్, ఇతర రిజర్వాయర్లలో నింపుకొని కాళేశ్వరం ద్వారా పూర్తిస్థాయి కొత్త, స్థిరీకరించే ఆయకట్టు సుమారు 40లక్షల ఎకరాలకుపైగా నీరందించే అవకాశముంటుంది. గోదావరి బేసిన్లో తెలంగాణ వాటా 968 టీఎంసీలని ఓ వైపు ఏపీ అంగీకరించలేదు. మరోవైపు తన వాటా 775 టీఎంసీలని పేర్కొంటున్నది. గోదావరి జలాల్లో వాటాలు తేల్చేందుకు ట్రిబ్యునల్ వేయాలని ఇప్పటికే ఏపీ డిమాండ్ చేస్తున్నది. ఇది ఎప్పటికైనా ఏర్పడే అవకాశముందన్న సంగతి కేసీఆర్ గ్రహించారు. గోదావరి జలాల్లో ఉమ్మడి రాష్ట్రం తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించిన 968 టీఎంసీల నికరజలాలపై, గోదావరిలో వానకాలం లభ్యమయ్యే అపారమైన వరద జలాలపై తెలంగాణ హక్కులను ట్రిబ్యునల్ ఏర్పడక ముందే స్థిరపరిచే దిశగా ముందు చూపుతోనే మూడో టీఎంసీ పనులు చేపట్టాలని నిర్ణయించారు. కేసీఆర్ ప్రభుత్వ చొరవతో 968 టీఎంసీల నికర జలాల్లో ఇప్పటికే 933 టీఎంసీలకు కేంద్ర జల సంఘం నుంచి హైడ్రాలజీ క్లియరెన్సులు పొందడం విశేషం. ఈ ముందు చూపునకు కృష్ణా బేసిన్‌లో మనకున్న అనుభవాలే ఆధారం. నాడు బచావత్ ట్రిబ్యునల్ ముందే వినియోగంలో ఉన్న నీటికి రక్షణ కల్పించిన కారణంగా బేసిన్ పేరామీటర్లలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉన్నా పెద్ద వాటా సాధించుకోగలిగింది. బచావత్ ట్రిబ్యునల్ గడువు 2000 మార్చితో ముగిసిపోతుందని అన్ని రాష్ట్రాలకు ముందే తెలుసు కాబట్టి కొత్త ట్రిబ్యునల్ ముందు తమ నీటి హక్కులను స్థిరపరచుకునేందుకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు అధిక ప్రాధాన్యతనిచ్చి, నిధులు కేటాయించి సాగునీటి ప్రాజెక్టులు నిర్మించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ కూడా వరద జలాలపై ఆధారపడ్డ రాయలసీమ ప్రాజెక్టులను ఆగమేఘాలమీద పూర్తి చేసింది. తెలంగాణలో ఎత్తిపోతలు ప్రారంభమైనా అవి పెండింగ్ ప్రాజెక్టులుగానే మిగిలిపోయాయి. కృష్ణా ట్రిబ్యునల్ అనుభవాల నుంచే కేసీఆర్ ప్రభుత్వం గోదావరి బేసిన్‌లో నీటి హక్కులను స్థిరపరచుకునే ఆలోచనతో మూడో టీఎంసీ పనులు చేపట్టి సమగ్ర డీపీఆర్‌ను కేంద్ర జలసంఘం ఆమోదానికి పంపింది. రాజకీయ కారణాలతో దానిన పక్కన బెట్టిన సంగతి అందరికీ తెలిసిందే. మూడో టీఎంసీ పనులు వెదిరె లాంటి విశ్లేషకులకు అనవసరమైనవి కనిపిస్తాయి. నా లాంటి వారికి గోదావరిలో నీటి హక్కులు స్థిరపరిచే ముందు చూపు కనిపిస్తుంది.

జాతీయ హోదాపై కేంద్రానిదే తప్పు

2014 తర్వాత జాతీయ ప్రాజెక్టు ఇచ్చే పథకం ఏదీ కేంద్ర ప్రభుత్వంలో లేదని వెదిరె చెబుతున్నారు. ఇదే విషయాన్ని నాటి కేంద్ర జల వనరుల మంత్రి నితిన్ గడ్కరీ కూడా పార్లమెంట్‌లో ప్రకటించిన సంగతిని పత్రికలు రిపోర్ట్ చేశాయి. అయినా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కోర్టు వివాదాల్లో ఉన్నా కర్ణాటక రాష్ట్రానికి చెందిన అప్పర్‌భద్రా ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ హైపవర్ కమిటీ సిఫారసు చేయడం, కేంద్ర క్యాబినెట్ ఆమోదించడం, 2023 కేంద్ర బడ్జెట్‌లో ప్రాజెక్టుకు రూ.5వేల కోట్లు కేటాయించడం, కర్ణాటకలో ఓటమి పాలు కాగానే ఏవో కారణాలు చెప్పి జాతీయ హోదా వెనక్కి తీసుకున్న సంగతి అందరికీ తెలుసు. మరి కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా నిర్ణీత ఫార్మాట్‌లో దరఖాస్తు చేయలేదని, పెట్టుబడి అనుమతులు పొందలేదని, ప్రాజెక్టుకు జాతీయ హోదా అర్హత లేదని వెదిరె చెబుతున్నారు. సాంకేతికంగా అది నిజమే కావచ్చు. ప్రాజెక్టుకు టీఏసీ అనుమతి లభించిన తర్వాత ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి పెట్టుబడి అనుమతుల కోసం రెండేళ్లు ప్రాజెక్టు ఇంజినీర్లు శ్రమించారు. వారికి ఇచ్చే ఉద్దేశం లేదు కాబట్టి కొర్రీలు రాస్తూ పోయారే తప్ప అనుమతిపై పురోగతి ఏమీ లేదు. ఆ లోపు రాష్ట్ర ప్రభుత్వం సొంత వనరులను సమీకరించుకుంది. పెట్టుబడి అనుమతిని ఇవ్వదలుచుకోని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖది తప్పు కానీ నాకు తెలిసి తెలంగాణ ప్రభుత్వ లోపం ఏమీ లేదు.

ప్రభావాలను అధ్యయనం చేయాలనడం తప్పా?

తన వాటా నీటి హక్కులు స్థిరపడే దాకా తెలంగాణ సహా ఏ రాష్ట్రం కూడా అనుసంధానికి ఒప్పుకోదు. ఈ అంశాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం తరపున గతంలో, ఇప్పుడు కూడా ఎన్‌డబ్ల్యూడీఏకి తెలియజేసినట్లు పత్రికల్లో సమాచారం వస్తూనే ఉన్నది. ఇప్పుడు ప్రధానంగా గోదావరి-కావేరీ అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ-సమ్మక్క బరాజ్‌ల మధ్య ఇచ్చంపల్లి బరాజ్ ప్రతిపాదన వస్తున్నది. ఇచ్చంపల్లి నిర్మాణంతో ఈ రెండింటిపై ఏ రకమైన ప్రభావాలు ఉంటాయన్న సంగతి తేల్చేందుకు అధ్యయనం చేయాలనడం తప్పా? కింద నున్న దేవాదుల, సమ్మక్క, సీతారామ ప్రాజెక్టులకు ఉన్న కేటాయింపులను వినియోగించుకునేందుకు ఆపరేషన్ ప్రొటోకాల్ తయారైందా? అన్న ప్రశ్న తప్పేలా అవుతుంది. ముఖ్యంగా రబీకి నీటిని వదలాలని కేంద్రాన్ని అడుక్కునే పరిస్థితి ఏర్పడుతుందన్న అనుమానాలను నివృత్తి చేయాలా వద్దా? అనుసంధానం ద్వారా తరలించే 147 టీఎంసీల నీటిలో 50 శాతం అంటే 73 టీఎంసీల నీరు తెలంగాణకు కేటాయించే అవకాశముందని వెదిరె చెబుతున్నా, తాజాగా రాష్ట్రాలకు పంపిన డీపీఆర్‌లో తెలంగాణ వాటా 44 టీఎంసీలేనని పేర్కొన్నారని పత్రికల్లో వార్తలొచ్చాయి. టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్‌గా వెదిరె ఈ విషయంపై స్పష్టతనివ్వాలి. నదుల అనుసంధాన ప్రాజెక్టు టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్‌గా కీలక బాధ్యతల్లో ఉన్న వెదిరె, తెలంగాణ బిడ్డగా తన హోదా, పరపతిని ఉపయోగించి గోదావరి బేసిన్‌లో పెండింగ్ డీపీఆర్‌లు అన్నింటికీ త్వరగా క్లియరెన్స్‌లు ఇప్పించాలి. ఇవి ఆయనకు కష్టమైన పనులని నేను భావించడం లేదు.

అమిత్‌షా స్పీచ్ మార్ఫింగ్ కేసులో ఐదుగురు అరెస్ట్

- నిందితులకు బెయిల్ మంజూరు చేసిన నాంపల్లి కోర్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ): కేంద్రమంత్రి అమిత్ షా ప్రసంగం వీడియోను మార్ఫింగ్ చేసిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్టు సైబర్ క్రైమ్స్ డీసీపీ కవిత తెలిపారు. నిందితులు టీపీసీసీ సోషల్ మీడియా యూనిట్ ప్రతినిధులు పెండ్యాల వంశీకృష్ణ, మన్నె సతీశ్, పెట్టం నవీన్, అస్మ తస్లీమా, కోయ గీతను కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిందని వెల్లడించారు. నిందితుల నుంచి 5 సెల్‌ఫోన్లు, ట్యాబ్, 2 ల్యాప్ టాప్‌లు, 2 సీపీయూలను స్వాధీనం చేసుకున్నామన్నారు. బెయిల్ పొందిన వెంటనే ఐదుగురు అజ్ఞాతంలోకి వెళ్లారు. అమిత్‌షా స్పీచ్ వీడియో మార్ఫింగ్ కేసులో ఢిల్లీ సైబర్‌క్రైమ్ పోలీసులు స్పిరిట్ అఫ్ తెలంగాణ ట్విట్టర్ ఖాతా నిర్వహిస్తున్న అరుణ్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఇతడు జాతీయ కాంగ్రెస్ సోషల్‌మీడియా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నాడు.

అమిత్ షాపై కేసు నమోదు

హైదరాబాద్, సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ): కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 1వ తేదీన పాత బస్తీలో అమిత్ షా రోడ్డు షో నిర్వహించి, అనంతరం సభలో పాల్గొన్నారు. ఈ సభలో అమిత్ షాతో కొందరు చిన్నారులు ఉన్నారని, ఓ చిన్నారి చేతిలో బీజేపీ సింబల్ ఉన్నదని పేర్కొంటూ కాంగ్రెస్ నేత నిరంజన్ ఈసీకి ఫిర్యాదు చేశారు.

రాష్ట్రంలో గాడిదగుడ్డు పాలన: కిషన్ రెడ్డి

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి గాడిదగుడ్డు ఇస్తున్నాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శించారు. 5 నెలల్లోనే కాంగ్రెస్ అవినీతి మార్కును రేవంత్‌రెడ్డి చూపిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో పెండింగ్ నియామకాలకు అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇచ్చి, 28,942 ఉద్యోగాలు భర్తీ చేసినట్టు కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఎద్దేవాచేశారు.

రోహిత్ వేముల దళిత్ కాదు!

- ఆత్మహత్యకు కారణం కులవివక్ష కాదు
- అసలు కులం బయటపడుతుందన్న భయంతోనే బలవన్మరణం
- నిందితులుగా ఉన్న బీజేపీ నేతలందరికీ క్లీన్‌చిట్
- హైకోర్టుకు రాష్ట్ర పోలీసుల నివేదిక
- పునర్విచారణ జరుపుతామని డీజీపీ ప్రకటన
- మరోసారి హెచ్‌సీయూలో విద్యార్థుల ఆందోళన



జస్టిస్ ఫర్ రోహిత్ ఆందోళనలో పాల్గొని మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నేత రాహుల్ (ఫైల్)

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్య కేసు దర్యాప్తును ముగిస్తున్నట్టు తెలంగాణ పోలీసులు పేర్కొన్నారు. రోహిత్ వేముల దళితుడు కాదు అని పేర్కొంటూ పోలీసులు హైకోర్టుకు తమ దర్యాప్తు నివేదికను సమర్పించారు. తన అసలు కులం బయటపడుతుందన్న భయంతోనే రోహిత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆ నివేదికలో పేర్కొన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న నాటి సికింద్రాబాద్ ఎంపీ, ప్రస్తుత హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, నాటి బీజేపీ ఎమ్మెల్సీ ఎన్ రామచందర్‌రావు, హైదరాబాద్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ అప్పారావు, నాటి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, పలువురు ఏబీవీపీ నాయకులకు పోలీసులు క్లీన్‌చిట్ ఇచ్చారు. వేముల కుటుంబసభ్యుల కులం సర్టిఫికెట్లు అన్నీ నకిలీవని, ఎటువంటి సాక్ష్యాధారాలు లేని కారణంగా కేసును మూసివేస్తున్నామని పేర్కొన్నారు. దీనిపై కింది కోర్టులో ప్రొటెస్ట్ పిటిషన్ వేసుకోవచ్చని హైకోర్టు వేముల కుటుంబానికి సూచించింది.

పోలీసుల నివేదిక అత్యంత దారుణం అని రోహిత్ వేముల సోదరుడు రాజా వేముల పేర్కొన్నారు. దీనిపై ఎలా స్పందించాలో తెలియడం లేదని వాపోయారు. రోహిత్ వేముల 2016 జనవరి 17న హాస్టల్ గదిలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన దేశవ్యాప్తంగా కుల వివక్ష వ్యతిరేక ఆందోళనలకు తెరతీసింది. యూనివర్సిటీల్లో దళితులపై కొనసాగుతున్న వివక్షను నిరసిస్తూ దేశంలోని దాదాపు అన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు ఆందోళనలకు దిగారు.

నివేదికలో స్టేట్‌మెంట్లు మాయం: రాజా వేముల

పోలీసుల నివేదికపై శనివారం హైదరాబాద్ వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని రాజా వేముల చెప్పారు. పోలీసులు 2017 తరువాత కేసు దర్యాప్తును నిలిపివేశారని అన్నారు. తమ కుటుంబపు కుల ధ్రువీకరణపై 15 మంది సాక్షుల నుంచి సేకరించిన వాంగ్మూలాలను జిల్లా కలెక్టర్‌కు ఇచ్చారని తెలిపారు. ఆ వాంగ్మూలాల గురించి పోలీసులు తమ నివేదికలో ఎక్కడా ప్రస్తావించలేదని, అలా ఎందుకు జరిగిందో పోలీసులే చెప్పాలని అన్నారు.

బీజేపీ నేతలకు కాంగ్రెస్ సర్కార్ క్లీన్‌చిట్!

చట్టం ప్రకారం ఒకరి కులాన్ని ధ్రువీకరించాల్సింది జిల్లా కలెక్టర్ తప్ప, పోలీసులు కాదు. కులాన్ని ధ్రువీకరించేందుకు జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ (డీఎల్‌ఎస్సీ) సాక్ష్యాధారాలను సేకరించి కలెక్టర్‌కు అందజేస్తుంది. దాని ఆధారంగా కలెక్టర్ తన నిర్ణయాన్ని వెలువరిస్తారు. రోహిత్ కులానికి సంబంధించి 15 మంది సాక్షుల నుంచి సేకరించిన వాంగ్మూలాలపై జిల్లా కలెక్టర్ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని హైకోర్టులో వేముల కుటుంబం పక్షాన వాదనలు వినిపించిన న్యాయవాది ఏ సత్యప్రసాద్ చెప్పారు. కలెక్టర్ తన నిర్ణయాన్ని వెల్లడించకముందే వేముల దళితుడు కాదని పోలీసులు నిర్ధారించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఇంత హడావుడిగా నివేదికను సమర్పించాల్సిన అవసరం ఏమొచ్చిందని న్యాయమూర్తి కూడా వ్యాఖ్యానించారని సత్యప్రసాద్ తెలిపారు. పోలీసుల నివేదిక వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నదని అన్నారు. బీజేపీ నేతలు, వైస్ చాన్స్‌లర్ చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యల కారణంగానే రోహిత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అన్న అంశంపై దర్యాప్తు చేయడానికి బదులుగా మృతుడి కులం ఏమిటో తెలుసుకోవడంపై దృష్టి సారించారని చెప్పారు. ఈ కేసులో నిందితులందరూ బీజేపీ నాయకులని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వారందరికీ



రోహిత్ వేముల చట్టం తెస్తామని ప్లీనరీ సమావేశంలో చేసిన తీర్మాన పత్రం

క్లీన్ చిట్ ఇవ్వడం దురదృష్టకరమని సత్యప్రసాద్ వ్యాఖ్యానించారు.

దర్యాప్తు అధికారులపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలి: జైభీమారావు

తప్పుడు నివేదికను రూపొందించిన పోలీసులపై ఎస్సీ/ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టంలోని సెక్షన్ 4 కింద కేసు నమోదు చేయాలని మరో న్యాయవాది జైభీమారావు పేర్కొన్నారు. షెడ్యూల్డు కులాలలోని మాల కులానికి చెందిన వ్యక్తినని రోహిత్ తల్లి రాధిక వేముల మొదటి నుంచి చెప్తూనే ఉన్నారని అన్నారు. ఆమె తన బాల్యం నుంచి ఓబీసీలుగా ఉన్న వడ్డెర కులానికి చెందిన వారింట్లో పెరిగారని తెలిపారు. చట్టాన్ని పరిగణించకుండా.. కేవలం కొన్ని ప్రాథమిక నివేదికల ఆధారంగా అధికారులు ఒక అంచనాకు వచ్చారని విమర్శించారు. ఇందుకు దర్యాప్తు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ మద్దతు ఏమైంది?

రోహిత్ ఆత్మహత్య అనంతరం సాగిన 'జస్టిస్ ఫర్ వేముల' ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ మద్దతునిచ్చింది. రెండేండ్ల క్రితం 2022, నవంబర్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రోహిత్ తల్లి రాధికను తమ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. గత ఏడాది ఫిబ్రవరిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశంలో 'రోహిత్ వేముల చట్టం' తెస్తామని ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారి విద్యా హక్కును పరిరక్షించేందుకు రోహిత్ వేముల చట్టాన్ని తెస్తామని ఆ పార్టీ పేర్కొంది. తీరా ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమే కేసును నీరుగార్చే విధంగా నివేదికను ఇవ్వడంపై విద్యార్థి సంఘాలు విస్మయం వ్యక్తం చేశాయి. ఈ నివేదిక తెలంగాణ పోలీసులకు, ఆరెస్సెస్, ఏబీవీపీకి మధ్యనున్న సంబంధాలను స్పష్టం చేస్తున్నదని అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఇనియావన్ భానుమతి ఆరోపించారు. ఆరెస్సెస్ 2015 నుంచి వినిపిస్తున్న కథనానికి పోలీసుల నివేదిక ప్రతిరూపంగా ఉన్నదని అన్నారు.

మళ్లీ దర్యాప్తు : డీజీపీ

రోహిత్ వేముల ఆత్మహత్య కేసుపై మళ్లీ దర్యాప్తు జరుపుతామని రాష్ట్ర డీజీపీ రవిగుప్తా శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేసులో దర్యాప్తు నివేదికను గత ఏడాది చివరలో రూపొందించారని, దాని ఆధారంగానే దర్యాప్తు అధికారి గత నెల 21న కోర్టుకు తుది నివేదికను సమర్పించారని తెలిపారు. అయితే విచారణ జరిగిన తీరుపై రోహిత తల్లితోపాటు మరికొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నందున మరోసారి విచారణ జరుపాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ మేరకు మేజిస్ట్రేట్ నుంచి అనుమతి కోరుతామని వెల్లడించారు.

ఆదుకుంటామన్నారు.. కేసును ఆగం పట్టించారు

రోహిత్ వేముల కేసును కాంగ్రెస్ సర్కార్ మొత్తానికి ఆగం పట్టించిందని విద్యార్థిలోకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. బీజేపీకి అనుకూలంగా వారు చెప్పినట్టే కేసును మూసివేయించిందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. రోహిత్ కుటుంబానికి అండగా నిలుస్తామని కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ గాంధీ స్వయంగా చెప్పాడని, ఇప్పుడు ఆ పార్టీ ప్రభుత్వమే వారికి అన్యాయం చేస్తున్నదని మండిపడుతున్నాయి. దళిత, వెనుకబడిన తరగతుల వారు వివక్షకు గురికాకుండా 'రోహిత్ వేముల' చట్టాన్ని తీసుకొస్తామని ఇటీవల తమ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన కాంగ్రెస్ పార్టీ తీరా అధికారంలోకి వచ్చాక ఈ కేసులో నిందితులుగా ఉన్న బీజేపీ నేతలకు అండగా నిలుస్తున్నదని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

హెచ్‌సీయూలో మరోసారి ఆందోళన

కొండాపూర్, మే 3 : రోహిత్ వేముల ఆత్మహత్యపై పోలీసుల నివేదికను వ్యతిరేకిస్తూ శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. వర్సిటీలోని వెలివాడ నుంచి ప్రధాన గేట్ వరకు వివిధ సంఘాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన గేట్ ముందు ధర్నాకు దిగారు. రోహిత్ వేముల ఆత్మహత్యకు పాల్పడి ఎనిమిదేండ్లు గడుస్తున్నా ఇప్పటికీ న్యాయం జరగలేదని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. రోహిత్ కుల వివక్ష కారణంగానే ఆత్మహత్యకు పాల్పడ్డాడని 16 మంది సాక్ష్యం చెప్పినా పోలీసులు పట్టించుకోలేదని అన్నారు. రోహిత్ వేములకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగుతుందని విద్యార్థులు స్పష్టం చేశారు.



మహిళా కూలీ చెంప ఛెళ్లుమనిపిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి

మహిళా కూలీకి చెంపదెబ్బ

- తడుతూనే కొట్టిన టీ జీవన్‌రెడ్డి
- విస్తుపోయిన వృద్ధురాలు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఆర్మూర్‌టౌన్, మే 3: నిజామాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి టీ జీవన్‌రెడ్డి. ఓ మహిళ చెంప ఛెళ్లుమనిపించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని గోవింద్‌పేట్, చేపూర్, పిప్రి గ్రామాల్లో జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోటుకు వెళ్లి ఓ మహిళా కూలీతో మాట్లాడారు. ఈ క్రమంలో ఆమె వినయ్‌రెడ్డిని ఉద్దేశిస్తూ 'మొన్న ఎన్నికల్లో పువ్వు గుర్తుకు ఓటేసిన' అని చెప్పింది. అప్పటికే ఆమె చెంప తడుతూ ఉన్న జీవన్‌రెడ్డి ఒక్కసారిగా ఛెళ్లుమనిపించారు. దీంతో విస్తుపోయిన ఆ వృద్ధురాలు, క్షణాల్లోనే తేరుకొని తనను తాను సంభాళించుకున్నది. 'నాకు పింఛిన యితే ఇవ్వండి సారు..' అంటూ చేతులు జోడించి ఆమె వేడుకోగా, 'వెళ్లి ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని అడుగు' అంటూ వినయ్‌రెడ్డి విసుగ్గా చెప్పడం వీడియోలో కనిపించింది.

తెలంగాణకు కాంగ్రెస్ ప్రత్యేక మ్యానిఫెస్టో

- ఏపీలో కలిపిన ఐదు మండలాలు వెనక్కి
- కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్రానికి 'పాంచ్ న్యాయ్' పేరిట ప్రత్యేక మ్యానిఫెస్టోను విడుదల చేసింది. గాంధీభవన్‌లో శుక్రవారం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తెలుగులో ముద్రించిన ఎన్నికల ప్రణాళిక 'ఐదు న్యాయాలు-తెలంగాణకు ప్రత్యేక హామీలు'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణలో యువత, రైతులు, మహిళలు, కార్మికులకు న్యాయం జరిగేలా మ్యానిఫెస్టోను రూపొందించినట్టు వివరించారు. తెలంగాణలో 15 ఎంపీ సీట్లు సాధించడం ద్వారా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

రాష్ట్రానికి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ..

- హైదరాబాద్ మహానగరానికి ఐటీఐఆర్ ప్రాజెక్టును తీసుకరావడం.
- కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ
- బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ
- హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు
- హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి నుంచి రాపిడ్ రైల్వే వ్యవస్థ
- మైనింగ్ విశ్వవిద్యాలయం
- ఆంధ్రలో విలీనమైన ఏటపాక, గుండాల, పురుషోత్తంపట్నం, కన్నె గూడెం, పిచుకలపాడు తిరిగి విలీనం
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయహోదా
- హైదరాబాద్‌లో నీతి ఆయోగ్ ప్రాంతీయ కార్యాలయం
- రామగుండం-మణుగూరు మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణం
- నాలుగు కొత్త సైనిక్ స్కూళ్లు
- కేంద్రీయ విద్యాలయాలు రెట్టింపు
- నవోదయ విద్యాలయాలు రెట్టింపు
- రాష్ట్రానికి జాతీయ క్రీడా వర్సిటీ
- ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో పరిశోధన
- నేషనల్ ఏవియేషన్ యూనివర్సిటీ
- రాష్ట్రానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ)
- తెలంగాణకు ఐఐఎస్‌ఈఆర్
- సర్పంచ్‌లకు నేరుగా కేంద్రం నిధులు
- ప్రతి ఇంటికీ సౌరశక్తి
- హైదరాబాద్ - బెంగళూరు మధ్య ఐటీ, పారిశ్రామిక కారిడార్
- హైదరాబాద్ - నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్
- హైదరాబాద్ - వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్
- అంతర్జాతీయ ప్రమాణాలతో సాంస్కృతిక, వినోద కేంద్రం
- మేడారం జాతరకు జాతీయ హోదా
- డ్రైపోర్టు ఏర్పాటు
- హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్

జిల్లాలను రద్దు చేస్తే భస్మీపటలమే

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



వనపర్తి, మే 3 (నమస్తే తెలంగాణ): రేవంత్ సర్కారు కొత్త జిల్లాలను రద్దు చేస్తే ప్రజల చేతుల్లో కాంగ్రెస్ పార్టీ భస్మీపటలం కావడం ఖాయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన వనపర్తిలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు కొత్త జిల్లాలను రద్దుకు కమిటీ వేస్తున్నట్టు ప్రచారం జరుగుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజల అభీష్టం మేరకు.. పరిపాలనా సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. జిల్లాలు ఏర్పడిన నాటి నుంచి ఆయా ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందినట్టు తెలిపారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలతో పాటు మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలలు ఏర్పడినట్టు చెప్పారు. గతంలో పంజాబ్, హర్యానా కలిసి ఉండగా, కాంగ్రెస్ పార్టీనే రెండు రాష్ట్రాలుగా ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ రెండు రాష్ట్రాల జనాభా దాదాపు 5 కోట్లపైబడి ఉండగా.. అక్కడ 46 జిల్లాలు ఉన్నాయని తెలిపారు. వాటితో పోల్చుకుంటే 4 కోట్ల జనాభా ఉన్న తెలంగాణలో 33 జిల్లాలు తక్కువేనని ఉదహరించారు. జిల్లాల వ్యవస్థను తొలగిస్తామని వస్తున్న లీకులపై మంత్రి జూపల్లి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మళ్లీ గోస తప్పదని హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలని కోరారు.

జిల్లాలను కుదిస్తే రాష్ట్రం అగ్నిగుండమే

- ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమిస్తారు
- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీ హెచ్చరిక



నాగర్‌కర్నూల్, మే 3: జిల్లాలను కుదిస్తే ప్రజల ఆందోళనలతో రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన నాగర్‌కర్నూల్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కేసీఆర్ 33 జిల్లాలు ఏర్పాటు చేస్తే, కాంగ్రెస్ జిల్లాలను తగ్గించాలన్న యోచన చేస్తున్నదన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే చర్యలను రేవంత్ ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. ఎంపీ ఎన్నికల్లో ప్రాంతేతరుడైన మల్లు రవిని ఓడించాలని పిలుపునిచ్చారు. మత విభేదాలు సృష్టించే బీజేపీని ఓడించాలని కోరారు. కాంగ్రెస్ సర్కారు రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, అందుకే పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపడుతున్నట్టు స్పష్టం చేశారు. ఈ ఉద్యమానికి రైతులు స్వచ్ఛందంగా మద్దతు పలుకాలని కోరారు. స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం జారీ చేసిన జీవో 46ను సవరించి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ జిల్లా జోలికొస్తే ఊరుకోం

- కుమ్రంభీం స్ఫూర్తితో ఉద్యమిస్తాం
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి హెచ్చరిక



ఆసిఫాబాద్ టౌన్, మే 3 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆసిఫాబాద్ జిల్లా జోలికొస్తే ఊరుకునేది లేదని, కుమ్రంభీం స్ఫూర్తితో ఉద్యమిస్తామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. జిల్లాను తొలగిస్తే కాంగ్రెస్ పార్టీ నేతలు జిల్లాలో తిరగలేరని హెచ్చరించారు. జిల్లాల కుదింపు ఆలోచన మానుకోవాలని సూచించారు. జిల్లా ఏర్పాటు తర్వాత ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. కుమ్రంభీం ప్రాజెక్టు నిర్మాణం కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని, దాని నాణ్యత లోపానికి కాంగ్రెస్ సర్కారే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కాలువలు పూర్తికాకముందే అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించిన విషయం మర్చిపోయారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉంటేనే అభివృద్ధి చేస్తారా? అని సీఎం రేవంత్‌ను ఆమె ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ విఠల్ ఎన్నిక రద్దు

- కాంగ్రెస్ నేత పిటిషన్‌పై హైకోర్టు తీర్పు
- తీర్పు అమలు 4 వారాలు వాయిదా
- సుప్రీంలో సవాలు చేయనున్న విఠల్



హైదరాబాద్, మే 3, (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక చెల్లదని రాష్ట్ర హైకోర్టు ప్రకటించింది. కాంగ్రెస్ నాయకుడు పాతిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు చెప్పింది. విఠల్‌కు రూ.50 వేల జరిమానా విధించింది. తీర్పుపై అప్పీల్‌కు వీలుగా తీర్పు అమలును 4వారాల పాటు నిలిపివేయాలన్న విఠల్ తరపు న్యాయవాది విజ్ఞప్తికి అనుమతించింది. ఆదిలాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా దండె విఠల్ 2022లో ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పాతిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అయితే, తన సంతకాన్ని ఫోర్జరీ చేసి నామినేషన్ ఉపసంహరణ చేయించారని రాజేశ్వర్‌రెడ్డి హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. విఠల్ ఎన్నిక అక్రమమని, తానే ఎమ్మెల్సీగా ఎన్నికైనట్టు ప్రకటించాలని కోరా రు. పిటిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేశారో లేదో తేల్చేందుకు హైకోర్టు ఆ పత్రాలను కేంద్ర ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపింది. ఫోరెన్సిక్ ల్యాబ్ పరిశీలనలో రాజేశ్వర్‌రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేశారని తేలింది. ఈవ్యవహారంపై ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వులో పెట్టింది. జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం తీర్పు వెలువరించారు. 'ఎమ్మెల్సీ విఠల్ ఎన్నిక చెల్లదు.తిరిగి ఎన్నిక నిర్వహించాలి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిటిషనర్ రాజేశ్వర్ రెడ్డి పోటీలో లేరు కాబట్టి ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లుగా ప్రకటించేందుకు ఆస్కారం లేదు. రాజేశ్వర్ రెడ్డి సంతకాన్ని దస్తూరాబాద్ ఎంపీపీ కిషన్ సింగారి ఫోర్జరీ చేసి ఇస్తే దానిని ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిర్ధారణ చేసుకోకుండా నామినేషన్‌ను (రాజేశ్వర్ రెడ్డిది) తిరస్కరించారు. విఠల్ –కిషన్ కుమ్మక్కు అయ్యారు' అని హైకోర్టు తీర్పులో పేర్కొన్నది. ఇదిలా ఉంటే శాసనమండలి సభ్యుడిగా తన ఎన్నిక చెల్లదని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని దండె విఠల్ తెలిపారు. వేరే అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ తనకు సంబంధం లేదని పేర్కొన్నారు. తాను ఏకగ్రీవంగా ఎన్నిక కాలేదని, ఎన్నికల్లో నిలబడి గెలిచానని, అభ్యర్థుల ఉపసంహరణ ప్రక్రియ రిటర్నింగ్ అధికారికి సంబంధించినదని ఆయన వివరించారు. ఎన్నిక చెల్లదని ఇచ్చిన తీర్పుపై సుప్రీంలో న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని పేర్కొన్నారు.

దినసరి కూలీగా కిన్నెర మెట్ల మొగులయ్య

- ఆర్థిక ఇబ్బందులతో సతమతం!
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- నేడు కేటీఆర్‌ను కలవనున్న కళాకారుడు

అచ్చంపేట, మే 3 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అవుసలికుంటకు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత 12మెట్ల కిన్నెర కళాకారుడు మొగులయ్య ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అయ్యింది. 2022 మార్చి 21న పద్మశ్రీ అందుకొన్న ఆయనకు కేసీఆర్ ప్రభుత్వం రూ.కోటి నజరానా ప్రకటించింది. పిల్లల పెండ్లిళ్లు చేయడంతోపాటు హైదరాబాద్ శివారులోని తుర్కయాంజాల్‌లో 100 గజాల్లో ఇల్లు నిర్మించుకుంటున్నాడు. డబ్బులు సరిపోక పనులు ఆపేశాడు. కళాకారుడిగా రూ.10 వేలు పింఛన్ వస్తున్నది. కుటుంబ పోషణకు పింఛన్ సరిపోవడం లేదని, హయత్‌నగర్‌లో ఇంటి స్థలం కోసం జీవో ఇచ్చినా అధికారులు స్థలం అప్పగించలేదని మొగులయ్య ఆవేదన వ్యక్తం చేసినట్టు సోషల్ మీడియా లో వైరల్ అయ్యింది. మొగులయ్య తుర్కయాంజాల్‌లో గృహ నిర్మాణ పనులకు వెళ్లినట్టు కళాకారుడు ఆవేదన వ్యక్తం చేసినట్టు ఆ వీడియో మీడియాలో హల్‌చల్ చేసింది. శుక్రవారం మొగులయ్యను 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో పలుకరించగా.. కష్టాలను చెప్పుకొచ్చాడు. కేసీఆర్ ప్రభుత్వం తన కిన్నెర వాయిద్య కళను గుర్తించి ఉగాది పురస్కారం అందజేసిందని, కేంద్రం పద్మశ్రీతో సత్కరించిందని తెలిపారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలువగా పింఛన్ రూ.25 వేలతోపాటు హయత్‌నగర్‌లో 600 గజాల స్థలాన్ని ఇచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు చెప్పుకొచ్చాడు. అయితే తనకు పింఛన్ రావడం లేదని సోషల్ మీడియాలో వచ్చిన కథనాల్లో నిజం లేదని, తనకు రూ.10 వేల పింఛన్ వస్తుందని, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మరింత పెంచాలని మొగులయ్య ప్రభుత్వాన్ని కోరాడు.

మొగిలయ్య కుటుంబానికి అండగా ఉంటాం

పద్మశ్రీ మొగిలయ్య కుటుంబానికి అండగా ఉంటామని కేటీఆర్ చెప్పారు. కుటుంబాన్ని పోషించడానికి మొగిలయ్య కూలీ పనులకు వెళ్తున్నట్టు మీడియాలో వచ్చిన వార్తలపై కేటీఆర్ స్పందించారు. మొగిలయ్యను వెంటనే సంప్రదించి ఆదుకుంటామని వెల్లడించారు.

ఒక్కొక్కరూ పది ఓట్లు వేయండి

- సిద్దిపేట సభలో మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలు
- కులం పేరును ప్రస్తావిస్తూ ఓట్లు అభ్యర్థన
- ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు
- ఈసీ హెచ్చరించినా మారని మంత్రి తీరు

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : 'ఒక్కొక్కరూ పది ఓట్లు వేసైనా సరే.. మన అభ్యర్థిని గెలిపించాలని' పార్టీ కాడర్‌కు, బీసీ వర్గాలకు మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలోనే ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కులాన్ని ప్రస్తావిస్తూ ఓట్లు అడిగారని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఆమె చేసిన ప్రసంగంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి భారత రాష్ట్ర సమితి ఫిర్యాదు చేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన నేపథ్యంలో తెలంగాణ స్టార్ క్యాంపెయినర్‌గా రేవంత్ రెడ్డిని తొలగించాలని, రేవంత్ రెడ్డి, కొండా సురేఖలపై ప్రచారంపై నిషేధం విధించాలని, మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. మంత్రి కొండా సురేఖ చేసిన ప్రసంగాలపై బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే రెండు సార్లు ఫిర్యాదు చేసింది. ఎన్నికల సంఘం ఆమెను తీవ్ర స్థాయిలో హెచ్చరించింది కూడా. అయినా ఆమె తన ప్రసంగాలను ఆదే విధంగా కొనసాగిస్తున్నారు. బీఆర్ఎస్, కేసీఆర్‌లపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, కులం, మతం ప్రాతిపదికన ఓట్లు అడుగుతున్నారు.





సికింద్రాబాద్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్‌కు మద్దతుగా శుక్రవారం రాత్రి సికింద్రాబాద్, సనత్‌నగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని అడ్డగుట్ట రియో పాయింట్, సీతాఫల్‌మండి, సనత్‌నగర్‌లోని బబ్బార్ కాంప్లెక్స్, నాంపల్లిలోని నోబుల్ టాకీస్ చౌరస్తా వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ శ్రేణులతో పాటు అభిమానులు, స్థానికులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆప్రాంతాలన్నీ గులాబీమయమయ్యా. జై తెలంగాణ.. జై బీఆర్ఎస్ అంటూ నినాదాలు చేశారు.

28 ఫిర్యాదులిచ్చినా చర్యలేవీ..?

- కేసీఆర్,బీఆర్ఎస్‌పై అభ్యంతర వ్యాఖ్యలు
- దేవుడిపై ఒట్టు వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి
- కోడ్ ఉల్లంఘనలపై ఈసీకి ఫిర్యాదులు

రాహుల్, రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఫిర్యాదులు

ఫిర్యాదు తేదీ	నాయకుడు	అంశం
ఏప్రిల్ 8	రాహుల్ గాంధీ	ఫోన్ ట్యాపింగ్, కేసీఆర్ తప్పుడు ఆరోపణలు
ఏప్రిల్ 10	రేవంత్ రెడ్డి	తుక్కుగూడలో బీఆర్ఎస్, కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు
ఏప్రిల్ 22	రేవంత్ రెడ్డి	భువనగిరిలో కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు రుణమాఫీని ఆగస్టు 15లోగా చేస్తానని యాదాద్రి దేవుడిపై ఒట్టు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అడవి పందులు అని వ్యాఖ్యానించడం
ఏప్రిల్ 25	రేవంత్ రెడ్డి	నిజామాబాద్ సభలో రుణమాఫీ చేస్తానని బాసర సరస్వతీపై ఒట్టు
ఏప్రిల్ 25	రేవంత్ రెడ్డి	మెట్రో పిల్లర్‌లపై హోర్డింగ్స్ ఏర్పాటు
ఏప్రిల్ 25	రేవంత్ రెడ్డి	కొడంగల్ లో ప్రసంగంలో కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు
మే 1	రేవంత్ రెడ్డి	ఎక్స్ అకౌంట్‌లో ఓయూ హాస్టల్స్‌పై ఫోర్జరీ డాక్యుమెంట్ పోస్ట్ చేయడం

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): భారత రాష్ట్ర సమితి చేసిన ఫిర్యాదులపై ఎన్నికల సంఘం చర్యలకు ఉపక్రమించడంలేదని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో స్వతంత్ర సంస్థగా ఉన్న ఎన్నికల సంఘం అన్ని పార్టీలను ఒకే తీరుగా చూడాలని, అలాకాకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ నేతలు ఆక్షేపించారు. స్వేచ్ఛగా, ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరగాలంటే ఎన్నికల సంఘం వ్యవహరించాల్సి తీరు ఇది కాదని చెబుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు 28 ఫిర్యాదులను చేసింది. అయినా కూడా ఒక్కదానిపై సరైన విధంగా సరైన సమయంలో స్పందించడంలేదని గులాబీ నేతలు విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై 8 ఫిర్యాదులు చేశారు. ఏఐసీసీ నేత రాహుల్ గాంధీపై ఫిర్యాదు చేశారు. రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఆంధ్రజ్యోతి పత్రికా యాజమాన్యం వేమూరి రాధాకృష్ణ, కే.శేషగిరిరావు, ఎడిటర్ కే.శ్రీనివాస్‌పై, బీజేపీ నేతలు రఘునందన్ రావు, బండి సంజయ్‌లపై ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై రేవంత్ రెడ్డి ప్రతి సభలోనూ నోటికి వచ్చిన బూతులు మాట్లాడుతున్నారు. ఆధార రహిత ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా దేవుడిపై ఒట్టు వేస్తూ ప్రజలకు హామీలు ఇస్తున్నారు. ఫేక్ డాక్యుమెంట్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేసినా కూడా ఈసీ స్పందించడంలేదని బీఆర్ఎస్ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వీటన్నింటిపై వీడియో ఆధారాలను సేకరించిన బీఆర్ఎస్ లీగల్ సెల్ ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. అయితే మంత్రి కొండా సురేఖకు వార్నింగ్ ఇవ్వడం మినహా చర్యలేమీ తీసుకోలేదని చెబుతున్నారు.

ఓటుకు నోటు కేసు జూలైకి వాయిదా

- కౌంటర్ దాఖలు చేయని ప్రభుత్వం
- కేసును భోపాల్‌కు బదిలీ చేయాలన్న పిటిషనర్ జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసు విచారణను సుప్రీంకోర్టు జూలై నెలకు వాయిదా వేసింది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సతీశ్‌చంద్ర మిశ్రా, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ కేసుపై శుక్రవారం విచారణ చేపట్టింది. ప్రతివాదులుగా ఉన్న తెలంగాణ ప్రభుత్వం, వ్యక్తిగత హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్‌దాఖలు చేయకపోవడంతో విచారణ జూలైకి వాయి దా పడింది. ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేసేలా ఆదేశించాలని పిటిషనర్ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి న్యాయస్థానాన్ని కోరారు. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో కేసు విచారణను మధ్యప్రదేశ్‌లోని భోపాల్ కు బదిలీ చేయాలని కోరారు. 2015లో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రేవంత్‌రెడ్డి డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేం నరేందర్‌రెడ్డికి ఓటు వేయాలని పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సూచనలతోనే స్టీఫెన్‌సన్‌ను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించినట్టు ఆరోపణలు వచ్చాయి.



పెన్‌పహాడ్ మండలం దూపాడ్ గ్రామానికి ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో తమ గోడు వెళ్లబోసుకుంటున్న మహిళలు

నోటికాడి బుక్కను పారేసుకున్నం

- కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయినం
- నీళ్లందక పంటలు ఎండిపోయినయ్
- మళ్ల కారే రావాలి.. సారే కావాలి
- సాయంలో కేసీఆర్‌ను మించినోళ్లు లేరు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఎదుట మహిళల గోడు

పెన్‌పహాడ్, మే 3 : 'కేసీఆర్ పాలనలో రెండు పంటలు పండించి మంచిగ బతికినం. పేదోళ్లకు మంచి చేయడంలో ఆయనకు మించినోళ్లు లేరు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మోసపోయినం. నీళ్లందక పంటలు ఎండిపోయి అప్పుల పాలైనం.

నోటికాడి బుక్కను పారేసుకున్నం.. మళ్లీ ఆ తప్పు చెయ్యం. ఈ సారి కారే రావాలి. కేసీఆర్ సారే కావాలి' అని సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దూపాడ్‌కు చెందిన మహిళలు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఎదుట వాపోయారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కోసం శుక్రవారం దూపాడ్‌కు వచ్చిన జగదీశ్‌రెడ్డితో గ్రామస్థులు, మహిళలు మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం పంటలను ఎండబెట్టిందని చెప్పి బాధపడ్డారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పేరుకు ఇద్దరు మంత్రులున్నా వాళ్ల కడుపులు ఎలా నింపుకోవాలనే ఆలోచన తప్ప రైతులకు మంచి చేయాలనే ధ్యాసే లేదని వాపోయారు. 'మీరు మంత్రిగా ఉన్నప్పుడు కాల్వ గట్ల మీద రేయింబవళ్లు తిరిగి కుంటలు, చెరువులు నింపి మా పొలాలకు నీళ్లిచ్చిన్రు' అని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు రైతుబంధు కూడా రాలేదని చెప్పారు.

పట్టభద్రుల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డిని పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామానికి చెందిన రాకేశ్‌రెడ్డి బిట్స్ పిలానీ సహా అమెరికాలోనూ ఉన్నత విద్యను అభ్యసించారు. అమెరికాలో సిటీ బ్యాంక్ మేనేజర్‌గా, జేపీ మోర్గాన్, ఫేస్‌బుక్ సహా పలు అంతర్జాతీయ కార్పొరేట్ కంపెనీల్లో పనిచేశారు. రాజకీయాలపై మక్కువతో 2013లో బీజేపీలో చేరి బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరారు. పట్టభద్రుల్లో రాకేశ్ రెడ్డికి ఉన్న ఫాలోయింగ్ దృష్ట్యా బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆయనను పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించారు.

మోదీ చట్టానికి అతీతుడా..?

ప్రధాని వ్యాఖ్యలపై ఈసీని నిలదీసిన కేటీఆర్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): అసలు దేశంలో ఎన్నికల సంఘం ఉన్నదా?.. ప్రధాని మోదీ చట్టానికి అతీతులా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని మార్చాలని కాంగ్రెస్ చూస్తుందంటూ, దళితులు, ఓబీసీల రిజర్వేషలను జిహాదీలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నదంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎన్నికలు స్వేచ్ఛగా జరుగాలని భావించే ఈసీ ఇటువంటి వ్యాఖ్యలపై ఎందుకు స్పందించడం లేదని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మాట్లాడుతున్న ప్రధానిపై ఈసీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. తాము భేటీ బచావో.. భేటీ పడావో పథకాన్ని తీసుకొచ్చామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నదని, కానీ దేశంలో జరుగుతున్న అకృత్యాలు ఆ ప్రభుత్వానికి కనిపించడం లేదని కేటీఆర్ విమర్శించారు.

కొండప్పకు ఇచ్చిన హామీ కొండెక్కింది

- 25 లక్షల ఆర్థిక సాయం దేవుడెరుగు.. అందని నెలనెలా 25 వేల పింఛన్

నారాయణపేట, మే 3 : దేశంలోనే అత్యుత్తమ అవార్డు అందుకున్న నారాయణపేట జిల్లా దామరగిద్దకు చెందిన బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్పకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ కొండెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం తరపున ఫిబ్రవరి 4న జరిగిన పద్మశ్రీ అవార్డు గ్రహీతల సన్మాన సభలో ఆయన్ను సన్మానించి రూ.25 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ప్రతినెలా రూ.25 వేల పింఛన్ అందిస్తామని సీఎం రేవంత్ కొండప్పకు హామీ ఇచ్చారు. కానీ ఆచరణలో మాత్రం అమలు కాలేదని పలువురు పేర్కొంటున్నారు. నెలనెలా అందాల్సిన పింఛన్ ఒక్క జనవరి నెలలో మాత్రమే వచ్చిందని, ఆ తర్వాత ఇప్పటివరకు రాలేదని కుమారుడు రాము ఆవేదన వ్యక్తం చేశాడు.

లోకం పోకడ



ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	46.6°c	33.5°c
ఆదిలాబాద్	46.3°c	22.2°c
మెదక్	44.6°c	20.0°c
మహబూబ్‌నగర్	44.5°c	29.0°c
కరీంనగర్	44.0°c	28.0°c
రంగారెడ్డి	44.0°c	18.9°c
హైదరాబాద్	43.6°c	27.1°c
నిజామాబాద్	43.3°c	24.5°c
ఖమ్మం	43.0°c	29.0°c
వరంగల్	43.0°c	28.0°c

ఠారెత్తిస్తున్న ఎండలు

- పలుచోట్ల 46.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- హైదరాబాద్‌లో 48 డిగ్రీలకు చేరుకునే అవకాశం

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మండే ఎండలతో మాడు పగిలిపోతున్నది.. బయటికెళ్తే నెత్తి చుర్రుమంటున్నది.. వడగాలులు, ఉక్కపోత ఠారెత్తిస్తున్నాయి.. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం వివిధ జిల్లాల్లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత వారం రోజులుగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. భానుడి ఉగ్రరూపంతో ఉదయం ఎనిమిది గంటల నుంచే మొదలై సాయంత్రం దాటిన తర్వాత కూడా ఎండ వేడి ప్రభావం చూపుతున్నది. సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పిల్లలు, వృద్ధులు వడ గాడ్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడదెబ్బ సోకి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు మృతి చెందారు. హైదరాబాద్ నగరంలో ఎండలు దంచికొడుతున్నాయి. హైదరాబాద్‌లో రాబోయే ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు 45 నుంచి 48 డిగ్రీలకు చేరవచ్చని, కనిష్ఠ ఉష్ణోగ్రత 36 డిగ్రీలు నమోదవుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. 6 నుంచి కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలొస్తాయని అంచనా వేస్తున్నట్టు ఐఎండీ హైదరాబాద్ విభాగం డైరెక్టర్ నాగరత్న తెలిపారు.

పెరుగుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పెద్దపల్లి జిల్లా మంథనిలో 46.7, నేరెళ్ల (జగిత్యాల)లో 46.7, మునగాల (సూర్యాపేట)లో 46.7, పమ్మి (ఖమ్మం)లో 46.7, కామారెడ్డిగూడెం (నల్లగొండ)లో 46.6, హాజీపూర్ (మంచిర్యాల)లో 46.5, వీణవంక (కరీంనగర్)లో 46.5, మట్టపల్లి, మామిళ్ల (సూర్యాపేట)లో 46.5, ఇబ్రహీంపట్నం (నల్లగొండ)లో 46.5, కేసముద్రం (మహబూబాబాద్)లో 46.4, ఉట్కూరు (నారాయణపేట)లో 46.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

దేశవ్యాప్తంగా భగభగలు

ఈ ఏడాది ఏప్రిల్ తొలి వారం నుంచే సూరీడు ఉగ్రరూపం దాల్చాడు. ఫలితంగా ఏప్రిల్‌లో 45 డిగ్రీల ఉష్ణోగ్రత దాటిపోయింది. వచ్చే ఐదు రోజుల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో వాతావరణం మరింత వేడెక్కుతుందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది.

పిడుగుపాటుతో ఇద్దరు మృతి

ములకలపల్లి/పెనుబల్లి, మే 3: రాష్ట్రంలో శుక్రవారం పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం ఒడ్డురామవరం గ్రామానికి చెందిన రైతు బోడ శివరాం (43) మార్కెట్ యార్డులో ధాన్యాన్ని కుప్ప చేస్తుండగా పిడుగుపడి మృతిచెందాడు. మరో రైతు గుగులోతు శ్రీనుకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నాడు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కందిమల్లవారి బంజరకు చెందిన కూలి ఎరికెపల్లి పూర్ణచంద్రరావు (34) పశువులను తోలుకొని వెళ్తుండగా పిడుగుపడి మృతిచెందాడు.

రాష్ట్రానికి పట్టిన శని రేవంత్‌రెడ్డి

- బీఆర్ఎస్ నేత గట్టు రాంచందర్ రావు



హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి పట్టిన శని రేవంత్‌రెడ్డి అని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయడం ద్వారా శనిని వదిలించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ నేత గట్టు రాంచందర్‌రావు అన్నారు. రేవంత్‌రెడ్డికి బీజేపీతో రహస్య ఒప్పందం ఉందని ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఇప్పటికీ సీఎం హోదాను మరిచి మాట్లాడుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి అత్యంత పిరికిపంద అని, ఢిల్లీకి పోయి బీజేపీ నేతల కాళ్లు పట్టుకుంటాడని విమర్శించారు. కేసీఆర్ ప్రచారాన్ని 48 గంటలు ఆపడం వెనుక తెర ముందు కాంగ్రెస్, తెర వెనుక బీజేపీ ఉన్నాయని మండిపడ్డారు. కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లడంతో కాంగ్రెస్, బీజేపీల్లో వణుకు పుట్టిందని అన్నారు. రేవంత్ రెడ్డిని కాంగ్రెస్‌పార్టీ ఎప్పటి వరకు సీఎంగా ఉంచుతుందో తెలియదన్నారు. రేవంత్ రెడ్డి భాషపై ఎన్నికల సంఘానికి 8 ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదని ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మూడవ స్థానం ఖాయమని జోస్యం చెప్పారు.

పోలీస్ చేజింగ్‌కు భారతీయులు బలి!

కెనడా రోడ్డు ప్రమాదంలో దంపతులతోపాటు పసికందు మృతి

టొరంటో, మే 3: కెనడాలో ఓ దోపిడీ దారుడిని పోలీసులు చేజ్ చేసే క్రమంలో వాహనాలు ఢీకొని భారత్‌కు చెందిన దంపతులు, మూడు నెలల వయసున్న వారి మనుమడు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం ప్రకారం టొరంటోకు 50 కిలోమీటర్ల దూరంలోని విట్ బై హైవేలో ఏప్రిల్ 29న ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు అధిక వేగంతో తమ వాహనం నడపడంతో ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తున్నది. ఈ ప్రమాదంలో ఆరుకుపైగా వాహనాలు ఒకదానికి ఒకటి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో దోపిడీ అనుమానితుడు కూడా అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో మరణించిన భారతీయ దంపతుల పేర్లను పోలీసులు వెల్లడించలేదు. మృతి చెందిన చిన్నారి తల్లిదండ్రులు కూడా ఇదే ప్రమాదంలో గాయపడ్డారు. వారిలో చిన్నారి తల్లి పరిస్థితి విషమంగా ఉంది.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

కల్లోల మణిపూర్

- హింసాకాండ చెలరేగి ఏడాది
- 226 మందిని బలితీసుకొన్న మైతీ, కుకీ వర్గాల మధ్య ఘర్షణ
- నేటికీ రాష్ట్రంలో అవే ఉద్రిక్తతలు
- శాంతి నెలకొల్పడంలో కేంద్ర, రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు విఫలం



ఇంఫాల్, మే 3: మణిపూర్‌లో మైతీ, కుకీ వర్గాల మధ్య ఘర్షణతో చెలరేగిన హింసాకాండకు శుక్రవారంతో ఏడాది గడిచింది. గత ఏడాది మే 3న ప్రారంభమైన ఈ హింసతో రాష్ట్రప్రజలు రెండుగా చీలిపోయారు. ఏడాది గడిచినా, మణిపూర్‌లో పరిస్థితులు ఇంకా సద్దుమణగలేదు. నేటికీ రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకొంటున్నాయి. హింసాకాండలో ఇప్పటికి 200 మందికి పైగా మరణించగా, 1,500 మందికి పైగా గాయపడ్డారు. వేలాది ఇండ్లు ధ్వంసం కావడంతో 60 వేల మందికి పైగా ప్రజలు శరణార్థి శిబిరాల్లో, ఇతర ప్రాంతాల్లో తలదాచుకొంటున్నారు. 28 మంది ఆచూకీ లేకుండా పోయారు. రాష్ట్రంలో హింసను నియంత్రించడంలో, శాంతి పరిస్థితులను నెలకొల్పడంలో కేంద్రం, రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాలు విఫలమయ్యాయనే విమర్శలు ఉన్నాయి.

దేశ బోర్డర్‌లా జిల్లాల సరిహద్దులు

మైతీలకు ఎస్టీ హోదా ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ పర్వత ప్రాంత జిల్లాల్లో 2023, మే 3న కుకీలు చేపట్టిన 'ట్రైబల్ సంఘీభావ ర్యాలీ' హింసకు దారితీసిన విషయం తెలిసిందే. లోయ జిల్లాల్లో మైతీలు, పర్వత ప్రాంతాల్లో కుకీలు అధికంగా ఉంటారు. అయితే ఏడాది క్రితం వరకు ఈ కమ్యూనిటీల మధ్య స్పష్టమైన శత్రుత్వం, విభజన లేదు. అలాంటిది ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా భద్రతా బలగాల పహారా, చెక్ పాయింట్లు, బారికేడ్లు వంటివి దర్శనమిస్తున్నాయి. రెండు జిల్లాల సరిహద్దును దాటాలంటే దేశ సరిహద్దునే దాటే విధంగా తనిఖీలు ఉంటున్నాయి. బిష్ణుపూర్, కుకీలు అధికంగా ఉండే చురాచంద్‌పూర్ జిల్లాలు, అదేవిధంగా మైతీలు అధికంగా ఉండే ఇంఫాల్ వెస్టు, కుకీల ఏరియా అయిన కాంగ్‌పోక్పి జిల్లాల మధ్య సరిహద్దుల్లో చెక్ పాయింట్లు ఉన్నాయి. చాలా మంది 'విలేజ్ వలంటీర్లు'గా సాయుధులుగా మారి, తమ గ్రామాలకు రక్షణగా ఉంటున్నారు. మైతీలు, కుకీ మధ్య రేగిన ఘర్షణ పౌర సమాజాన్నే కాదు.. పోలీసులు, ప్రభుత్వ అధికారులను కూడా రెండుగా విభజించింది. గత ఏడాది నుంచి కొనసాగుతున్న ఘర్షణల్లో 16 మంది కేంద్ర భద్రతా సిబ్బంది, రాష్ట్ర పోలీసులు విధి నిర్వహణలో మరణించారు.

ఏడాది హింసాకాండ ఫలితమిది..

- మరణించిన వారి సంఖ్య 226 (మహిళలు-20, చిన్నారులు-8)
- 1,500 గాయపడిన వారి సంఖ్య
- 60,000 ఇతర ప్రాంతాకు వెళ్లిపోయినవారు
- 13,247 ధ్వంసమైన ఇండ్లు, ఇతర నిర్మాణాలు
- 26 ఆచూకీ లేని వారి సంఖ్య

20 తర్వాతే సీబీఎస్‌ఈ 10, 12 తరగతుల ఫలితాలు

న్యూఢిల్లీ, మే 3: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) నిర్వహించిన 10, 12 తరగతి బోర్డు పరీక్షల ఫలితాలు మే 20 తర్వాత విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. ఫలితాల తేదీలపై వదంతులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో, దీనిపై స్పష్టత ఇచ్చేందుకే ఈ ప్రకటన చేసినట్టు చెప్పారు. కాగా, ఈ రెండు తరగతుల పరీక్షలు ఈ ఏడాది ఫిబ్రవరి-ఏప్రిల్ మధ్య జరిగిన విషయం తెలిసిందే.

ఉల్లిగడ్డలపై 40 శాతం ఎగుమతి పన్ను

న్యూఢిల్లీ, మే 3: ఉల్లిగడ్డల ఎగుమతిపై 40 శాతం పన్ను విధిస్తూ కేంద్రం శుక్రవారం నిర్ణయం తీసుకుంది. అలాగే దేశీయ శనగలపై 2025 మార్చి 31 వరకు దిగుమతి పన్నును మినహాయిస్తున్నట్టు పేర్కొంది. పచ్చ బఠాణీలపై అమలవుతున్న పన్ను మినహాయింపు ఈ ఏడాది అక్టోబర్ 31 వరకు కొనసాగుతుందని కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్‌లో తెలిపింది. ఇవి ఈ నెల 4 నుంచి అమలులోకి వస్తాయని తెలిపింది. దేశీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటివరకు ఉల్లి ఎగుమతులపై ప్రభుత్వం నిషేధం కొనసాగించింది. అయితే బంగ్లా, యూఏఈ లాంటి కొన్ని మిత్రదేశాలకు మాత్రం పరిమిత పరిమాణంలో సరుకును ఎగుమతి చేస్తున్నది.

చైనా చాంగే-6 ప్రయోగం విజయవంతం

బీజింగ్, మే 3: చంద్రుడి ఉపరితలం నుంచి శిలలు, మట్టి నమూనాలు సేకరించేందుకు చైనా ప్రయోగించిన చాంగే-6 మిషన్ విజయవంతమైంది. ఈ మేరకు శుక్రవారం చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ ప్రకటన విడుదల చేసింది. వెన్‌ఛెంగ్ శాటిలైట్ లాంచింగ్ సెంటర్ నుంచి లాంగ్ మార్చ్-5 రాకెట్ ద్వారా దీన్ని విజయవంతంగా ప్రయోగించినట్టు వెల్లడించింది. భూమికి ఆవల దిక్కున ఉన్న చంద్రుడి ఉపరితలం (చంద్రుడి దక్షిణ ధ్రువం)పై చాంగే-6 ల్యాండ్ అయ్యి, అక్కడ 2 మీటర్ల లోతు నుంచి 2 కిలోల నమూనాలను సేకరించి, తిరిగి భూమిపైకి రానున్నది.

ఏఐ నియంత్రిత యుద్ధ విమానాన్ని పరీక్షించిన అమెరికా

కాలిఫోర్నియా: కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత ఎఫ్-16 యుద్ధ విమానాన్ని అమెరికా తన ఎడ్వర్డ్స్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో పరీక్షించింది. ఈ యుద్ధ విమానాన్ని మానవ పైలట్ కాకుండా ఏఐ నియంత్రిస్తుంది. తాజాగా చేపట్టిన ఈ ప్రయోగంలో యుద్ధ విమానంలో అమెరికా ఎయిర్‌ఫోర్స్ కార్యదర్శి ఫ్రాంక్ కెండాల్ ప్రయాణించారు. ఎయిర్‌ఫోర్స్ శక్తిని మరింత బలోపేతం చేయాలని అమెరికా ప్రణాళికలు రచిస్తున్నది. 2028 నాటికి వెయ్యికి పైగా మానవ రహిత యుద్ధ విమానాల్లో ఏఐ టెక్నాలజీని ప్రవేశపెట్టే యోచనలో ఉన్నది.

రోడ్లే గుంతలు పూడ్చుకుంటయ్!

కొత్త టెక్నాలజీని పరిశీలిస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ

న్యూఢిల్లీ, మే 3: రోడ్లపై తరచూ ఏర్పడే గుంతలు, పగుళ్ల సమస్యలకు పరిష్కారంగా కొత్త సాంకేతికతను వినియోగించే అవకాశాలను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) పరిశీలిస్తున్నది. ఈ సాంకేతికత ఉపయోగించి రోడ్లు వేస్తే.. రోడ్లకు పగుళ్లు, గుంతలు వచ్చినప్పుడు వాటికవే మరమ్మతు అవుతాయి. ఇందుకోసం స్టీల్ ఫైబర్, బిటుమెన్‌తో తయారుచేసిన కొత్త రకమైన తారును వినియోగించనున్నారు. ఈ తారుతో వేసిన రోడ్లకు పగుళ్లు వచ్చినా, చిన్న చిన్న గుంతలు ఏర్పడినా వాటిల్లోకి తారు విస్తరించి పూడ్చేస్తుంది. రోడ్డు ప్రమాదాలకు ఎక్కువగా కారణమవుతున్న రోడ్లపై గుంతల సమస్యకు పరిష్కారంగా ఈ కొత్త సాంకేతికతపై దృష్టి సారించినట్టు ఎన్‌హెచ్‌ఏఐకు చెందిన ఒక సీనియర్ అధికారి వెల్లడించారు. అయితే, ప్రస్తుతం ఇది పరిశీలన దశలోనే ఉంది. ఆర్థికంగా దీని వినియోగ సాధ్యాసాధ్యాలపై ఎన్‌హెచ్‌ఏఐ అధ్యయనం చేయనున్నది.



నిజ్జర్ హత్య కేసులో ముగ్గురు భారతీయుల అరెస్ట్

ఒట్టావ, మే 3: ఖలిస్థాన్ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో ముగ్గురు భారత పౌరులను కెనడా పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిజ్జర్ హత్య కోసం భారత్ ఏర్పాటుచేసినట్టుగా చెబుతున్న హిట్‌స్క్వాడ్‌లో వీరు సభ్యులని అక్కడి మీడియా నివేదికలు వెల్లడించాయి. గత ఏడాది జూన్ 18న సాయంత్రం సర్రేలోని సిక్కు గురుద్వార్‌లో ప్రార్థనలు చేసి వస్తున్న నిజ్జర్‌ను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉందని, భారత్ ఏజెంట్లే అతడిని హతమార్చారంటూ గత ఏడాది కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించిన క్రమంలో రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కెనడా ఆరోపణలు అర్థం లేనివి, ప్రేరేపితమైనవని భారత్ ఖండించింది. దీనిపై దర్యాప్తు చేస్తున్న రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు నిజ్జర్ హత్యకు కుట్ర పన్నిన హిట్ స్క్వాడ్ సభ్యులను గుర్తించి కొందరిని శుక్రవారం అరెస్ట్ చేసినట్టు కెనడా బీబీసీ ప్రకటించింది. నిందితులను కొన్ని నెలల క్రితమే గుర్తించినా వారి కదలికలపై నిఘా ఉంచి పూర్తి ఆధారాలు సేకరించినట్టు తెలిపింది.

ఏసీ పేలుడు.. ఆరుగురికి గాయాలు

బెంగళూరు: ఏసీ పేలడంతో ఆరుగురు గాయపడ్డారు. కర్ణాటకలోని బళ్లారిలో కల్యాణ్ జ్యువెలర్స్ షోరూంలో గురువారం ఈ ఘటన జరిగింది. ఏసీ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి షోరూం అంతా పొగ వ్యాపించింది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. వీరు ప్రస్తుతం దవాఖానలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సెంట్రల్ ఏసీలో గ్యాస్ నింపుతుండగా ఈ ఘటన జరిగినట్టు ప్రాథమికంగా గుర్తించారు. గాయపడ్డ వారిలో ఐదుగురు ఏసీ టెక్నీషియన్లు.

పసరు వైద్యం చేసుకున్న కోతి!

- ఆకు పసరుతో గాయానికి స్వీయ చికిత్స
- ఇండోనేషియాలో గుర్తించిన పరిశోధకులు



గాయపడినప్పుడు.. మానిన తర్వాత

న్యూఢిల్లీ: మనుషులే కాదు అడవుల్లో జీవించే జంతువులు కూడా మొక్కలు, మూలికలతో వాటికవే వైద్యం చేసుకుంటాయట. మొదటిసారిగా ఈ విషయాన్ని ఇండోనేషియాలో పరిశోధకులు రికార్డు చేశారు. సుమత్రన్ ఒరాంగుటాన్స్ అనే జాతికి చెందిన ఒక మగ కోతి ఈ విధంగా వైద్యం చేసుకుంటున్న విషయాన్ని పరిశోధకులు గుర్తించారు. ఇండోనేషియాలోని నేషనల్ యూనివర్సిటీ, జర్మనీలోని మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బిహేవియర్ సంస్థలకు చెందిన పరిశోధకులు కొన్ని రోజులుగా ఈ తోక లేని కోతులపై అధ్యయనం చేస్తున్నారు.

ఔషధ గుణాలను గుర్తించిన కోతి

ఒక మగ కోతికి మరో కోతితో జరిగిన కొట్లాటలో ముఖానికి గాయమైంది. దీంతో అది ఫైబ్రూరియా టింక్చర్ అనే మొక్కల ఆకులతో స్వీయవైద్యం చేసుకున్నది. ముందుగా ఈ ఆకులు నమిలి, వాటి పసరును గాయంపై రాసుకుంది. తర్వాత నమిలిన ఆకులను గాయంపై పెట్టుకుంది. అంతేకాదు, గాయం మానేందుకు ఈ కోతి సాధారణం కంటే ఎక్కువ సేపు పడుకుందని పరిశోధకులు తెలిపారు. కాగా, ఈ మొక్కలో నిజంగానే ఔషధ గుణాలు ఉంటాయని, మలేరియా, విరేచనాలు, డయాబెటిస్ చికిత్సలో ఈ మొక్కలు వాడుతారని పేర్కొన్నారు.

ఇరాన్, ఇజ్రాయెల్ వెళ్లేవారు జాగ్రత్త!

పౌరులకు భారత్ సూచన

న్యూఢిల్లీ, మే 3: ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో భారత్ తమ పౌరులకు కీలక సూచనలు చేసింది. ఆ రెండు దేశాలకు ప్రయాణాలు చేసే వాళ్లు అప్రమత్తంగా ఉండాలని, భారత ఎంబసీతో టచ్‌లో ఉండాలని పేర్కొన్నది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ పశ్చిమాసియాలో పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామన్నారు. కాగా, కమర్షియల్ విమానాల రాకపోకల కోసం ఇరాన్, ఇజ్రాయెల్ దేశాలు ఇటీవల తమ గగనతలాలను తిరిగి ప్రారంభించాయి. అయితే ఉద్రిక్తతలు కొనసాగితే, గగనతలం తెరిచే ఉంటుందని కచ్చితంగా చెప్పలేమని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.

చిత్రం

సెప్టెంబర్‌లో అడ్వెంచర్ ఆరంభం?

రాజమౌళి దర్శకత్వంలో మహేష్‌బాబు కథానాయకుడిగా ఆఫ్రికన్ జంగిల్ అడ్వెంచర్ నేపథ్యంలో పాన్ వరల్డ్ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రాజమౌళి రూపొందిస్తున్న చిత్రమిదే కావడంతో దేశవ్యాప్తంగా అభిమానులు ఈ సినిమా అనౌన్స్‌మెంట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మహేష్‌బాబు నటిస్తున్న 29వ చిత్రమిది. ఈ సినిమా కోసం మహేష్‌బాబు వర్క్‌షాప్స్‌లో పాలుపంచుకుంటూ తన పాత్రకోసం సన్నద్ధమవుతున్నారు. 'ది ఇండియానా జోన్స్' తరహాలో సాగే అడ్వెంచరస్ థ్రిల్లర్ కథాంశమిదని సమాచారం. ఈ నెలాఖరులో ఈ సినిమాను అధికారికంగా ప్రకటించి, జూన్ లేదా జూలైలో షూటింగ్ మొదలుపెడతారని వార్తలొస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లడం కాస్త ఆలస్యం కానుందని తెలుస్తోంది. తొలుత లాంఛనంగా ప్రారంభోత్సవం జరిపి..సెప్టెంబర్‌లో రెగ్యులర్ షూట్‌ను మొదలుపెట్టనున్నారని సమాచారం. కె.ఎల్.నారాయణ ఈ చిత్రానికి నిర్మాత.



తుది దశలో 'గేమ్ ఛేంజర్'

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'గేమ్ ఛేంజర్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. కియారా అద్వాణీ కథానాయిక. ఈ చిత్రాన్ని సెప్టెంబర్‌లో విడుదల చేయబోతున్నారు. 'ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత రామ్‌చరణ్ నటిస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. ఈ సినిమా షూటింగ్ తుదిదశకు చేరుకుంది. ప్రస్తుతం చెన్నైలో కొన్ని కీలక ఘట్టాలను తెరకెక్కిస్తున్నారని తెలిసింది. ఇందులో రామ్‌చరణ్‌తో పాటు చిత్ర ప్రధాన తారాగణం పాల్గొంటున్నారని సమాచారం. సమకాలీన రాజకీయాంశాలను చర్చిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారు. కియారా అద్వాణీ, అంజలి, సముద్రఖని, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్, సునీల్, నవీన్‌చంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎస్.తిరుణావుక్కరసు, సంగీతం: తమన్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, నిర్మాతలు: దిల్‌రాజు-శిరీష్, దర్శకత్వం: శంకర్.



చెబితే వినదు.. స్టుపిడ్ హార్ట్

ఓ ఆత్మ సాగించే ప్రేమకథతో తెరకెక్కిస్తున్న రొమాంటిక్ హారర్ థ్రిల్లర్ 'లవ్‌మీ'. 'ఇఫ్ యు డేర్' ఉపశీర్షిక. ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి అరుణ్ భీమవరపు దర్శకత్వం వహిస్తున్నారు. దిల్ రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మిస్తున్నారు. ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం ఈ సినిమా నుంచి 'స్టుపిడ్ హార్ట్..' అనే మెలోడీ గీతాన్ని విడుదల చేశారు. ఎం.ఎం. కీరవాణి స్వరపరచిన ఈ పాటను చంద్రబోస్ రచించారు. మనసుకు నచ్చిన అబ్బాయి కనపడగానే ఓ అమ్మాయి హృదయంలో కలిగే మధుర భావాలను ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. తెలుగు తెరపై ఇప్పటి వరకు రానటువంటి వినూత్నమైన పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కించామని, హారర్‌తో పాటు హృదయాన్ని కదిలించే భావోద్వేగాలుంటాయని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: పీసీ శ్రీరామ్, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ఆర్ట్: అవినాష్ కొల్లా, దర్శకత్వం: అరుణ్ భీమవరపు.





ఏమయ్యిందో గుండెకు..

అగ్ర హీరో మహేష్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. ప్రశాంత్‌వర్మ కథనందించాడు. సోమినేని బాలకృష్ణ నిర్మాత. ఈ సినిమాలో 'ఏమయ్యిందే గుండెకు' అంటూ సాగే తొలి గీతాన్ని శుక్రవారం విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో సంగీతాన్నందించిన ఈ పాటను సురేష్ గంగుల రచించారు. ఈశ్వర్ ధాతు ఆలపించారు. అందమైన ప్రేమభావాలను వ్యక్తపరుస్తూ ఈ పాట సాగింది. నాయకానాయికల మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. విజువల్స్ ప్రధానాకర్షణగా నిలిచాయి. ఆధ్యాత్మిక అంశాల కలబోతగా సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇదని, యాక్షన్ అంశాలు కూడా ఉంటాయని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రసాద్ మూరెళ్ల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, దర్శకత్వం: ప్రశాంత్‌వర్మ.

మంచి దెయ్యం కథ

నందితాశ్వేత, వెన్నెల కిషోర్, షకలక శంకర్, నవమి గాయన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. శంకర్ మార్తాండ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల థీమ్ వీడియోను విడుదల చేశారు. 'హారర్, కామెడీ అంశాల కలబోతగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఓ హాంటెడ్ హౌస్‌లో జరిగే కథ ఇది. ఆద్యంతం నవ్విస్తూ భయపెడుతుంది. హారర్ కామెడీ జోనర్‌లో ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుంది. దెయ్యం పాత్రలో నందితాశ్వేత అభినయం మరో స్థాయిలో ఉంటుంది' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: ఐ.ఆండ్రూ, సంగీతం: అనూప్‌రూబెన్స్, నిర్మాత: డా|| అబినికా ఇనాబతుని, దర్శకుడు: శంకర్ మార్తాండ్.





అదే నిజమైన విలాసం!

గూఢచారి, మేజర్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది శోభిత ధూళిపాళ్ల. ఈ భామ నటించిన హాలీవుడ్ చిత్రం 'మంకీ మ్యాన్' ఇటీవలే విడుదలైంది. ఈ సినిమాలో ఆమె అభినయానికి మంచి ప్రశంసలు దక్కాయి. ఇదిలావుండగా తెలుగు ఇండస్ట్రీకి చెందిన ప్రముఖ హీరోతో ఈ భామ ప్రేమలో ఉందని ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా ఇంటర్వ్యూలో ప్రేమ గురించి తన అభిప్రాయాన్ని వెల్లడించింది. 'ప్రేమ అద్భుతమైన భావన. మన జీవితాన్ని నడిపించే ఇంధనం. ప్రతి ఒక్కరికి కావాల్సిన నిజమైన విలాసం ప్రేమనే' అంటూ సమాధానమిచ్చింది. ఈ మాటలతో ఆమె ప్రేమాయణం నిజమే అనుకుంటున్నారు. తన కెరీర్ గురించి ఈ భామ మాట్లాడుతూ 'తెరపై నేను పోషించిన పాత్రలను చూసి నిజజీవితంలో కూడా కఠినంగా ఉంటానని చాలా మంది అనుకుంటున్నారు. కానీ అందులో నిజం లేదు. స్వతహాగా నేను సున్నిత మనస్కురాలిని. ఎలాంటి ఆర్భాటాలు లేకుండా చాలా సింపుల్‌గా ఉంటాను. ప్రతి విషయంలో ఇతరులపై ఆధారపడతాను. చిన్న ఆనందాలకు కూడా పొంగిపోతాను' అని చెప్పుకొచ్చింది.

ఓటుకు రేటు పెడితే..


మహతి ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'లక్ష్మీ కటాక్షం'. సూర్య దర్శకుడు. సాయి కుమార్, వినయ్, అరుణ్, దీప్తివర్మ తదితరులు నటించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'రాజకీయ వ్యంగ్యాత్మక కథాంశమిది. నేటి ఎన్నికల రాజకీయాలపై సెటైరికల్‌గా ఉంటుంది. ఓటర్లే వారి ఓటుకు ఒక రేటు ఫిక్స్ చేసుకొని నాయకులను ముప్పుతిప్పలు పెడితే ఎలా ఉంటుందనే పాయింట్‌తో తెరకెక్కించాం. వినోదంతో పాటు అంతర్లీనంగా సందేశం ఉంటుంది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: నాని ఐనవెల్లి, సంగీతం: అభిషేక్, నిర్మాతలు: యు.శ్రీనివాసులు రెడ్డి, బి.నాగేశ్వర్ రెడ్డి, వహీద్ షేక్, కే.పురుషోత్తం రెడ్డి, రచన-దర్శకత్వం: సూర్య.





1980 నాటి రాజకీయాల నేపథ్యంలో..

రాకేష్ వర్రె హీరోగా విరించి వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. ముదుగంటి క్రియేషన్స్ పతాకంపై ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. '1980 దశకంలో ఓ వ్యక్తి జీవితంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. సమాజం పట్ల ఎంతో అంకితభావం కలిగిన ఆ యువకుడు కాలేజీ నాయకుడిగా, అనంతరం పోలీస్ ఆఫీసర్‌గా ఎదిగి వ్యవస్థను ఎలా ప్రక్షాళనం చేశాడనే అంశాలను చూపిస్తున్నాం. పొలిటికల్ థ్రిల్లర్‌గా ఆకట్టుకుంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: వి.ఎస్.జ్ఞానశేఖర్, సంగీతం: గోపి సుందర్.




అభ్యర్థులకు 48 గంటల్లోగా నో డ్యూ సర్టిఫికెట్

రాష్ట్రాలకు ఈసీ ఆదేశం

న్యూఢిల్లీ: ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు 'నో డ్యూ సర్టిఫికెట్ల'ను వారు దరఖాస్తు చేసినప్పటి నుంచి 48 గంటల్లోగా జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆదేశించింది. నామినేషన్ పత్రాలతోపాటు నో డ్యూ సర్టిఫికెట్‌ను సమర్పించకపోతే, అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించే అవకాశం ఉన్నందు వల్ల ఈ ఆదేశాలను జారీ చేసింది. నామినేషన్ల దాఖలుకు గడువు పూర్తయిన తర్వాత ఈ సర్టిఫికెట్‌ను సమర్పించినప్పటికీ ప్రయోజనం ఉండదని గుర్తు చేసింది. అభ్యర్థి పోటీ చేసే అవకాశాన్ని కోల్పోవడం వల్ల ఆ అభ్యర్థికి మాత్రమే కాకుండా, రాజకీయ పార్టీలకు, ఓటర్లకు కూడా నష్టం జరుగుతుందని తెలిపింది.





ఒక్కో నెత్తిపై లక్ష అప్పు

బీజేపీ హయాంలో అప్పుల కుప్పగా భారత్

- మోదీ సర్కారు రుణాలు రూ. 97 లక్షల కోట్లు
- మొత్తంగా దేశం అప్పులు రూ. 155 లక్షల కోట్లు
- నెలకు చెల్లించే మిత్తి దాదాపు 90 వేల కోట్లు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని బీజేపీ సర్కారు వల్ల భారత్ అప్పుల కుప్పగా మారింది. కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. మార్చి 31, 2023 వరకూ కేంద్రం రూ.155.6 లక్షల కోట్ల అప్పులు చేసింది. ఇందులో 30 శాతం వరకూ దీర్ఘకాలిక రుణాలు ఉన్నాయి. 2014కు ముందు కేంద్రం చేసిన అప్పు రూ.58.6 లక్షల కోట్లు కాగా, మోదీ ప్రధాని అయిన తర్వాత తొమ్మిదేండ్లలో చేసిన అప్పు రూ.97 లక్షల కోట్లకు పైగా ఉన్నది. అప్పటి ప్రధానులు ఏడాదికి సగటున రూ.84 వేల కోట్ల అప్పులు చేస్తే, మోదీ ఏకంగా నెలకే దాదాపు రూ.93 వేల కోట్ల అప్పులు చేశారు. అసమర్థ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన బీజేపీ ప్రభుత్వం.. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒకవైపు ఎడాపెడా అప్పులు చేయడమే కాదు.. పేద, మధ్యతరగతి వర్గాలకు ఇస్తున్న సబ్సిడీలు తగ్గించింది. అంతటితో ఆగకుండా వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలపై వాత పెడుతున్నది. దీంతో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.


	మార్చి 31, 2014	మార్చి 31, 2023
దేశ జనాభా	130 కోట్లు	140 కోట్లు
కేంద్రం అప్పు	రూ. 58.6 లక్షల కోట్లు	రూ. 155.6 లక్షల కోట్లు
ఒక్కో నెత్తిపై అప్పు	రూ. 45 వేలు	రూ. 1.2 లక్షలు
జీడీపీలో అప్పు వాటా	52 శాతం	57.5 శాతం
విదేశీ రుణం	3.74 లక్షల కోట్లు	7.48 లక్షల కోట్లు

నెల మిత్తి రూ. 90 వేల కోట్లు

చేసిన అప్పులకు గానూ కేంద్రం పెద్దయెత్తున వడ్డీలు చెల్లిస్తున్నది. 2014-15లో తీసుకొన్న రుణాలకు రూ.4.02 లక్షల కోట్లను వడ్డీగా చెల్లించగా, 2021-22లో రూ.8.14 లక్షల కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరం రూ.9.4 లక్షల కోట్లను చెల్లించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం రూ.10.8 లక్షల కోట్లను వడ్డీగా చెల్లించనున్నట్టు సమాచారం. ఈ లెక్కన ప్రతినెల రూ.90 వేల కోట్ల చొప్పున కేంద్రం వడ్డీల రూపంలో చెల్లిస్తున్నది.


పదేండ్ల బీజేపీ హయాంలో పెరుగుదల..

జనాభా	7.69%
రుణం	166%
ఒక్కో నెత్తిపై అప్పు	144%
విదేశీ అప్పు	100%
జీడీపీలో అప్పు వాటా	9.8%



మోదీ సర్కారు అప్పు ఇలా..

సెకనుకు	3.4 లక్షలు
నిమిషానికి	2.07 కోట్లు
గంటకు	124.7 కోట్లు
రోజుకు	2,993 కోట్లు
నెలకు	89,814 కోట్లు
సంవత్సరానికి	10.7 లక్షల కోట్లు
9 ఏండ్ల పాలనలో	97 లక్షల కోట్లు



'కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌ను పరిశీలిస్తాం'

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ అంశాన్ని పరిశీలిస్తామని ఈడీకి సుప్రీం కోర్టు తెలిపింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తన అరెస్టు, ఈడీ కస్టడీని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం కోర్టు విచారించింది. కేజ్రీవాల్ పిటిషన్‌పై విచారణకు సమయం పట్టే అవకాశం ఉంటే, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొన్నది. అయితే, ఈ విషయమై తాము తుది నిర్ణయం తీసుకోలేదని, కేవలం సమాచారం మాత్రం ఇస్తున్నామని ఈడీ తరపు న్యాయవాదికి తెలిపింది. తదుపరి విచారణను మే 7కు వాయిదా వేసింది. ఇదే అంశానికి సంబంధించి మంగళవారం జరిగిన విచారణలో.. ఎన్నికల వేళ కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందని ఈడీని కోర్టు ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

బేటీ బచావో ఇదేనా?

- ప్రచారానికే పరిమితమైన బీజేపీ నినాదం
- లైంగికదాడి నిందితులకు పార్టీ అండదండలు
- ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్‌పై ముందే తెలిసినా జేడీఎస్‌తో పొత్తు
- బ్రిజ్‌భూషణ్ కుమారుడికి లోక్‌సభ టికెట్
- బిల్కిస్ రేపిస్టుల విడుదల, సన్మానాలు
- కథువా, హత్రాస్ నిందితులకు మద్దతు
- మణిపూర్ మహిళలపై దారుణాలపై మౌనం

న్యూఢిల్లీ, మే 3: 'బేటీ బచావో.. బేటీ పఢావో'.. కేంద్రంలోని మోదీ సర్కారు ఇచ్చిన నినాదమిది. అయితే స్వయంగా బీజేపీనే ఈ నినాదానికి నిలువునా తూట్లు పొడుస్తున్నది. లైంగికదాడి నిందితులకు ఆ పార్టీ అండగా నిలుస్తున్నది. ఇటీవల పరిణామాలు దీన్ని రుజువు చేస్తున్నాయి. జేడీఎస్ నేత ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్ గురించి కమలం పార్టీకి ముందే తెలిసినా, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్నది. రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్ కుమారుడికి లోక్‌సభ టికెట్ ఇచ్చింది.

ప్రజ్వల్ వ్యవహారం ముందే తెలిసినా..

లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజ్వల్.. జేడీఎస్ పార్టీకి చెందిన వ్యక్తి అయినప్పటికీ, ఆయన బీజేపీ కూటమిలో భాగంగా హసన్ ఎంపీగా పోటీచేశారు. ప్రజ్వల్ సెక్స్ స్కాండల్ వ్యవహారం బీజేపీకి ముందే తెలుసునని, ఆ పార్టీకి చెందిన నేత ఒకరు గత ఏడాది డిసెంబర్‌లోనే హెచ్చరించినప్పటికీ అధిష్ఠానం పట్టించుకోలేదనే ప్రచారం జరుగుతున్నది. మరోవైపు లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ గత నెల 14న మైసూర్‌లో జరిగిన ర్యాలీలో ప్రజ్వల్ రేవణ్ణతో వేదిక పంచుకొన్నారు.

బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై చర్యలేవి?

డబ్ల్యూఎఫ్‌ఐ అధ్యక్షుడిగా ఉన్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు దేశవ్యాప్తంగా పెద్ద సంచలనమే రేపాయి. దీనిపై పలువురు ప్రముఖ రెజ్లర్లు ఢిల్లీలో ఆందోళన కార్యక్రమాలు కూడా చేపట్టారు. అయినా బ్రిజ్‌భూషణ్‌పై బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఉత్తరప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ లోక్‌సభ సీటు అభ్యర్థిత్వాన్ని ఇన్ని రోజులుగా నాన్చిన బీజేపీ.. ఇప్పుడు ఆ స్థానాన్ని బ్రిజ్‌భూషణ్ కుమారుడు కరణ్ భూషణ్ సింగ్‌కు కేటాయిస్తూ గురువారం ప్రకటించింది.

రేపిస్టును కలిసిన బీజేపీ ఎంపీ

యూపీలోని ఉన్నావోలో 17 ఏండ్ల బాలికపై సామూహిక లైంగిక దాడి కేసులో బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్ 2018లో అరెస్టు అయ్యాడు. 2019లో ట్రయల్ కోర్టు అతనికి జీవిత ఖైదు విధించింది. అయితే అంతకుముందు ఆరోపణలు ఎదుర్కొంటున్న సమయంలో ఎమ్మెల్యే సెంగార్‌పై బీజేపీ చర్యలు తీసుకోకపోవడంపై పెద్దయెత్తున విమర్శలు వచ్చాయి. మరోవైపు 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత జైల్లో ఉన్న సెంగార్‌ను బీజేపీ ఎంపీ సాక్షి మహరాజ్ కలిశారు.

నిందితుడికి మద్దతుగా ఆందోళనలు

జమ్ముకశ్మీర్‌లోని కథువాలో 8 ఏండ్ల బాలికపై జరిగిన లైంగిక దాడి హత్య కేసులో నిందితుడైన పోలీసు అధికారి దీపక్ ఖజూరియాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 2018లో బీజేపీ నేతలు ఆందోళన చేపట్టారు. అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ శర్మ కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా హత్రాస్ ఘటన

యూపీలోని హత్రాస్‌లో 19 ఏండ్ల దళిత యువతి అగ్రవర్ణానికి చెందిన వ్యక్తుల చేతుల్లో సామూహిక లైంగిక దాడి, హత్యకు గురైంది. అయితే ఈ ఘటనలో బాధిత యువతి మృతదేహాన్ని రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా, బాధిత కుటుంబసభ్యులు లేకుండానే రాత్రికి రాత్రే దహనం చేయించింది.

బీజేపీ నేత రిసార్టులో యువతి హత్య

2022, సెప్టెంబర్‌లో ఉత్తరాఖండ్‌లో అంకిత్ భండారి అనే 19 ఏండ్ల యువతిని బీజేపీ నేత వినయ్ ఆర్య కుమారుడు పుల్కిత్ ఆర్య ఓ రిసార్టులో హత్య చేసినట్టు వచ్చిన ఆరోపణలు సంచలనంగా మారాయి. అయితే ఈ కేసులో పోలీసుల దర్యాప్తు తీరుపై మహిళా హక్కుల సంఘాలు ప్రశ్నలు లేవనెత్తాయి.



ఏడీఆర్ నివేదిక ప్రకారం..

మహిళపై నేరాల కేసుల్లో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు- 44

ఎన్సీఆర్బీ గణాంకాల ప్రకారం..

దేశవ్యాప్తంగా మహిళలపై నేరాలు

2014- 3,37,922

2022- 445,256

పెరుగుదల- 31 శాతం

బిల్కిస్ బానో రేపిస్టుల విడుదల

2022లో గుజరాత్ ప్రభుత్వం బిల్కిస్ బానో రేపిస్టులను విడుదల చేసింది. ఈ కేసులో దోషులుగా నిర్ధారణ అయిన 11 మందిని కేంద్ర హోంశాఖ అనుమతి తీసుకొనే రెమిషన్‌పై విడుదల చేసినట్టు రాష్ట్ర సర్కార్ 2022, అక్టోబర్‌లో సుప్రీం కోర్టుకు తెలిపింది. అయితే గుజరాత్ ప్రభుత్వ ఉత్వర్వులను సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరిలో కొట్టివేసింది.

మణిపూర్ ఘటనలపై నిర్లక్ష్యం

మణిపూర్‌లో మహిళల నగ్న ఊరేగింపు, లైంగిక దాడి ఘటన జరిగి ఏడాది అయింది. ఈ ఘటనలో బాధితులు తమను కాపాడాలని పోలీసుల వద్దకు వెళ్తే.. వాళ్లే మహిళలను మూకకు అప్పగించారని సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొన్నది. అయితే గత ఏడాది మే 3న మణిపూర్‌లో హింసాకాండ ప్రారంభం కాగా.. దేశ ప్రధానిగా ఉన్న మోదీ 78 రోజుల తర్వాతకు గానీ నోరు విప్పలేదు. ఇప్పటికీ ఆయన రాష్ట్రంలో పర్యటించలేదు.

సకాలంలో పోలింగ్ శాతాలు ప్రకటిస్తాం

విపక్షాల విమర్శలపై ఈసీ స్పందన

న్యూఢిల్లీ, మే 3: లోక్‌సభ ఎన్నికల తుది పోలింగ్ శాతాలను వెల్లడించడంలో జరుగుతున్న జాప్యంపై విపక్షాలు చేస్తున్న విమర్శలకు కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. రానున్న ప్రతి దశ తర్వాత ఓటింగ్ శాతాల గణాంకాలను సకాలంలో వెల్లడించేందుకు కట్టుబడి ఉన్నామని శుక్రవారం పేర్కొన్నది. ఓటింగ్ ముగిసిన వెంటనే పోలింగ్ కేంద్రాల వారీగా 'పోలైన వాస్తవ ఓట్ల సంఖ్య'కు సంబంధించిన డాటా అభ్యర్థుల వద్ద అందుబాటులో ఉంటుందని తెలిపింది. అయితే తొలి దశ ఎన్నికలు జరిగిన 11 రోజులకు పోలింగ్ శాతాన్ని ప్రకటించడానికి గల కారణంపై ఈసీ స్పష్టత ఇవ్వలేదు. లోక్‌సభ తొలి దశ ఏప్రిల్ 19, రెండో దశ ఏప్రిల్ 26 జరుగ్గా.. ఆ రెండు దశలకు సంబంధించి తుది ఓటింగ్ శాతాలను ఈసీ 30న విడుదల చేసింది. అయితే ఎన్నికలు జరిగిన ఆయా రోజుల్లో ప్రకటించిన ఓటింగ్ శాతాలకు, ఇన్ని రోజుల ఆలస్యంగా విడుదల చేసిన తుది ఓటింగ్ శాతాలకు భారీ తేడా ఉండటంపై ప్రతిపక్ష పార్టీలు అనుమానాలు వ్యక్తం చేశాయి.

'పేర్లు కలిశాయని పోటీ వద్దంటే ఎలా?'

న్యూఢిల్లీ: ఒకే పేరున్న వ్యక్తులు ఎన్నికల్లో పరస్పరం పోటీచేయకుండా నిరోధించాలన్న పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇతర రాజకీయ నాయకుల పేర్లతో ఉన్న వ్యక్తులు స్వతంత్రంగా ఎన్నికల్లో పోటీచేయకుండా నియంత్రించలేమని స్పష్టం చేసింది. ఎవరైనా రాహుల్ గాంధీ అనో లేక లాలూ ప్రసాద్ యాదవ్ అనో పేర్లు పెట్టుకుంటే ఎన్నికల్లో పోటీచేయకుండా వారిని ఎలా ఆపగలం? అది వారి హక్కులను కాలరాయడం కాదా?' అని ప్రశ్నించింది.

ప్రజ్వల్, రేవణ్ణలపై రేప్ కేసు

- తన తల్లిని లైంగికంగా వేధించారని మైసూరు యువకుడి ఫిర్యాదు
- ప్రజ్వల్ మూడేండ్లుగా లైంగిక దాడి చేస్తున్నాడన్న మరో మహిళ



రేవణ్ణ



ప్రజ్వల్

మైసూరు, మే 3: జేడీ(ఎస్) ఎమ్మెల్యే రేవణ్ణ, ఆయన కొడుకు ప్రజ్వల్‌పై మైసూరు పోలీసులు గురువారం రాత్రి కిడ్నాప్, లైంగిక దాడి కేసు నమోదు చేశారు. తన తల్లిని వారు అపహరించారని రాజు అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర కథనం ప్రకారం.. ఫిర్యాదుదారుడి తల్లి ఆరేండ్ల క్రితం రేవణ్ణ ఇంట్లో పనిచేశారు. మూడేండ్ల క్రితం ఆమె పని మానేసి సొంతూరికి తిరిగి వచ్చారు. అయితే 5 రోజుల క్రితం రేవణ్ణ అనుచరుడైన సతీశ్ బాబన్న రాజు ఇంటికి వచ్చి పోలీసులు వచ్చి విచారణ చేస్తారని.. వారికి ఎలాంటి వివరాలు చెప్పకూడదని.. చెప్తే నువ్వు జైలుకు కూడా వెళ్లాల్సి వస్తుందని రాజును బెదిరించాడు. ఆ తర్వాత రాజు తల్లిని బైక్‌పై గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకెళ్లాడు. ఇటీవల వైరల్ అయిన సెక్స్ స్కాండల్ వీడియోలో రాజు తల్లిపై ప్రజ్వల్ లైంగిక దాడి చేసిన దృశ్యాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తన తల్లి ప్రాణాలకు హాని ఉందని..ఆమెపై లైంగిక దాడి చేశారని రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తుపాకీతో బెదిరించి లైంగిక దాడి

హసన్ ఎంపీ రేవణ్ణ మూడేండ్లుగా తనపై లైంగిక దాడి చేస్తున్నాడని హసన్ జిల్లా పంచాయత్ మాజీ సభ్యురాలు (44)ఒకరు బుధవారం సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను జెడ్పీ సభ్యురాలిగా ఉన్న సమయంలో 2021లో ఒకసారి ప్రజ్వల్ ఇంటికి ఒక పని మీద వెళ్లినప్పుడు తనపై లైంగిక దాడి చేశాడని ఆమె తెలిపారు. 'సందర్శకులంతా వెళ్లిపోయాక ప్రజ్వల్ నన్ను ఓ గదిలోకి లాక్కెళ్లి డోర్ లాక్ చేశాడు. నా భర్త రాజకీయంగా ఎదగాలంటే నేను ఆయన(ప్రజ్వల్) చెప్పినట్టు వినాలని అన్నాడు. ఆ తర్వాత నాపై లైంగిక దాడికి యత్నించాడు. నేను ప్రతిఘటిస్తే తుపాకీతో కాల్చేస్తానని బెదిరించి నాపై లైంగిక దాడి చేశాడు. ఆ ఘటనను ప్రజ్వల్ తన ఫోనులో వీడియో తీసుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఆ వీడియో లీక్ చేస్తానని బెదిరించాడు. ఇలా బెదిరిస్తూ నాపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తరచూ ఫోన్ చేసి నగ్నంగా తనతో మాట్లాడాలని ఒత్తిడి చేసేవాడు' అని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు.

గాంధీజీ ఓ జిత్తులమారి కాబోయే మహాత్ముడు రాహుల్

కాంగ్రెస్ నేత వివాదాస్పద వ్యాఖ్య

రాజ్‌కోట్, మే 3: జాతిపిత మహాత్మా గాంధీపై గుజరాత్ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ఇంద్రాణి రాజ్‌గురు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గాంధీని జిత్తులమారిగా అభివర్ణించిన ఆయన గాంధీ కంటే రాహుల్ గాంధీ ఎంతో మెరుగని, ఆయన స్వచ్ఛమైన మనసుతో ఔదార్యంతో ఉంటారని అన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మహాత్మునిగా అవతరించడం ఖాయమని పేర్కొన్నారు. మహాత్మునిపై ఇలాంటి వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్‌ను ప్రజలు క్షమించబోరని గుజరాత్ బీజేపీ ఉపాధ్యక్షుడు భారత్ బొగ్హరా విమర్శించారు.

పాండియన్ సతీమణిపై బదిలీ వేటు

భువనేశ్వర్: బీజేడీ నేత వీకే పాండియన్ సతీమణి సుజాత ఆర్ కార్తికేయన్‌పై ఎన్నికల కమిషన్ (ఈసీ) బదిలీ వేటు వేసింది. మిషన్ శక్తి డిపార్ట్‌మెంట్‌లో కమిషనర్ కమ్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమెను.. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ చేసింది. ప్రభుత్వ కార్యాలయాన్ని దుర్వినియోగం చేస్తున్నారని బీజేపీ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈసీ ఈ నిర్ణయం తీసుకున్నది. ప్రజలతో సంబంధం లేని శాఖకు ఆమెను బదిలీ చేసింది.

మోదీ, షా మౌనమేల?

బెంగాల్ గవర్నర్‌పై లైంగిక ఆరోపణలపై స్పందించరేం?

- సీఎం మమతా బెనర్జీ నిలదీత
- రాజ్‌భవన్‌లో పోలీసుల ప్రవేశంపై గవర్నర్ ఆనందబోస్ నిషేధం



కోల్‌కతా, మే 3: పశ్చిమబెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. తనపై గవర్నర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని రాజ్‌భవన్ మహిళా ఉద్యోగి ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయడం రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై సీఎం మమతా బెనర్జీ విరుచుకుపడ్డారు. పర్బా బర్ధమాన్‌లో శుక్రవారం జరిగిన ఎన్నికల సభలో ఆమె మాట్లాడుతూ 'గవర్నర్ లైంగిక దాడిపై రాజ్‌భవన్ మహిళా ఉద్యోగి కన్నీటి గాథ నా హృదయాన్ని ముక్కలు చేసింది. నేను ఆమె వీడియోను చూశా.. ఆమె బాధను అర్థం చేసుకున్నా. గురువారం రాత్రి రాజ్‌భవన్‌కు వచ్చిన ప్రధాని మోదీ దీనిపై ఎందుకు మౌనంగా ఉన్నారు' అని మమత ప్రశ్నించారు. తల్లులు, చెల్లెల గౌరవం గురించి ఉపన్యాసాలు దంచే మీరు దీనిపై స్పందించరా? అని ఆమె నిలదీశారు. 'రాజ్‌భవన్‌లో షాకింగ్ విషయాలు తెలిశాయి. మరికొంత మంది మహిళలపై కూడా ఇలాగే వేధింపులకు పాల్పడ్డారు. 'నారీ కా సమ్మాన్' నినాదంలో చిత్తశుద్ధి ఉంటే ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు వెంటనే జోక్యం చేసుకుని బాధిత మహిళలకు న్యాయం చేయాలి' అని తృణమూల్ కాంగ్రెస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది.

పోలీసులకు నో ఎంట్రీ

రాజ్‌భవన్ ప్రాంగణంలోకి పోలీసులు, బెంగాల్ మంత్రి భట్టాచార్యకు ప్రవేశాన్ని నిషేధిస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ కేసులో గవర్నర్‌ను పోలీసులు ప్రశ్నిస్తారన్న అనుమానం, గవర్నర్‌పై ఆరోపణలు వచ్చిన వెంటనే మంత్రి భట్టాచార్య తొలిసారిగా స్పందించడం వల్ల ఈ నిషేధ ఉత్తర్వులు జారీ చేసినట్టు భావిస్తున్నారు. 'అసలు రాజ్‌భవన్‌లో ఏం జరుగుతున్నది? అది కూడా ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు వచ్చిన రోజు జరగడం ఏమిటి?' అని భట్టాచార్య నిలదీశారు.

ఇలాంటి ఆరోపణలు ఇంకా రావొచ్చు

ఇలాంటి ఆరోపణలు తనపై ఇంకా రావచ్చునని, 1943 నాటి బెంగాల్ కరువుకు, 1846 నాటి కలకత్తా హత్యలకు కూడా తనను నిందించవచ్చునని గవర్నర్ బోస్ శుక్రవారం పేర్కొన్నారు. ఇదొక అసంబద్ధ నాటకంగా వర్ణించిన ఆయన అవినీతిని, రాష్ట్రంలో జరుగుతున్న హింసపై తాను సాగిస్తున్న పోరాటాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు.

భాగ్ రాహుల్ భాగ్

మొదటిపేజీ తరువాయి...

మొదటిపేజీ తరువాయి...

అమేథీ అయితే మళ్లీ ఓడిపోతారనే రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తున్నారని బీజేపీ ఎద్దేవా చేస్తున్నది.

వయనాడ్‌నూ వదిలేసినట్టే !



గత ఎన్నికల్లో రాహుల్ గాంధీని అమేథీలో ప్రజలు ఓడించినా కేరళలోని వయనాడ్ ప్రజలు మాత్రం అక్కున చేర్చుకొని 4.31 లక్షల భారీ మెజారిటీతో గెలిపించారు. ఈసారి వయనాడ్‌లో త్రిముఖ పోటీ నెలకొన్నది. రాహుల్ గాంధీకి సీపీఐ అభ్యర్థి అన్నీ రాజా, బీజేపీ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రన్ గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో వయనాడ్‌లో ఓటమి భయంతోనే రాయ్‌బరేలీ నుంచి కూడా రాహుల్ గాంధీ పోటీ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. రాజకీయ నేతలు రెండుచోట్ల పోటీ చేయడం పెద్ద తప్పేమీ కాదు కానీ ఈ విషయంలో రాహుల్ గాంధీ వ్యవహారశైలి విమర్శలకు తావిస్తున్నది. వయనాడ్‌లో ఏప్రిల్ 26న ఎన్నికలు పూర్తయ్యాయి. అక్కడ పోలింగ్ పూర్తయ్యే వరకు ఆయన రాయ్‌బరేలీలో పోటీ విషయాన్ని బయట పెట్టలేదు. రెండుచోట్ల పోటీ చేస్తున్నాననే విషయాన్ని ముందే వెల్లడించకుండా ఓట్లు అడగడం వయనాడ్ ప్రజలను మోసం చేయడమే అని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాయ్‌బరేలీలో పోటీ చేయాలనే ఆలోచన రాహుల్‌కు ముందే ఉందని, వయనాడ్‌లో పోలింగ్ అయిపోయే వరకు ఈ విషయాన్ని దాచిపెట్టి ప్రజలకు అన్యాయం చేశారని అన్నీ రాజా విమర్శించారు. వయనాడ్‌లో తన కోసం పని చేసిన కాంగ్రెస్ కార్యకర్తలను రాహుల్ గాంధీ వెర్రివాళ్లను చేశారని సురేంద్రన్ విమర్శించారు. కాగా, రాహుల్ గాంధీ రెండుచోట్ల గెలిస్తే ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. అప్పుడు ఏ నియోజకవర్గానికి రాజీనామా చేస్తారో ముందే చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేస్తున్నారు.

భయపడకు రాహుల్.. పారిపోకు: మోదీ

అమేథీలో ఓడిపోయి వయనాడ్ వెళ్లిన రాహుల్ గాంధీ ఇప్పుడు అక్కడ కూడా ఓడిపోతాడనే భయంతోనే రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. వయనాడ్‌లో పోలింగ్ తర్వాత ఓటమి భయంతో 'యువరాజు' మరో స్థానాన్ని వెతుక్కుంటారని తాను ముందే చెప్పానని ఆయన గుర్తు చేశారు. 'భయపడకు, పారిపోకు' అని రాహుల్ గాంధీకి మోదీ హితవు పలికారు. కాగా, అమేథీలో ఎన్నికల బరి నుంచి గాంధీ కుటుంబం తప్పుకోవడం ద్వారా పోలింగ్‌కు ముందే కాంగ్రెస్ పార్టీ అమేథీలో ఓటమిని అంగీకరించిందని కేంద్రమంత్రి, అమేథీ బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ విమర్శించారు. వయనాడ్‌కు వెళ్లి అక్కడి ప్రజలను తన కుటుంబసభ్యులుగా రాహుల్ గాంధీ చెప్పుకున్నారని, ఇప్పుడు రాయ్‌బరేలీలో ఏం చెప్తారని ప్రశ్నించారు.

సొంత కారు, ఫ్లాట్ లేదట!

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యూపీలోని రాయ్‌బరేలీలో నామినేషన్ సందర్భంగా తన ఆస్తులు, అప్పుల వివరాలను ప్రకటించారు. అందులో తెలిపిన వివరాల ప్రకారం రాహుల్ పేరున రూ.20 కోట్లకు పైగా ఆస్తులున్నాయి. అందులో రూ. 4.2లక్షల విలువైన బంగారం కూడా ఉంది. అయితే తన పేరున ఎలాంటి నివాస ఫ్లాట్ కానీ, కారు కానీ లేదని తెలిపారు. ఇక అప్పులు రూ.49,79,184 ఉన్నాయి. చరాస్తులు రూ. 9,24,59,264, స్థిరాస్తులు రూ.11,15,02,598 ఉన్నాయి. రాహుల్ విద్యార్హతలు పరిశీలిస్తే యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జి, ట్రినిటీ కాలేజీ నుంచి ఎంఫిల్ డిగ్రీ, ఫ్లోరిడాలోని రోలిమ్స్ కాలేజీ నుంచి బ్యాచ్‌లర్ డిగ్రీ అందుకున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తనపై 18 కేసులున్నట్టు వెల్లడించారు.

రాయ్‌బరేలీ ఎందుకు ?

వయనాడ్‌లో ఓడిపోయినా కచ్చితంగా గెలిచే స్థానం నుంచి పోటీ చేయాలనే ఆలోచనతోనే రాహుల్ గాంధీ రాయ్‌బరేలీని ఎంపిక చేసుకున్నట్టు కనిపిస్తున్నది. ఇక్కడి నుంచి ఇందిరా గాంధీ మూడుసార్లు, ఆమె భర్త ఫిరోజ్ గాంధీ రెండుసార్లు గెలుపొందారు. 2004, 2009, 2014, 2019లో సోనియా గాంధీ విజయం సాధించారు. ఈసారి సోనియా గాంధీ రాజ్యసభకు ఎన్నిక కావడంతో రాయ్‌బరేలీ బరి నుంచి తప్పుకున్నారు. కచ్చితంగా గెలుస్తాననే నమ్మకంతోనే రాహుల్ గాంధీ రాయ్‌బరేలీని ఎంపిక చేసుకున్నారు.

ఎన్ని ఓట్లు వస్తే అన్ని మొక్కలు నాటుతా

- ఓటర్లకు బెంగాల్ నటుడు దేవ్ ఆఫర్
- నామినేషన్ వేసే ముందు రక్తదానం



కోల్‌కతా, మే 3: తమను గెలిపిస్తే రోడ్లు వేస్తాం, కమ్యూనిటీ హాళ్లు కట్టిస్తాం అంటూ రకరకాల హామీలు ఇచ్చే అభ్యర్థులను చాలామందినే చూశాం. కానీ, పశ్చిమ బెంగాల్‌లోని ఘటల్ లోక్‌సభ స్థానం నుంచి తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దీపక్ అధికారి(దేవ్) రూటు సపరేటు. తనకు వేసే ఓట్లకు బదులుగా మొక్కలు నాటుతానని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. తనకు ఎన్ని ఓట్లు పోలైతే అన్ని మొక్కలు నాటుతానని ప్రకటించారు. తనకు తొమ్మిది లక్షల ఓట్లు వస్తే.. తొమ్మిది లక్షల మొక్కలు నాటుతానని చెప్పారు. అంతేకాదు, నామినేషన్ వేసే విషయంలోనూ ఆయన అందరు అభ్యర్థులకు భిన్నంగా వ్యవహరించారు. ముందుగా రక్తదానం చేసి, ఆ తర్వాత నామినేషన్ వేశారు. ప్రస్తుతం బ్లడ్ బ్యాంకులు రక్తం కొరతతో సంక్షోభంలో ఉన్నాయని, ప్రజలు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలనే ఆలోచనతో ఈ పని చేసినట్టు ఆయన ప్రకటించారు. బెంగాల్ నటుడైన దేవ్ 2014, 2019లో ఘటల్ నుంచి ఎంపీగా విజయం సాధించి మూడోసారి బరిలో నిలిచారు. కాగా, దేవ్‌ను బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ సంతోశ్ కుమార్ అభినందించారు. రాజకీయ లక్ష్యాన్ని పర్యావరణ సుస్థిరతతో మేళవించేలా ఈ నిర్ణయం ఉన్నదని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు.